S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 111 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 17 ఫిబ్రవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |



3

## కాంగ్రెస్ తీరు దుర్మార్గం

మండిపడ్డ కేంద్రమంత్రి బండి



# ఉత్కంఠ.. ఉద్రిక్తం.. ఉత్సాహం

## మేయర్లు, చైర్మన్ఎన్నికల్లో గందరగోళం

- నిజామాబాద్‌లో కాంగ్రెస్.. కొత్తగూడెంలో సీపీఐకి పట్టం
- కామారెడ్డి, ఆదిలాబాద్‌లో స్వతంత్రులకు అవకాశం
- ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్తత.. బల్దియా ఆసీసుపై రాళ్లదాడి
- తొర్రూర్‌లోఉద్రిక్తం.. ఎక్స్‌అఫిషియోగా ఓటేసిన ఎంపీ కావ్య
- మున్సిపల్ ఆఫీసు వద్ద బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్



**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో చైర్మన్లు, వైస్ చైర్మన్లు. మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నిక తీవ్ర ఉద్రిక్తతల మధ్య జరిగింది. కొన్ని పట్టణాలు, నగరాల్లో అంచనాలు తారుమరయ్యాయి. ఇబ్రహీంపట్నం, తొర్రూరు, క్యాతనపల్లి, జనగామ, జమ్మికుంటలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఏడు కార్పొరేషన్లలో ఐదింటిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కొత్తగూడెంలో సీపీఐ జెండా ఎగిరింది. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పదవి ఎట్టకేలకు బీజేపీకే దక్కింది. ఇక్కడ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇక్కడి నుంచి కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్‌గా మాజీ మేయర్ సునీల్ రావుగా ఎన్నికయ్యారు. నిజామాబాద్ మేయర్‌గా కూరగాయల ఉమారాణిని ఎన్నుకున్నారు.

మిగతా 2 లో



**తె**లంగాణలో మున్సిపల్ కార్పొరేషన్‌లో కొత్త పాలకవర్గాలు కొలువు తీరాయి, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లపై ఎస్ఈసీ అధికారిక వివరాలు వెల్లడించింది. ఈ వివరాల ప్రకారం కాంగ్రెస్ ఖాతాలో 82 మున్సిపాలిటీలు, 5 కార్పొరేషన్లు చేరాయి. బీఆర్ఎస్ ఖాతాలో 17 మున్సిపాలిటీలు చేరగా, బీజేపీ ఖాతాలో ఒక మున్సిపాలిటీ, ఒక కార్పొరేషన్ చేరింది. ఇక సీపీఐ ఖాతాలో కొత్తగూడెం కార్పొరేషన్ చేరగా, ఇండిట్లు నాలుగు మున్సిపాలిటీలను దక్కించుకున్నారు.

## 10 బల్దియాల్లో వాయిదా

ఖానాపూర్‌లో బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్ల గైర్హాజరు

సుల్తానాబాద్‌లో ఖరారు కాని చైర్మన్, వైస్ చైర్మన్ పేర్లు

కోరం లేక వాయిదా వేసిన అధికారులు

2



# ఏపీలో టెక్నాలజీ పాలన భేష్

### ఆర్టీజీఎస్ సందర్శన అనంతరం బిల్ గేట్స్ వెల్లడి

### డేటాలేక్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి గేట్స్‌కు వివరించిన సీఎం చంద్రబాబు

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టెక్నాలజీతో అందిస్తున్న పాలన అద్భుతంగా ఉందని గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ వ్యాఖ్యానించారు. సోమవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఉన్న రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సందర్శించిన బిల్ గేట్స్ అక్కడ డిస్ ప్లే వాల్స్‌పై ప్రదర్శించిన ప్రజంటేషన్లను తిలకించారు. ఆర్టీజీఎస్ నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని ఆసాంతం పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ముందుగా రాష్ట్రంలోని డేటా లేక్ వ్యవస్థ ద్వారా అన్ని ప్రభు త్వ విభాగాలనూ అనుసంధానించామని తద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోగలుగుతున్నామని తెలిపారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డులు, అమరావతి రాజధాని అంశాలపై అధికారులు బిల్ గేట్స్‌కు డిస్ ప్లే వాల్స్ ద్వారా ప్రజెంటేషన్ ఇచ్చారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి దానిని ప్రజలకు వేగంగా అందిస్తున్నట్టు తెలియచే శారు. 42 రకాల సమాచారాన్ని ప్రజలకు, రైతులకు అందిం చటం ద్వారా తక్షణం స్పందించేందుకు ఆస్కారం కలుగుతోం దని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరసేవల్ని కూడా సులభతరం చేశామని...ప్రజల చేతుల్లోకి 921 సేవలను తీసుకెళ్లామని సీఎం వివరించారు. వీటిని ఆసక్తిగా పరిశీలించిన బిల్ గేట్స్ - మిగతా3లో

మిగతా 5 లో



## కాంగ్రెస్‌కు ప్రజల భారీ మద్దతు

- ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజల తీర్పు
- రాజకీయాలకు అతీతంగా మధిర అభివృద్ధి
- మధిరలో మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2



# శబరిమలలో మహిళలకు ప్రవేశం

విచారణకు 9మంది న్యాయమూర్తులతో ధర్మాసనం

ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 22 వరకు

కేరళలోని శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం, ఇతర మతపరమైన ప్రదేశాలలో వివక్షకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. 2026, ఏప్రిల్ 7వ తేదీ నుంచి తొమ్మిది మంది న్యాయ మూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసులను విచారించనుంది.

4

# రైతులకు ప్రభుత్వం తీపి కబురు

### సన్నవడ్ల బకాయిలు రూ.514.36 కోట్లు విడుదల



సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 తెలంగాణ ప్రభుత్వం బోనస్‌గా ఇస్తున్న విషయం తెలిసిందే. వానాకాలంలో సన్న వడ్లు అమ్మిన 2.17లక్షల మంది రైతులకు బోనస్ బకాయిలు చెల్లింపు కోసం రూ.514.36 కోట్లు విడుదల చేసింది.

2

## అంబటి కస్టడీ, బెయిల్ పిటిషన్లపై

# తీర్పు రిజర్వ్

- సంక్రాంతి సంబరాల పేరుతో లక్కీడ్రా నిర్వహించిన కేసు
- అంబటికి బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరిన న్యాయవాది పొన్నవోలు
- పూర్తి స్థాయి విచారణ కోసం కస్టడీ అవసరమన్న పోలీసుల తరపు న్యాయవాది



**అమరావతి:** మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌తో పాటు పోలీస్ కస్టడీ కోరుతూ దాఖలైన పిటిషన్లపై గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును 18వ తేదీకి రిజర్వ్ చేసింది. ఈ కేసు 2023 సంక్రాంతి సంబరాల పేరుతో నిర్వహించిన లక్కీ డ్రా వ్యవహారానికి సంబంధించినది. అంబటి రాంబాబు తరఫున పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపించారు. తీవ్ర నేరాలు, జీవితఖైదు శిక్షలు పడే కేసుల్లోనే బెయిల్ నిరాకరించాలని ఈ సందర్భంగా పొన్నవోలు అన్నారు. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో రిమాండ్ అవసరం లేదని చెప్పారు. ఈ కేసులో రెండేళ్లలోపు శిక్ష విధించే సెక్షన్లు మాత్రమే ఉన్నాయి కాబట్టి కస్టడీ అవసరం లేదని... బెయిల్ - మిగతా5లో



3

## ఇక ఈ అవమానాన్ని భరించలేను

- పార్టీలో కొనసాగడం కష్టంగానే ఉంది
- జగిత్యాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు రాసిచ్చారు
- మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి ఆవేదన



4

## రాజస్థాన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

### ఏడుగురు వ్యక్తుల సజీవ దహనం

రాజస్థాన్‌లో భివాడిలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. మరో ఇద్దరు అందులోనే చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున ఓ కెమికల్ ఫ్యాక్టరీలో అకస్మాత్తుగా మంటలు ఎగసిపడ్డాయి.

## ఏఐ సమ్మిట్‌కు భారత్ వేదిక కావడం గర్వకారణం

- ప్రపంచ దేశాలకు ప్రధాని మోడీ ఆహ్వానం

దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' ను నిర్వహిస్తుండటంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికారు.




4



# రైతులకు తీపి కబురు

**సన్నవడ్ల బకాయిలు రూ.514.36 కోట్లు విడుదల**

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** ధాన్యం రైతులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఖరీఫ్‌లో సన్న వడ్లు కొనుగోలుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బోనస్ బకాయిలను క్లియర్ చేస్తూ రూ. 514.36 కోట్ల నిధులను విడుదల చేసింది. క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ రూపంలో రైతుల ఖాతాల్లో నేరుగా జమ కానున్నాయి. దీని ద్వారా సుమారు 2.17 లక్షల మంది రైతులు నేరుగా లబ్ది పొందనున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మొత్తం 1,939.58 కోట్ల రూపాయల బోనస్‌ను చెల్లించింది. రాష్ట్రంలో సన్న బియ్యం సాగును ప్రోత్సహించడం, రైతులకు మెరుగైన గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. ర÷తుల సంక్షేమమే ప్రాధాన్యంగా .. ధాన్యం కొనుగోళ్లు, బోనస్ చెల్లింపులు, ఎమ్ఎస్‌పీతో పాటు అదనపు ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ నిధుల విడుదలతో పెండింగ్ బకాయిలు దాదాపు పూర్తిగా క్లియర్ అయ్యే అవకాశం ఉంది. రైతులు తమ బ్యాంక్ ఖాతాలను చెక్ చేసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత కొనుగోలు కేంద్రాలు, సివిల్ సప్లైస్ శాఖను సంప్రదించాలని అధికారులు సూచించారు. పెండింగ్ బకాయిలు విడుదలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కేంద్ర నిధులపై దృష్టి పెట్టండి

**అధికారులకు సీఎస్ ఆదేశాలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో వివిధ విభాగాల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, నిధులు మార్చి నెలాఖరులోగా సమీకరించుకునేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎస్ఎన్ఏ నిధులు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్స్, ఇతర పథకాల క్రింద రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ప్రత్యేక దృష్టి సారించి, దీనిపై ఢిల్లీలో ఒక ప్రత్యేక అధికారిని నియమించుకొని సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్యారోగ్య,గిరిజన సంక్షేమ శాఖల వారీగా కేంద్రం నుంచి సుమారు 15 వేల కోట్ల రూపాయిలు రావాల్సి ఉందని, వీటిని సమీకరించుకొని రాష్ట్రంలోని పెండింగ్ పనులకు ఖర్చు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 2, 3 తేదీల నుండి జూన్2వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై వివిధ డిపార్టుమెంట్ల వారీగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్ విభాగాలలో ఈ ప్రణాకను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇటీవల గ్రామపంచాయతీ, మున్సిపల్ లోకల్ బాడీస్ ఎన్నికలు ముగిసినందున ఎన్నికైన వార్డుమెంబర్లు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సలర్స్, కార్పొరేటర్స్ తదితర ప్రజాప్రతినిధులకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు బాధ్యతతో కూడిన విధులు నిర్వర్తించేందుకు ఈ వందరోజుల కార్యాచరణ ప్రణాళిక(100 డేస్ యాక్షన్ ఎ÷-లాన్) ఉపకరిస్తుందని సిఎస్ తెలిపారు. గ్రామాల్లో,పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్ల మరమ్మతులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండాకు తగు చర్యలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ యాక్షన్ ఎ÷-లాన్ రూపొందించాలని సూచించారు. రానున్న కేబినెట్ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను రేపటిలోగా సమర్పించాలని సీఎస్ సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, సి.వీ.ఆనంద్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, ఎన్. శ్రీధర్, యోగితారాణా, కార్యదర్శులు క్రిస్టినా చొంగ్తు, టికె శ్రీదేవి, స్టీఫెన్ రవీంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 18న మీడియా అకాడమీలో శిక్షణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** భూ హక్కులు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ రిపోర్టింగ్ పై ఒక్క రోజు శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు తెలిపారు. నెల 18వ తేదీన ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నాంపల్లిలోని తెలగాంణ మీడియా అకాడమి ఆడిటోరియంలో ఈ శిక్షణా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో భూ చట్టాలు- భూ సమస్యల పరిష్కారం, వ్యవసాయం-అనుబంధ రంగాలలో ప్రభుత్వ స్కీములు, బ్యాంకు రుణాలు, పర్యావరణ భద్రత, చెరువులను కాపాడుకోవడం, జర్నలిస్టుల నైతిక నియమావళి, మీడియా-చట్టాలు, డిజిటల్ రిపోర్టింగ్, వ్యవసాయం, రైతు సమస్యలు, గ్రామీణ ప్రాంతాలు, రెవెన్యూ అంశాలపై జర్నలిస్టులకు అవగాహన కల్పించడంతోపాటు రిపోర్టింగ్‌లో పర్యావరణ, సాంకేతిక అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిపుణులు వివరించనున్నట్లు ఆయన తెలిపారు. మీడియా రంగం వేగంగా రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకుని, సమాజానికి నిష్పక్షపాత, బాధ్యతాయుతమైన సమాచారం అందించాల్సిన అవసరం ఉందని కార్యదర్శి పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా జర్నలిస్టులు తమ వృత్తిపరమైన ప్రతిభను మరింత పెంపొందించుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు.

# ఉత్కంఠ.. ఉద్రిక్తం.. ఉత్సాహం

మొదటి పేజీ తరువాయి

తొలిసారిగా కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ అయిన మంచిర్యాల, మహబూబ్ నగర్, నల్లగొండలలో కాంగ్రెస్ జెండా ఎగిరింది. రామగుండం మేయర్‌గా మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్‌గా 57వ డివిజన్ కార్పొరేటర్ పాతిపెల్లి ఎల్లయ్య ఎన్నికయ్యారు. అనూహ్య పరిణామాల మధ్య కామారెడ్డి, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ స్థానాలు ఇండిపెండెంట్లకు దక్కాయి. కామారెడ్డి నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపొందిన ఇప్ప ఉమారాణి మున్సిపల్ చైర్ పర్సన్ అయ్యారు. ఆమె కౌన్సిలర్‌గా గెలిచిన తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. ఇక్కడ మ్యాజిక్ ఫిగర్ దక్కక పోవడంతో ఉమారాణికి కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతు ఇచ్చాయి. వైస్ చైర్ పర్సన్ బీఆర్ఎస్ కు దక్కింది. ఆదిలాబాద్ లో కాంగ్రెస్ బలపర్చిన స్వతంత్ర అభ్యర్థి బండారి అనూష చైర్ పర్సన్ గా ఎన్నికయ్యారు. తొర్రూరులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చోటు చేసుకున్న గొడవలో మాజీ మంత్రి ఎర్రబెల్లి పీఏకు స్వల్పంగా గాయాలయ్యాయి. ఇక్కడి నుంచి వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ఎక్స్ అఫీషియో ఓటును వినియోగించుకునేందుకు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. ఇబ్రహీంపట్నం లో కౌన్సిలర్ల కిడ్నాప్ వార్త కలకలం రేపింది. దీంతో ఆందోళన కారులు బల్దియా ఆఫీసుపై రాళ్లు రువ్వడంతో గందరగోళం నెలకొంది.




# 10 మున్సిపాలిటీల్లో వాయిదా

**ఖానాపూర్‌లో బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్ల గైర్హాజరు**

**సుల్తానాబాద్‌లో ఖరారు కాని చైర్మన్, వైస్ చైర్మన్ పేర్లు**

**కోరం లేక వాయిదా వేసిన అధికారులు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** రాష్ట్రవ్యాప్తంగా 9 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ఎన్నికలు వాయిదా పడ్డాయి. పలుచోట్ల బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవానికి గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేక పాలకమండలి ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, ఇంద్రేశం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు, జనగామ, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, నిర్మల్ జిల్లా ఖానాపూర్, మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్, మహబూబాబాద్ జిల్లా తొర్రూర్, డోర్నకల్ బల్దియాలో చైర్మన్, వైస్ చైర్మనే పేర్లు ఇంకా ఫిక్స్ కాలేదు.

**కుదరని ఏకాభిప్రాయం**

**నిర్మల్:** ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోరం లేకపోవడంతో వాయిదా పడింది, 12 మంది కౌన్సిలర్లకు గాను కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు, ఒక్క ఇండి పెండెంట్ కౌన్సిలర్ మాత్రమే సమావేశానికి హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. మిగతా నలుగురు బీజేపీ సభ్యులు, నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైరాజరయ్యారు. దీంతో కోరం లేక ఎన్నికలు వాయిదా వేశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య జరిగిన మంతనాలు సయోధ్య కుదరలేదని తెలుస్తోంది.



**క్యాతనపల్లిలో తీవ్ర ఉద్రిక్తత**

**కోల్ బెల్ట్:** మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీస్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ శ్రేణులు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సుమారు రెండు గంటలు సేపు అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఉదయం 10.30 గంటల కు మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవాల్సిన కౌన్సిలర్లు..12 గంటల వరకు కూడా ఎవరు రాలేదు. దీంతో కోరం లేకపోవడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు మందమర్రి తహసీల్దార్, ప్రత్యేక అధికారి సతీష్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

## తొర్రూరులో ఉద్రిక్తత

**మున్సిపల్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ ఘర్షణ**

**భారీగా మోహరించిన పోలీసులు**

**మహబూబాబాద్, ఫిబ్రవరి 16 :** తొర్రూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు ఘర్షణకు దిగాయి. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు బస్సులో మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. చివరకు బస్సును ఆఫీస్ వరకు అనుమతించారు. అనంతరం ఎమ్మెల్యే యశస్విని రెడ్డితో కలిసి కాంగ్రెస్ కౌన్సిలర్లు వచ్చారు. వరంగల్ ఎంపీ కావ్యను ఎక్స్ అఫీషియో సభ్యులుగా నమోదు చేయడం పట్ల మాజీ మంత్రి ఎర్రబెల్లి అభ్యంరతం వ్యక్తం చేశారు. మాజీ మంత్రిని అధికారులు అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ క్రమంలో అక్కడికి భారీ సంఖ్యలో చేరుకున్న ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పరం వ్యతిరేకంగా నినాదాలు చేసుకున్నారు. ఎర్రబెల్లి పీఏపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడ్డారు. పరిస్థి తి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు.

# పట్టణాల్లో కాంగ్రెస్‌కు ప్రజల భారీ మద్దతు

**ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజల తీర్పు**

**రాజకీయాలకు అతీతంగా మధిర అభివృద్ధి**

**మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**ఖమ్మం,ఫిబ్రవరి16 :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘనవిజయంపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మధిరలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా పట్టణాల్లో కాంగ్రెస్‌కు ఈ స్థాయిలో ప్రజలు పట్టం కట్టడం చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమం , ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే ప్రజలు ఈ తీర్పు ఇచ్చారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలోని సుమారు 90 నుంచి 95 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. కేవలం గ్రామాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో కూడా కాంగ్రెస్ అత్యంత బలంగా ఉందని ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పట్టణ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం చేసిన కృషికి ఇది నిదర్శనమని ఆయన కొనియాడారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీని ఏకపక్షంగా గెలిపించిన ఓటర్లకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా, ప్రభుత్వం మరింత బాధ్యతగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి, పట్టణ ప్రజల రుణం తీర్చుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భవిష్యత్తు ప్రణాళికల గురించి మాట్లాడుతూ, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఇందుకోసం పారిశ్రామికీకరణ, మౌలిక వసతుల కల్పన , ఉద్యోగాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మధిర నియోజకవర్గాన్ని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా 'డెవలప్మెంట్ కమిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. 'నో పాలిటిక్స్.. ఓన్లీ డెవలప్మెంట్' అనే నినాదంతో ముందుకు సాగుతామని, ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# నేటి నుంచి బయో ఏషియా సదస్సు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 17 మంగళవారం నుండి భాగ్యనగరంలో అట్టహాసంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ ఏడాది సదస్సును 'టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), ఆటోమేషన్ వంటివి లైఫ్ సైన్సెస్ , హెల్త్‌కేర్ రంగాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయనే అంశాలపై ఈ సదస్సులో లోతైన చర్చలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, అనంతరం సదస్సును ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సదస్సులో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు అంతర్జాతీయ స్థాయి నిపుణులు పాల్గొంటారు. పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్, ఆమ్జెన్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ హోవర్డ్ వై చాంగ్ పాల్గొననున్నారు.




వీరితో పాటు 50కి పైగా దేశాల నుండి సుమారు 4,000 మంది ప్రతినిధులు, శాస్త్రవేత్తలు , ఫార్మా దిగ్గజాలు ఈ వేదికపై తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించిన అనేక కీలక అంశాలతో పాటు నెక్ట్స్ జనరేషన్ బయోలాజిక్స్.. ఔషధ తయారీలో వస్తున్న నూతన మార్పులు. ఏఐ / డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్.. డేటా అనలిటిక్స్ , ఏఐ సాయంతో రోగ నిర్ధారణ, చికిత్స. తెలంగాణ రైజింగ్ 2047.. 2047 నాటికి తెలంగాణను వరల్డ్-క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్‌గా మార్చే రోడ్‌మ్యాప్. ఆర్ / డీ (పరిశోధన).. గ్లోబల్ హెల్త్ ఇంపాక్ట్ , కొత్త వ్యాధుల చికిత్సకు అవసరమైన మౌలిక వసతులు వంటి వాటిపై చర్చాగోష్టులు నిర్వహించనున్నారు. ఈ సదస్సు ద్వారా హైదరాబాద్ నగరం ప్రపంచ లైఫ్ సైన్సెస్ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోనుంది. లైఫ్ సైన్సెస్ రంగంలో సుమారు 9,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, 175కి పైగా ప్రదర్శనకారులు ఈ సదస్సు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. దేశంలోనే అతిపెద్ద 'టెక్‌బయో' హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సదస్సు రూపుదిద్దుకుంది.

# ఇక ఈ అవమానాన్ని భరించలేను

- పార్టీలో కొనసాగడం కష్టం
- జగిత్యాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు రాసిచ్చారు
- కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి ఆవేదన



**జగిత్యాల,ఫిబ్రవరి16 :** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ ఏంటో గోచరించడం లేదని, అవమానాలు ఇంకెంతకాలం భరించాలని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గాల మధ్య విభేదాలు తలెత్తిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకున్నప్పటికీ.. ఛైర్మన్ పదవి ఎవరికి ఇస్తారన్న దానిపై ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ క్రమంలోనే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గీయులు క్యాంప్ రాజకీయాలు చేశారు. చివరికి సంజయ్ వర్గానికి చెందిన వ్యక్తి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతో జీవన్‌రెడ్డి అసహనానికి గురైనట్లు సమాచారం. ఈ ఎన్నిక ముగింపు కాదు.సోమవారం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ ఉన్నంతకాలం నాకు వేధింపులు తప్పవు. పవర్ ఆఫ్ అటార్నీ ఎమ్మెల్యే సంజయ్‌కు రాసిచ్చారా అంటూ ఆవేదన చెందారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు జగిత్యాల కాంగ్రెస్ పట్టా రాసిచ్చారు. ఎమ్మెల్యే పార్టీ మారలేదని స్పీకర్ అంటున్నారు. ఆయన మాత్రం కాంగ్రెస్ పార్టీతో సంసారం చేస్తున్నారు. కార్యకర్తల మనోభావాలను పార్టీ అధినాయకత్వం గౌరవించాలి. జగిత్యాలలోనే ఇలా ఉంటే.. పార్టీ మారిన మరో 9 ప్రాంతాల్లో ఎలా ఉందో..అని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపిక విషయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అసంతృప్తితో ఉన్నారు. తన ప్రతిపాదనను కాదని, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి అధిష్టానం ప్రాధాన్యత ఇవ్వడంతో ఆయన కలత చెందారు. తన వర్గానికి చెందిన వ్యక్తికి కాకుండా.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన సమిండ్ల వాణిని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎంపిక చేయడాన్ని ఆయన అవమానంగా భావిస్తున్నారు. 'నా గురించి, పార్టీతో నాకు ఉన్న అనుబంధం గురించి మీకు తెలుసు. పార్టీలో కొనసాగాలనే విషయంపై ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయన ఎవరో వచ్చి మా మీద ఆధిపత్యం చెలాయిస్తున్నారు. మా హక్కులను కాలరాస్తున్నారు. మా కాంగ్రెస్ కార్యకర్తల హక్కులను కాపాడలేకపోతున్నా. ఈ క్షోభ ముగింపు కాదు. ఈ వేధింపులు భరిస్తూ పార్టీలో కొనసాగగలుగుతామా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ వేధింపులు భరించగలుగుతానా? ఎంత కాలం భరించగలుగుతాను? దీనికి పరిష్కారం ఏంటి? అని కూడా ఊహించలేకపోతున్నా' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా నేడు కేసీఆర్ జన్మదిన వేడుకలు

## తెలంగాణ భవన్‌లో 72 కిలోల కేక్ కట్ చేస్తాం

### బిఆర్ఎస్ నేత సాయికిరణ్ వెల్లడి





**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** తెలంగాణ రాష్ట్రం అంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే రోజు కేసీఆర్ పుట్టిన రోజు అని బీఆర్ఎస్ నేత తలసాని సాయికిరణ్ యాదవ్ అన్నారు. ఆయన గాంధేయ మార్గంలో తెలంగాణ రాష్ట్రాన్ని ధించిన నాయకుడని కొనియాడారు. తెలంగాణభవన్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెచ్చిన తెలంగాణను పదేండ్లలో దేశంలోనే నెంబర్ వన్ స్థాయికి తీసుకెళ్ళిన నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. తెలంగాణ జాతిపితగా కేసీఆర్‌ను గౌరవవిస్తారని, రేపు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ పుట్టినరోజు ఘనంగా జరుపుతున్నామని తలసాని సాయికిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్, హరీష్ రావుతోపాటుగా తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితర సీనియర్ నేతలు అందరూ పాల్గొంటారని చెప్పారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు ఉంటాయన్నారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ 72వ పుట్టినరోజు సందర్భంగా 72 కిలోల కేక్ కటింగ్ ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రావణ కాష్టంగా మారిందని సాయికిరణ్ అన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని ఆరోపించారు. మున్సిపాలిటీ ఎన్నికలకు ఏ ముఖ్యమంత్రి కూడా ప్రచారం చేసిన దాఖలాలు లేవని అన్నారు. ముఖ్యమంత్రి ప్రచారం చేసినా కాంగ్రెస్ పార్టీకి 42 శాతం ఓటు షేర్ వచ్చిందని చెప్పారు. రేవంత్ రెడ్డి ఆయన జీవిత కాలంలో మళ్ళీ ముఖ్యమంత్రి కాలేడని అన్నారు. రౌడీయిజం ఎన్నో ఏండ్లు సాగదని వ్యాఖ్యానించారు. పదేండ్లు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీలా తాము కూడా వ్యవహరిస్తే ఆ పార్టీ ఉండేదే కాదన్నారు. కేసీఆర్‌ను తక్కువ చేసి మాట్లాడినంత మాత్రాన ఆయన పవర్ తగ్గదని, ప్రజల గుండెల్లో కేసీఆర్ ఉంటారని అన్నారు. గాంధేయ మార్గంలో ఉద్యమం ఎలా చెయ్యాలో కేసీఆర్ తమకు నేర్పించారని చెప్పారు. ఉద్యమాలు తమకు కొత్తకాదని, తమ నాయకులపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎదుర్కొంటామని అన్నారు. తెలంగాణ భవన్‌లో డప్పు వాయిద్యాలతో కోలాహలంగా కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు జరుగుతాయని తలసాని సాయికిరణ్ చెప్పారు. బీఆర్ఎస్ శ్రేణులు గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో స్థానికంగా తమ కార్యక్రమాలు ముగించుకొని తెలంగాణ భవన్‌కు రావాలని కోరారు.

# రష్యా నిర్ణయంపైనే బంగారం ధరలు

## డాలర్‌తో వాణిజ్యం కొనసాగితే తగ్గనున్న పసిడి

### అంతర్జాతీయ నిపుణుల వెల్లడి





**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** అంతర్జాతీయ పరిస్థితులు బంగారాన్ని కంట్రోల్ చేస్తున్నాయి. రష్యా రూబుల్‌తో వ్యాపారం కారణంగా పరిస్థతి దిగజారిందని అంటున్నరు. తిరిగి రష్యా డాలర్‌తో వ్యఆరాన్ని పునరుద్దరిస్తేనే బంగారం రేట్లు దిగి వస్తాయని అంటున్నారు. బంగారం అంటే ఇష్టపడేవారికి పండగలాంటి అంచనాను నిపుణులు వెలువరించారు. ఇప్పుడు 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్షన్నర పైగా ఉండగా, ఇది రూ.లక్ష లోపునకు రావచ్చుని.. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 5,000 డాలర్ల వద్ద కదలాడుతుండగా, 3,000 డాలర్లకు దిగిరావచ్చుని అంచనా వేస్తున్నారు. రష్యా కనుక అమెరికా డాలర్లలో వాణిజ్యాన్ని పునఃప్రారంభించినప్పుడే, ఇది జరుగుతుందని పేర్కొంటున్నారు. అంతర్జాతీయ విపణికి అనుగుణంగా దేశంలో గతేడాది బంగారం, వెండి ధరలు శరవేగంగా దూసుకెళ్లాయి. ఏడాది వ్యవధిలోనే బంగారం ధర 70 శాతానికి పైగా పెరిగి, గత నెలలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.80 లక్షలకు మించి గరిష్ఠస్థాయిని తాకినా, ప్రస్తుతం రూ.1.59 లక్షల వద్ద ఉంది. అంతర్జాతీయంగానూ ఔన్సు బంగారం ధర 5600 డాలర్లపైకి వెళ్లినా, మళ్లీ ఇప్పుడు 5000 డాలర్ల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించాక, అంతర్జాతీయ అనిశ్చితులు పెరగడంతో, సురక్షితమని భావిస్తూ బంగారంపైకి పెట్టుబడులు వెల్లువెత్తుతుండటమే ధరల వృద్ధికి కారణం. ఆ రెండు దేశాల మధ్య శాంతి చేకూర్చాలని, వచ్చే జూన్ కల్లా యుద్ధాన్ని నిలిపివేయాలనే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉన్నారు. ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఆయన సంప్రదింపులు జరిపారు. రష్యా చమురు కొనకుండా, భారత్ సహా పలు దేశాలపై భారీ సుంకాలు విధించడంతో, రష్యా కూడా దారికి వస్తున్న సూచనలున్నాయి. అమెరికాతో వాణిజ్య సంబంధాలు పునరుద్ధరించుకునేందుకు, అమెరికా డాలర్లలో వాణిజ్యం నిర్వహించేందుకు రష్యా సన్నాహాలు చేస్తున్నట్లు వార్తా ఏజెన్సీ బ్లూమ్‌బర్గ్ తెలిపింది. డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీలు తేవాలన్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల సన్నాహాలకు ఇది పెద్ద ఎదురుదెబ్బే. రష్యా కనుక అంతర్జాతీయ వాణిజ్య సెటిల్‌మెంట్లను డాలర్లలో నిర్వహిస్తే, అమెరికా కరెన్సీకి ఊపొస్తుంది. పసిడిపై పెట్టుబడులు మళ్లీ డాలర్‌కు చేరతాయి. అప్పుడు కేంద్రబ్యాంకులూ బంగారం కొనడం ఆపేస్తాయి. అంతర్జాతీయ పసిడి నిల్వల్లో 20? బ్రిక్స్ దేశాల వద్దే ఉన్నాయని అంచనా. బ్రిక్స్ దేశాలతో అనుబంధం ఉన్న దేశాల నుంచే, అంతర్జాతీయ పసిడి ఉత్పత్తిలో 50? వాటా ఉంది. ఇప్పుడీ దేశాలన్నీ బంగారాన్ని ఉత్పత్తి చేస్తున్నా, అతి తక్కువగా మాత్రమే విక్రయిస్తున్నాయి. ధరలు పెరిగేందుకు ఇదీ కారణమైంది. ఇప్పుడు మళ్లీ డాలర్‌కు మద్దతు పెరిగితే, అమెరికా బాండ్లకు గిరాకీ వస్తుంది. అందువల్ల బంగారంపై పెట్టుబడులు ఉపసంహరించడం ప్రారంభిస్తే ఔన్సు ధర 2027 ఆఖరుకు 3,000 డాలర్లకు దిగిరావ్చని సెబీ నమోదిత మార్కెట్ నిపుణులు అనుజ్ గుప్తా, అమిత్ గోయల్ వంటివారు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.90,000-1,00,000 వద్ద స్థిరపడొచ్చని అంచనా వేస్తున్నారు.

# సెంట్రల్ వర్సిటీ ల్యాప్‌టాప్ చోరీ కేసు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ల్యాప్‌టాప్‌ల చోరీ కేసును గచ్చిబౌలి పోలీసులు చేధించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. సీఆర్ రావు ఏఐఎమ్‌సీఎస్ విభాగం టార్గెగా చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. చోరీలో కూకట్‌పల్లికి చెందిన రేగుల చంద్రశేఖర్‌ని(30) ప్రధాన నిందితుడిగా గుర్తించారు. మిగిలిన ఇద్దరు సాయిచరణ్(19), అశ్విన్ రావు (19)ను అరెస్ట్ చేశారు. వీరిద్దరూ విద్యార్థులే. యూనివర్సిటీ భద్రతా వ్యవస్థ గురించి సరైన అవగాహనతో, అర్ధరాత్రి సమయంలో దుండగులు లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేసి.. నిందితులను గుర్తించి, అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి సుమారు 60 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే చోరీకి ఉపయోగించిన 2 కార్లు, 3 సెల్ ఫోన్లను కూడా సీజ్ చేశారు. ఈ కేసులో నిందితులను రిమాండ్‌కు తరలించారు గచ్చిబౌలి పోలీసులు. యూనివర్సిటీ క్యాంపస్‌లో భద్రతా లోపాలపై కూడా దృష్టి సారించి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# న్యాయవాది హత్య కేసు

## డీజీపీని నివేదిక కోరిన మానవ హక్కుల కమిషన్



**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** చేవెళ్ల పరిధిలో జరిగిన భూ వివాద ఘటనలో న్యాయవాది జి. స్వప్న కుమారి దారుణ హత్యను నివారించడంలో మొయినాబాద్ పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై, డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన న్యాయవాదులు దాఖలు చేసిన ఫిర్యాదు పరిగణనలోకి తీసుకుంది. మృతురాలు తన సోదరుడిని నిందితుడిగా పేర్కొంటూ తన ప్రాణాలకు ముప్పు ఉందని ముందుగా పోలీసులకు హెచ్చరించినప్పటికీ, పోలీసులు సకాలంలో నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని, ఇది విధి నిర్వహణలో తీవ్రమైన నిర్లక్ష్యంగా పరిగణించాల్సిన విషయమని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) నుండి సమగ్ర నివేదిక కోరుతూ, కేసును తదుపరి పరిశీలన కోసం మార్చి6కు వాయిదా వేశారు.



# కాంగ్రెస్ తీరు దుర్మార్గం

## మండిపడ్డ కేంద్రమంత్రి బండి

**కరీంనగర్, ఫిబ్రవరి 16:** కరీంనగర్ పట్టణ మేయర్ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుసరించిన తీరుపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల తీర్పును పక్కనబెట్టి కాంగ్రెస్ కుట్రలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక విషయంలో అధికారాన్ని దుర్వినియోగం చేసి బీజేపీకి మేయర్ పదవి రాకుండా అడ్డుకుందని మండిపడ్డారు. బీజేపీ బలపడుతున్నందుకే కాంగ్రెస్ భయపడుతోందని అన్నారు. ప్రజల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణను కాంగ్రెస్ తట్టుకోలేకపోతోందని పేర్కొన్నారు. తాను ప్రధాని నరేంద్ర మోదీకి మాటిచ్చానని, కరీంనగర్‌లో బీజేపీని గెలిపించి తన హామీని నిలబెట్టుకున్నానని తెలిపారు. కరీంనగర్ ప్రజలు ఎప్పటికీ బీజేపీతోనే ఉంటారని, భవిష్యత్తులో కూడా పార్టీ విజయాలను కొనసాగిస్తుందని బండి సంజయ్ పేర్కొన్నారు. బలం లేని చోట కూడా కాంగ్రెస్ కుట్రలకు తెరలేపిందన్నారు. ప్రలోభాలతో కార్పోరేటర్లను వశపరచుకునే ప్రయత్నం చేసిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నీతిమాలిన పనులను ఆయన తప్పుపట్టారు. కాగా, కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ దక్కించుకుంది. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో ఆ పార్టీ నేత కొలగాని శ్రీనివాస్ మేయర్‌గా ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా కూడా అదే పార్టీకి చెందిన సునీల్‌రావు అనే వ్యక్తి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి అధికారికంగా ఈ విషయాన్ని వెల్లడించారు. మేయర్ పదవిని సాధించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కీలక పాత్ర పోషించారు.

# చిరంజీవి భుజానికి సర్జరీ

## కోలకుంటున్నానంటూ పోస్ట్



**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** అగ్ర కథానాయకుడు చిరంజీవి భుజానికి సర్జరీ జరిగింది. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఎక్స్ వేదికగా చిరు పోస్ట్ పెట్టారు. తాను త్వరగా కోలుకోవాలని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.చేతికి పట్టీ ఉండటం గమనించి పలువురు శ్రేయోభిలాషులు నా ఆరోగ్యం గురించి ఆరా తీశారు. నా భుజానికి చిన్న కీ-హోల్ సర్జరీ జరిగింది. ప్రస్తుతం నేను బాగానే కోలుకుంటున్నా. నా దినచర్య సజావుగా సాగుతోంది. ఆర్థోస్కోపీ సర్జన్ డాక్టర్ నితిన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. సర్జరీ విషయంలో తీసుకున్న జాగ్రత్తలు, ఆయన నైపుణ్యంతో ఆ పక్రియ అంతా సజావుగా, సౌకర్యవంతంగా సాగింది. నా పట్ల మీరు చూపిస్తున్న ప్రేమ, అభిమానం, అందిస్తున్న దీవెనలకు మనసు ఎంతో సంతోషంగా ఉందని ఎక్స్ వేదికగా చిరంజీవి వెల్లడించారు. ఇదిలావుంటే అల్లు శిరీష్ వివాహం సందర్భంగా మొదటి శుభలేఖను చిరంజీవికి అందించారు. అల్లు అరవింద్ దంపతులు, అల్లు శిరీష్ స్వయంగా చిరు ఇంటికి వెళ్లి నూతన వస్త్రాలతో పాటు వివాహ ఆహ్వాన పత్రికను అందించి పెళ్లికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిరంజీవి చేతికి కట్టు ఉండటం గమనించి పలువురు అభిమానులు ఆందోళన చెందారు. ఆయనకు ఏమైందంటూ ఆరా తీయడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో చిరంజీవి స్వయంగా తన ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ పోస్ట్ పెట్టారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగింది

## ఫలితాలపై బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు విశ్లేషణ



**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజల నుండి మంచి ఆదరణ లభించిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు తెలిపారు. ఈ ఎన్నికల్లో పార్టీ ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందని తెలిపారు. గతంతో పోలిస్తే ఎక్కువ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం పార్టీ బలోపేతానికి సంకేతమని పేర్కొన్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకు ఇతర పార్టీలు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ, ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని రామచందర్ రావు అన్నారు. భైంసాలో బీజేపీ విజయం సాధించకుండా చేయాలని చాలా ప్రయత్నాలు జరిగాయని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 15 మున్సిపాలిటీల్లో బీజేపీ గట్టిపోటీ ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ది రాష్ట్రంలో బీజేపీ ప్రభావం పెరుగుతున్నదానికి నిదర్శనమని రామచందర్ రావు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తెలంగాణ బీజేపీకి ఉత్సాహాన్ని నింపాయని రామచందర్ రావు పేర్కొన్నారు.



సంపాదకీయం

# పక్కా నీటి ప్రణాళికలే రాష్ట్రాలకు మేలు!

పోలవరం సహా అనేక ప్రాజెక్టులు ఇంకా పూర్తికాలేదు. పోలవరం పన్నెండేళ్లుగా నానుతోంది. నాలుగైదే ళ్లలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ ఇంకా పూర్తి కాలేదు. ఏయేటి కాయేడు నిర్మణ ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. రాయలసీమతో సహా అనేక ప్రాజెక్టులు పూర్తి కావాల్సి ఉంది. వాటి గురించి పట్టించుకోకుండా కొత్తగా నల్లమలసాగర్ పేరుతో చంద్రబాబు ఇరు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టడం వెనక పెద్ద వ్యూహం ఉండివుంటుంది. తెలంగాణలో కూడా కాళేశ్వరంను తిడుతూ రెండేళ్లుగా కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఎన్నికల్లో గెలవడంతో తమకు ప్రజల మద్దతు ఉందని చెప్పుకోవడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చలేరు. ఇక్కడా అనేక ప్రాజెక్టులు పూర్తి కావాల్సి ఉంది. వాటిని పూర్తి చేసేందుకు రేవంత్ ప్రభుత్వం సంకల్పం ప్రకటించాలి. అంతే తప్ప ఎంతసేపు ఎన్నికలు, ఫలితాలు వంటివాటితో పొంగిపోరాదు. నీటిని వాడుకోవడం ఎలా అన్న దానిపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు కసరత్తు చేయాలి. వ్యవసాయరంగంలో విప్లవం సాధించా లంటే నీటి యాజమాన్యం కూడా ముఖ్యం. ఇకపోతే రెండేళ్ల యినా చేయాల్సిన పనులు చేయకుండా ఎంతసేపు జగన్‌ను ఆడిపోసుకోవడంతోనే కలం గడిపేస్తున్నారు. అలాగే 2027 జూన్ కంటే ముందే పోలవరం జాతికి అంకితం చేస్తామన్నది తొలి కార్యాచరణ కావాలి. ఆ ప్రాజెక్టు పూర్తి చేశాక నదుల అనుసంధానం చేపడతా మని, పోలవరం నుంచి నీటిని నల్లమల సాగర్‌కు తీసుకెళ్తామని పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రాధాన్యత ఇవ్వకుండా లేని ప్రాజెక్టుతో వివదాలు సృష్టించడం, కేంద్రంపై ఒత్తిడి తేవడం వంటివన్నీ అనవసర విన్యాసాలు తప్ప మరోటికాదు. ఇరు రాష్ట్రాల మధ్య సయోధ్యతో ముందుకు సాగాల్సిన అసవరం ఉంది. ఒకప్పుడు తాను ఉమ్మడి ఎపికి సిఎంగా చేశానని గుర్తించి చంద్రబాబు నడవాల్సి ఉంది. అంతేగాక వివాదాస్పదంగావున్న నల్లమల సాగర్ మాట ఇప్పుడు చెప్పడం ద్వారా తెలుగు రాష్ట్రాల మధ్య సఖ్యత, సౌభ్రాతృత్వానికి ఇబ్బందులు తెచ్చుకోవడమే అవుతుంది. అంతేగాక తక్కువ ఖర్చుతో సత్వర ఫలితాలి చ్చే పెండింగ్ ప్రాజెక్టుల్ని పూర్తి చేయడం అవసరం. కానీ అలా జరగడం లేదు. ఇకపోతే ఞాష్ట్రంలో నీటి వినియోగానికి సంబంధించి కొత్త పాలసీ తీసుకువస్తున్నట్టు కథనాలొచ్చాయి. ప్రస్తుతం విద్యుత్ రంగంలో అమల్లో ఉన్న రెగ్యులేటరీ కమిషన్‌లా నీటి వినియోగానికి కూడా ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కూడా వచ్చింది. గతంలోనే ప్రపంచబ్యాంకు సాగు నీటికి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించడం, అందులో భాగంగా సాగునీటి మీటర్ల ఏర్పాటుకు ఆనాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విఫలయత్నం చేసిన విషయాలు ప్రజల స్మృతి పథం నుండి ఇంకా తొలగిపోలేదు. మళ్లీ అలాంటి ప్రయత్నం చేయడం అన్నదాతలతో సర్కారు కయ్యం తెచ్చుకోవడమే అవుతుంది. నీటి సరఫరాకు చేస్తున్న ఖర్చుకు తగ్గట్టుగా ప్రజల నుండి వసూలు చేసే పన్నులు ఉండేలా చూడటం కూడా పాలసీలో భాగమంటు న్నారు. యూజర్ ఛార్జీలు వసూలు చేయకపోతే భవిష్యత్ నిర్వహణ కష్టం అవుతుందని తొలుత పరిశ్రమల తో ప్రారంభించి, ఆ తరువాత అందరికీ దీనిని విస్తరించే అవకాశం ఉ ఒదని సమాచారం. అంతకన్నా ముఖ్యం గా నీటి వినియోగ ప్రాధాన్యతల్లోనూ సర్కారు మార్పులు చేయబోతున్నదని వస్తున్న వార్తలు ఆందోళన కరం. ప్రతి ఎకరాకు సాగునీరందేలా సాగునీటి సంఘాలు కృషి చేయాలని అమరావతిలో నిర్వహించిన నీరు-ప్రగతి, జలహారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం కార్యక్రమంలో సిఎం చంద్రబాబు సూచించడం మంచిదే! అలాగే ఈ ఏడాది నుంచి ఖరీఫ్ సాగును ముందస్తుగా ప్రారంభించాలని తుపానుల వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులను సన్నద్ధం చేయాలని, కాల్వలకు మే 15 కల్లా నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించడం స్వాగతించదగినది. 'వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవాలని, పరిగెత్తే నీటిని నడిపించాలి, నడిచే నీటిని నిలబెట్టాలి, నిలిచిన నీటిని భూగర్భ జలాలుగా మార్చి భూమినే జలాశయంగా మార్చాలి?' అని చెప్పడం బాగానే వుంది. రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి వంటి 40 నదులు, 38 వేల చెరువులు ఉన్నాయని, వీటన్నిటిలో 1,300 టిఎంసిలకు పైగా నీటిని నిల్వ చేసుకోగలమనీ, ఈ ఏడాది 862 టిఎంసిల నీళు మన జలాశయాల్లో నిల్వ ఉన్నాయని వాస్తవాలు వివరించారు. వరిసాగు తగ్గించి ఎక్కువ మంది రైతులు ఉద్యాన పంటలు, తృణ ధాన్యాల వైపు దృష్టి సారించాలనడం పంటల సరళిని ఏకపక్షంగా మార్చడం మంచిదే అయినా భూములు, నీటి అనుకూలత వంటి విషయలను రైతులతో చర్చిస్తే మంచిది. పంటల సరళిలో మార్పు ఎంతో ప్రణాళికాబద్ధంగా జరగాలే తప్ప హడావుడిగా చేయరాదు. ఆయా పంటల సాగుకు భూసార అనుకూలతలు, నీటిపారుదల సౌకర్యాల లభ్యత లేదా కొరత, పంటల ఉత్పత్తుల వినియోగం, నిల్వ అవకాశాలు, మార్కెట్ పరిస్థితులు వగైరా అనేక అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేశాకనే నిర్ధారించుకొని, అవసరమైన ప్రోత్సాహకాలిచ్చి అన్నదాత లను అటువైపు మళ్లించవలసి వుంటుంది. కానీ ఆ తరహా ఆలోచనలు, తగిన సన్నాహాలు చేయకుండా ఇటువంటి సలహాలివ్వడం రాష్ట్రానికి శ్రేయ-స్కరం కాదు. ఇప్పటికే ప్రభుత్వం పంటలకంటే పరిశ్రమలకు, జెన్‌కో అధ్వర్యంలోని జల విద్యుత్ కన్నా కార్పొరేట్లు తెస్తున్న పంప్డ్ హైడ్రో ప్రాజెక్టులకూ మొగ్గు చూపుతున్న వైనం ద్యోతకమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్తగా తెచ్చే జల విధానం పై ఎవరికైనా సందేహాలు కలగడం సహజం. ఏదిఏమైనా అంతర్జాతీయ జల సూత్రాల ప్రకారం ప్రజలకు తాగు నీరు, పంటలకు సాగు నీరు, జల విద్యుత్, ఆ తరువాతనే పరిశ్రమలు, ఇతర అవసరాలనే ప్రాధాన్యత క్రమానికి లోబడి ప్రభుత్వం వ్యవహరించడం సబబుగా ఉంటుంది. ఉన్ననీటి వనరులను వాడుకోవడం, అసవరమైన పంటలను పండించడం, రైతులకు లాభాలు చేకూర్చడం అన్నది ఓ ప్రణాళికా బద్దంగా సాగాల్సిన విషయం. ఇందకు ప్రణాళికలు రచించి ముందుకు సాగితే మంచిది. అది వ్యవసాయపరంగా విప్లవాత్మకంగా మారుతుందనడంలో సందేహం లేదు.

# ఏఐ సమ్మిట్‌కు భారత్ వేదిక కావడం గర్వకారణం

- ప్రపంచ దేశాలకు ప్రధాని మోడీ ఆహ్వానం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** దేశ రాజధాని దిల్లీలోని భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమిట్ ను నిర్వహిస్తుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో పాల్గొనాల్సిందిగా ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ దేశాలకు భారత యువత ప్రతిభ, సామర్థ్యం తెలుస్తాయని.. ప్రపంచ అభివృద్ధిలో భారత్ తన సహకారాన్ని మరింత పెంచుకునేందుకు ముందడుగు వేస్తోందన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ వేగంగా వృద్ధి చెందుతుందనడానికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. గ్లోబల్ సౌత్‌లో నిర్వహిస్తున్న ఈ మొదటి ప్రధాన అంతర్జాతీయ ఏఐ సమిట్ మన దేశంలో జరుగుతుండడం గర్వకారణమన్నారు. సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' అనే ఈ సదస్సు థీమ్‌పై మోదీ మాట్లాడుతూ.. ప్రపంచదేశాల పురోగతి కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించుకోవడంలో మన ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సమిట్ వల్ల డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తిమంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందన్నారు. ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పాలన వంటి అనేక రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నేటినుంచి 20వ తేదీ వరకు దిల్లీలో జరగనున్న ఈ సదస్సుకు 45కు పైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఆయా దేశాలు తమ ఏఐ అజెండాలను నిర్వచించుకోనున్నాయి. మన ప్రతిభను ప్రదర్శించడం, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, విస్తృతం అవుతున్న అంకుర సంస్థల ఎకోసిస్టమ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం ఈ సదస్సు ఉద్దేశం.

# అన్నిరంగాల్లో కృత్రిమ మేధ వినియోగం

- సానుకూల దిశగా ఆలోచిస్తేనూ మేలు
- దుర్వినియోగం చేస్తే దుష్ఫలితాలు తప్పవు
- కేంద్రమంత్రి జితిన్ ప్రసాద్ వెల్లడి
- ఏఐ సదస్సుకు భారీగా భద్రతా ఏర్పాట్లు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** అన్ని రంగాల్లో కృత్రిమ మేధ వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ ఏఐను దుర్వినియోగం చేయడం వల్ల తీవ్ర పరిస్థితులు ఏర్పడుతాయని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి జితిన్ ప్రసాద హెచ్చరించారు. ఏఐ వాడకంలో అప్రమత్తత అవసర మని..దీనిని తప్పుడు సమాచార వ్యాప్తి కోసం వాడితే దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉ ఒదని ఆందోళన వ్యక్తంచేశారు. దిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. నిర్వహించిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ ద్వారా విద్య, వైద్య, వ్యవసాయం, పరిపాలన వంటి అన్ని రంగాల్లో పనులు సులభమవుతు న్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. కాబట్టి దేశప్రజలందరూ కృత్రిమ మేధపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ వంటి అధిక జనాభా గల దేశాల్లోని ప్రజలకు డిజిటల్ అక్షరాస్యత లేకపోతే సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి కృత్రిమ మేధ వినియోగంపై పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠ్యాంశాల్లో ఈ సమాచారాన్ని పొందుపరచాలన్నారు. ఇదిలావుంటే దేశ రాజధాని దిల్లీ వేదికగా 'ఇండియా- ఏఐ ఇంపాక్ట్ సమిట్' ప్రారంభమైంది. 20వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు బ్రెజిల్, ఫ్రాన్స్, స్పెయిన్, స్విట్జర్లాండ్, యూఏఈ తదితర దేశాల నేతలు హాజరుకానున్నారు. 45కుపైగా దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సదస్సు వేదిక 'భారత్ మండపాన్ని' కృత్రిమ మేధ ఆధారిత నిఘా, ఆధునిక రక్షణ వ్యవస్థలతో శత్రుదుర్భేద్యంగా మార్చారు. వైమానిక దాడులను అడ్డుకునేందుకు భారత్ మండపం కాంప్లెక్స్‌లో అయిదు యాంటీ డ్రోన్ వ్యవస్థలు, నాలుగు ఎయిర్ డిఫెన్స్ గన్‌లను మోహరించారు. ఉగ్రదాడుల వంటి ఘటనలను తిప్పికొట్టేందుకు ఎన్‌ఎస్‌జీ సహా పలు భద్రతా సంస్థలను రంగంలోకి దించారు. మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ, అంతర్జాతీయ వీవీఐపీల భద్రతా బాధ్యతలను ఎస్పీజీకి అప్పగించారు. సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఐటీబీపీ బృందాలు భారత మండపం పరిసరాల్లో భద్రతను పర్యవేక్షిస్తున్నాయి. దిల్లీ వీధుల్లో 10 వేలమందికిపైగా పోలీసులను మోహరించారు. సదస్సు జరుగుతున్న ప్రాంతాన్ని 10 జోన్‌లు, 22 సెక్టార్లుగా విభజించారు. వీటిని కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్, ఇంటెలిజెన్స్ సిస్టమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఏఐ కెమెరాల ద్వారా రద్దీ నిర్వహణ, అనుమానాస్పద కదలికలు, గుర్తుతెలియని వస్తువుల విశ్లేషణ చేపడుతున్నారు. డిజిటల్ పాసులు, క్యూఆర్ కోడ్‌ల ద్వారానే అతిథులను లోపలికి అనుమతిస్తున్నారు. వీవీఐపీల రాకపోకల సమయంలో ట్రాఫిక్, సెక్యూరిటీ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విదేశీ అతిథుల కోసం కేంద్రం బుల్లెట్ ప్రూఫ్ కార్లను సమకూర్చింది. వారు బస చేస్తున్న హోటళ్లలో రెండు వారాల నుంచే భద్రతా ప్రొటోకాల్‌లు అమలులో ఉన్నాయి.



# శబరిమల తదితర ప్రాంతాల్లో మహిళలకు ప్రవేశం

**విచారణకు 9మంది న్యాయమూర్తులతో ధర్మాసనం**

**ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 22 వరకు సుప్రీం విచారణ**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి16:** కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ 2018లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన 67 పిటిషన్లపై త్వరలో విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. పలు మతపరమైన ప్రదేశాలలో మహిళల ప్రవేశంపై నిషేధానికి సంబంధించి మార్చి 14లోపు లిఖితపూర్వక నివేదికలు సమర్పించాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, ఆలయ నిర్వాహకులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై విచారణ చేపట్టేందుకు 9 మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు వెల్లడించింది. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టడానికి ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 22 వరకు రెండు వారాల సమయం కేటాయిస్తున్నట్లు అత్యున్నత న్యాయస్థానం ప్రకటించింది. ఈ అంశంపై ఏప్రిల్ 7న ఉదయం 10.30 గంటలకు విచారణ ప్రారంభమవుతుందని తెలిపింది. శబరిమలతో పాటు దర్గాలు, మసీదుల్లోకి ముస్లిం మహిళల ప్రవేశం, ఇతర మతస్థుల్ని పెళ్లాడే పార్సీ మహిళలకు మతపరమైన ప్రాంగణాల్లోకి ప్రవేశం లేకపోవడం వంటి అంశాల పైనా విచారణ జరపనుంది. 2019లో అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే ఏర్పాటుచేసిన 9 మంది న్యాయమూర్తుల ధర్మాసనం సమీక్ష పిటిషన్ల నిర్వహణను ఇప్పటికే నిర్ణయించిందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే కొవిడ్ కారణంగా ఈ అంశంపై విచారణలను అకస్మాత్తుగా రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. దాదాపు ఐదేళ్ల తర్వాత మరో కొత్త ధర్మాసనంతో దీనిపై విచారణ జరపనున్నట్లు తెలిపారు.

## నేడు మోడీతో ఫ్రాన్స్ అధ్యక్షుడి భేటీ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి16 :** ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ మంగళవారం ప్రధాని మోడీతో భేటీ కానున్నారు. మాక్రాన్ భారత్ పర్యటన సందర్భంగా ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపైనా, ప్రాంతీయ ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై చర్చలు జరపనున్నారు. రేపు మోడీ, మాక్రాన్‌లు ముంబయిలో కలవనున్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది. మధ్యాహ్నం 3.15 నిమిషాల నుంచి 5.15 నిమిషాల దాకా ముంయిలోని లోక్‌భవన్‌లో ఇద్దరు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరపనున్నారు.



# రాజస్థాన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

**ఏడుగురు వ్యక్తుల సజీవ దహనం**

**జయపుర, ఫిబ్రవరి 16:** రాజస్థాన్‌లో భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. అనంతరం భారీ పేలుళ్లు సంభవించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని కర్మాగారాల్లో పని చేస్తున్నవారిని ఖాళీ చేయించామన్నారు. ఈ ప్రమాదంలో సజీవదహనమైన ఏడుగురి మృతదేహాలను బయటకు తీసినట్లు అధికారులు పేర్కొన్నారు. మరికొందరు కార్మికులు మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఎంతమంది ఉ న్నారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. ప్రమాదంలో రూ.లక్షలు విలువ చేసే వస్తువులు, యంత్రాలు బూడిదయ్యాయన్నారు. ఫ్యాక్టరీలో నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అనుమానం వ్యక్తంచేశారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అగ్ని ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ దిగ్భ్రాం÷-రతి వ్యక్తంచేశారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.



# సైలెంట్ మోడ్‌లోకి కొట్టు సత్యనారాయణ



**ఏలూరు :** పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో సీనియర్ నేత అలకపాన్పు వైసీపీలో చర్చనీయాంశంగా మారింది. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతల నుంచి తప్పించడంతో..మాజీ డిప్యూటీ సీఎం, కొట్టు సత్యనారాయణ పూర్తిగా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. పార్టీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్ పోస్ట్ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకూ ప్రజాపక్షంగా గానీ, పార్టీ పరంగా గానీ ఆయన గొంతు వినిపించకపోవడంతో, కొట్టు అలకపాన్పు ఎక్కినట్లు చర్చే జరగుతోంది.వడ్డీ రఘురామ్ నాయుడుకు వైసీపీ అధిష్టానం తాడేపల్లిగూడెం అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా నియమించడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. అయితే కొట్టు మద్దతు ఇస్తారా, లేదా అన్న డైలమా కొనసాగింది. కానీ క్యాడర్ ఆయన మద్దతు ఉన్నా, లేకున్నా, ముందుకు వెళ్లడం తప్పదంటూ కొత్త రథసారథికి స్వాగతం పలకడం, నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని సక్సెస్ చేయడంతో..కొట్టు డైలమాలో పడిపోయారట.ఈ సమావేశానికి ఇదే తాడేపల్లిగూడెంలో ఉండి కూడా కొట్టు సత్యనారాయణ హాజరుకాకపోవడం హాట్ టాపిక్‌గా మారింది. జిల్లా పార్టీ అధ్యక్షుడితో కలిపి వడ్డీ రఘురామ్ స్వయంగా కొట్టు సత్యనారాయణ నివాసానికి వెళ్లి మరీ, పార్టీ సమావేశానికి రావాలని ఆహ్వానించినా, ఆయన గైర్హాజరు కావడంపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారట. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండల అధ్యక్షులు కూడా సమావేశానికి రాకపోవడంతో, వారిపై వేటు తప్పదేమోనన్న చర్చ మొదలైంది.తాడేపల్లిగూడెంలో క్యాడర్‌ను బలోపేతం చేసే పనిలో పడ్డారట వడ్డీ రఘురామ్. పార్టీ ఇంచార్జ్ బాధ్యతలు నుంచి తొలగించిన తర్వాత ఎక్కడా కనపడని కొట్టు సత్యనారాయణ..భీమవరం పర్యటనకు వెళ్లిన వైసీపీ అధినేత జగన్‌కు స్వాగతం పలికారు. ఆ సమయంలో కొట్టు సత్యనారాయణతో జగన్ కాస్త సీరియస్‌గానే వ్యవహరించినట్లు టాక్. అధిష్టానం నిర్ణయానికి ఎవరైనా కట్టుబడి ఉండాల్సిందేనని చెప్పినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో, ఆ తర్వాత టీడీపీలో, ఆ తర్వాత వైసీపీలో చేరి ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ సీఎంగా కూడా పనిచేసిన కొట్టు సత్యనారాయణ నెక్స్ట్ స్టెప్ ఏంటనేది ఆసక్తికరంగా మారింది. ఓవైపు నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే ఉండటంతో ఆ పార్టీలోకి వెళ్లే ఛాన్స్ లేదంటున్నారు. ఇక టీడీపీలోకి వెళ్ళాలనుకున్నా..కొట్టు సత్యనారాయణను అంత తేలికగా పార్టీలోకి చేర్చుకోరని, పసుపు కండువా కప్పే అవకాశమే ఉండదని ప్రచారం జరుగుతోంది. దీంతో కొట్టు రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్న టాక్ వినిపిస్తోంది.తాడేపల్లిగూడెం వైసీపీలో రెండు వర్గాలు ఉండగా..కొట్టు సత్యనారాయణకు వైసీపీ అధిష్టానం చెక్ పెట్టడంతో..ఇక నియోజకవర్గంలో పార్టీ దూకుడుకు ఎలాంటి అడ్డంకులు ఉండబోవని క్యాడర్ హ్యాపీగా ఫీల్ అవుతోందట. గత ఎన్నికలకు ముందే కొట్టును తప్పించి ఉంటే.. తాడేపల్లిగూడెంలో గెలిచే వాళ్లమంటూ పార్టీ పెద్దలకు చెప్పారట పలువురు ఫ్యాన్ పార్టీ లీడర్లు. దీంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ ప్రతాపం చూపించండంటూ, నాయకులకు హితవు పలుకుతున్నారట వైసీపీ ముఖ్యనేతలు. కొత్త రథసారథి వడ్డీ రఘురామ్ అయినా అందర్నీ కలుపుకుని ముందుకెళ్తారో లేదో అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. అలక మీదున్న కొట్టు సత్యనారాయణ యాక్టీవ్ అవుతారా? లేక తనదారి తన చూసుకుంటారా అనేది క్యాడర్‌ను వెంటాడుతున్న ప్రశ్న. కొట్టుకు మద్దతుగా వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి గైర్హాజరైన మండల అధ్యక్షులపైనా వేటు వేస్తారా? వాళ్లిద్దరు కూడా వడ్డీ రఘురామ్‌తో కలిసి వస్తారా అనేది చూడాలి. ఇప్పటికైతే కొట్టు పొలిటికల్ ఫ్యూచర్‌లో డైలమాలో పడిందన్న చర్చ అయితే జరుగుతోంది.

# స్థానిక పోరు, మున్సిపల్ ఎన్నికలపై ఏపీలో రాజకీయ వేడి




**విజయవాడ :** స్థానిక పోరు, మున్సిపల్ ఎన్నికలపై ఏపీలో ఇప్పటినుంచే రాజకీయ వేడి రాజుకుంటోంది. లోకల్ బాడీస్, మున్సిపాలిటీల గడువు దగ్గర పడుతుంది. దీంతో స్థానిక ఎన్నికలకు ఈసీ రెడీ అవుతోంది. ఏపీలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగుస్తుంది.మార్చిలో..కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం ముగియనుంది. అందుకు తగ్గట్లుగానే స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసింది. మార్చిలో టెన్త్ ఎగ్జామ్స్ అయిపోయాక మొదట మున్సిపల్ ఎన్నికలకు..ఆ తర్వాత కొంత సమయం తీసుకుని సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలని ప్లాన్ చేస్తున్నారట. దీంతో ఏపీ రాజకీయ వేడి రాజుకుంటోంది. గ్రామాల్లో ఎలక్షన్ హీట్ స్టార్ట్ అయింది.రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు మొదలెట్టింది. గత ఏడాది నుంచే ఏర్పాట్లలో బిజీ అయిపోయింది. అయితే జనగణన అడ్డంకిగా ఒకటి ఉందని ఆ మధ్య ప్రచారం జరిగింది. దాంతో ఎన్నికలు ఈ ఏడాది ఉండవేమో అని అనుకున్నారు. అయితే 2027 ఫిబ్రవరి 9 నుంచి 28 దాకా జనగణన ఉంటుందని అధికారులు ప్రకటించారు.స్థానిక ఎన్నికలు ముందుకు వచ్చాయి. యథావిధిగా షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిపించాలని చూస్తున్నారట. మార్చి 9లోగా కార్పోరేషన్లు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చెందిన ఓటర్ల తుది జాబితాను ఫోటోలతో సహా రిలీజ్ చేయాలని ఎన్నికల సంఘం జిల్లాల అధికారులను ఆదేశించింది. ఆ తర్వాత ఓటర్ల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల తేదీని ప్రకటిస్తారన్న టాక్ వినిపిస్తోంది.టీడీపీ 2014 నుంచి 2019 మధ్య అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించలేదు. అనేక కారణాలతో జాప్యం జరిగింది. చివరికి ఎన్నికల ముందు ఎందుకు అనుకుని వాయిదా వేశారు. అయితే ఈ సారి అధికారంలో కూటమి మాత్రమే లేదు, జనసేన బీజేపీ కూడా ఉన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపించాలని వారంతా కోరుతున్నారు.ఎన్నికలు జరిగితే ద్వితీయ తృతీయ శ్రేణి నేతలకు స్థానికంగా పదవులు దక్కుతాయని అంటున్నారు. దాంతో చాలాకాలంగా ఈ ఎన్నికల కోసం అంతా వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికలు పెట్టి తీరాలన్న భావన కూటమి పెద్దల్లో వ్యక్తం అవుతోందట. అయితే ముందుగా కార్పోరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికలు పెట్టి..ఆ తర్వాత స్థానిక ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో సర్కార్ ఉందంటున్నారు. ఆ నిర్ణయం వెనక కూటమి పెద్దల వ్యూహం ఉందని కూడా చర్చ జరుగుతోంది.పట్టణాలలో మొదటి నుంచి వైసీపీకి కొంత బలం తక్కువగా ఉంటుంది. పైగా కూటమి పార్టీలకు అనుకూలంగా ఓటర్లు ఉంటారని అంటుంటారు. దాంతో పట్టణాల నుంచే పల్లెల వైపుగా స్థానిక ఎన్నికల యుద్ధాన్ని తీసుకెళ్లాలని కూటమి పెద్దలు ఆలోచన చేస్తున్నారట. కూటమి పటిష్టంగా ఉంది. పైగా విద్యావంతులు తటస్థులు ఇలా విభిన్న వర్గాలు పట్టణాల్లో తమకు అనుకూలంగా ఉంటారని భావిస్తున్నారట. అయితే స్థానిక ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు పెడితే వైసీపీకి అసలైన రాజకీయ యుద్ధంగానే ఉంటుందని అంటున్నారు.కూటమి పార్టీలు ఉమ్మడిగా వస్తే వారిని తట్టుకుని నిలవాల్సిన అవసరం వైసీపీకి ఎంతైనా ఉంది. వైసీపీ ధీటైన వ్యూహాలను రచించి..బలమైన అభ్యర్థులను బరిలోకి నిలబెట్టకపోతే ఇబ్బంది తప్పదన్న చర్చ జరుగుతోందట. అయితే అధికారంలో ఏ పార్టీ ఉంటే..స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకే అనుకూలంగా ఫలితాలు వస్తుంటాయి. అయినా సరే తమ ఉనికి కోసం పోరాటం చేయాల్సిన బాధ్యత విపక్షంపైన ఉంటుంది. ఎంతో కొంత తమ సత్తా చాటి తమ బలం పెంచుకోవాల్సి ఉంటుంది. కూటమితో అమీతుమీ తేల్చుకునేందుకు వైసీపీ సై అంటుందో లేక ఎన్నికలను లైట్ తీసుకుంటుందో వేచి చూడాలి.

# పోటీ చేయాలంటున్న కేడర్...



**నెల్లూరు :** తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రధాన ప్రతిపక్షాల తీరు మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. తెలంగాణలో అధికారాన్ని కోల్పోయినప్పటికీ, బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో గట్టి పోటీనిస్తోంది. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, అనేక మున్సిపాలిటీలు , వార్డుల్లో గులాబీ జెండా రెపరెపలాడింది. రాజకీయాల్లో అధికారం కోల్పోయిన వెంటనే చేతులెత్తేయకుండా, ఉనికిని చాటుకోవడంలో బీఆర్ఎస్ విజయవంతమైందని విశ్లేషకులు భావిస్తున్నారు.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. సుమారు 730కి పైగా వార్డులను కైవసం చేసుకోవడమే కాకుండా, 15 మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించి, మరో 30 చోట్ల అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. కేటీఆర్ , హరీష్ రావు వంటి నేతలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ క్యాడర్‌ను ఉత్తేజపరచడం పార్టీకి ప్లస్ పాయింట్ అయింది. అధికార పక్షం ప్రలోభాలను ఒత్తిళ్లను తట్టుకుని బీఆర్ఎస్ నిలబడటం చూస్తుంటే, ఆ పార్టీ ఇంకా తన పట్టును పూర్తిగా కోల్పోలేదని అర్థమవుతోంది.మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. వచ్చే నెలలో సర్పంచ్ , మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయన్న ప్రచారం ఉన్నప్పటికీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ స్థాయి సన్నాహాలు కనిపించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత అనేక మంది కీలక నేతలు పార్టీని వీడటం , మౌనంగా ఉండిపోవడం జగన్ మోహన్ రెడ్డికి అతిపెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు.. ఎన్నికలను బహిష్కరించాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కొన్ని ఎన్నికలను బహిష్కరించిన వైసీపీ, ఇప్పుడు స్థానిక పోరుకు కూడా దూరంగా ఉంటే అది ఆత్మహత్య సదృశమే అవుతుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో వైసీపీ కూడా బీఆర్ఎస్ నుండి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉంది. ఎన్నికల నుంచి తప్పుకోవడం వల్ల ప్రత్యర్థులకు ఏకగ్రీవ విజయాలను కట్టబెట్టినట్లవుతుంది. మిగిలి ఉన్న కేడర్ కూడా ఇతర పార్టీల వైపు చూసే అవకాశం ఉంది. ఏపీలో వైసీపీ నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మాజీ మంత్రులు , ఎమ్మెల్యేలు స్థానిక ఎన్నికల బాధ్యతను తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎదు-రయ్యే ఇబ్బందులను ఎదుర్కోలేమనే భయం కొందరిలో ఉంటే, భవిష్యత్తుపై నమ్మకం లేక మరికొందరు మౌనంగా ఉన్నారు. ఇదే సమయంలో తెలంగాణలో బీఆర్ఎస్ నాయకత్వం తమ అభ్యర్థులకు అండగా నిలబడి, చట్టపరమైన , రాజకీయ పోరాటాలు చేస్తోంది. ఈ విధమైన ధైర్యం వైసీపీ అధినాయకత్వం ప్రదర్శించకపోతే, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ మరింత బలహీనపడే ప్రమాదం ఉందిప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి పునాదుల వంటివి. అక్కడ బలపడితేనే వచ్చే సార్వత్రిక ఎన్నికలకు దారులు సుగమం అవుతాయి. బీఆర్ఎస్ పార్టీ ఈ సత్యాన్ని గ్రహించి పోరాడుతోంది. వైసీపీ కూడా బహిష్కరణలు, ఆరోపణలకే పరిమితం కాకుండా, తమకున్న 40 శాతం ఓటు బ్యాంకును కాపాడుకోవాలంటే ఎన్నికల బరిలో నిలవక తప్పదన్న అంచనా

## ఏపీలో టెక్నాలజీ పాలన భేష్

-మొదటిపేజీ తరువాయి

పౌరసేవలను సులభతరం చేయటం బాగుందని కితాబిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాలసీల అమలుపై ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరిస్తున్న తీరును తెలుసుకున్నారు. రాష్ట్రంలో జీఎస్డీపీ పెరుగుదలను కూడా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ద్వారా ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి వివరించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలో పన్నుల వసూళ్ల ప్రక్రియ బాగా సులభతరమైందని, వసూళ్లు కూడా పెరిగాయని ముఖ్యమంత్రి వివరించారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాలో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు అమలును గేట్స్ అత్యంత ఆసక్తిగా పరిశీలించారు. బ్లడ్ ప్రెషర్, డయాబెటీస్ లాంటి వైద్య పరీక్షల అనంతరం ఏం చర్యలు చేపడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటే వారికి ఎలాంటి సేవలు అందుతున్నాయని గేట్స్ ఆరా తీశారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల ప్రాజెక్టు చక్కగా ఉందని కితాబు ఇస్తూ... దట్స్ వెరీ నైస్ అంటూ గేట్స్ వ్యాఖ్యానించారు. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను అనుసరించి వారి లైఫ్ స్టైల్ మార్పు, ఆహారం తీసుకునే అంశాల్లో సలహాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. అనంతరం ప్రజా రాజధాని అమరావతి నిర్మాణాలపై ఇచ్చిన ప్రజంటేషన్‌ను కూడా బిల్ గేట్స్ ఆసక్తిగా పరిశీలించారు. రాజధాని నిర్మాణంలో 30 శాతం మేర నీటి వనరులు, పచ్చదనం కోసం కేటాయించిన ప్రణాళిక బాగుందని అన్నారు. రాజధాని నిర్మాణం జరుగుతున్న తీరును గేట్స్‌కు సీఎం చంద్రబాబు వివరించారు. దీనిపై స్పందించిన బిల్ గేట్స్ గ్రేట్ వర్క్ అంటూ వ్యాఖ్యానించారు. అంతకుముందు ఆర్టీజీఎస్ కేంద్రంలోకి వచ్చిన బిల్ గేట్స్‌కు వీడియో డిస్ ప్లే వాల్‌పై యువ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రజంటేషన్లు ఇచ్చారు. ఆర్టీజీఎస్ ప్రత్యేక అధికారులు ధాత్రిరెడ్డి, మలికా గార్గ్, ప్రఖర్ జైన్, సౌరబ్ గౌర్, సురేశ్ కుమార్‌లు ప్రజంటేషన్ల ద్వారా డేటా లేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్సు, పీపుల్స్ పర్సెప్షన్, ఏజెంట్ స్పేస్ ఏఐ సెర్చ్ బార్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి వివరించారు. ఆర్టీజీఎస్ కేంద్రంలో జరిగిన ప్రజంటేషన్ల కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, సీఎస్ కె.విజయానంద్ సహా తదితర అధికారులు పాల్గొన్నారు.

## డిజిటల్ విప్లవంలో చంద్రబాబుది కీలక పాత్ర

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ ఐటీ రంగంలో మేటిగా నిలబడిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తాను ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం పనిచేస్తున్నానని ముఖ్యమంత్రి చెప్పారు. ఏపీలో వనరులకు లోటు లేదని, సంపద సృష్టి జరగాల్సి ఉందన్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో 2047 నాటికి రాష్ట్రాన్నినెంబర్‌వన్ చేస్తామనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో మాట్లాడిన బిల్ గేట్స్...డిజిటల్ విప్లవానికి భారత్‌లో బలమైన పునాదులు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని కితాబిచ్చారు. తాను మొదటిసారి చంద్రబాబును కలిసినప్పుడు ఆయన ఆలోచనల్లో ముందుచూపు ఉందనే విషయాన్ని ఆనాడే గ్రహించినట్టు వెల్లడించారు. ఈ విషయంలో నాటి సింగపూర్ ప్రధాని మాత్రమే చంద్రబాబుకు కొంత దగ్గరగా ఉన్నారని చెప్పారు. గేట్స్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల్లో ఆరోగ్య రంగానికి చెందిన ప్రాజెక్టులే మెజార్టీ ప్రాజెక్టులని తెలిపారు. ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నది తన ఆశయమన్నారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందని అభినందించారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకోవడానికి, వారికి సరైన రీతిలో... తగిన స్థాయిలో విద్యా బోధన చేయడానికి ఏఐ సహాయపడుతుందన్నారు. విద్యారంగంలో మార్పు తీసుకురావడానికి ఏఐ-టెక్నాలజీ ఉపయోగపడుతుందని చెప్పిన బిల్ గేట్స్, వ్యవసాయం రంగం చాలా ముఖ్యమైనదిగా అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ సాయంతో ఏపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడం...టెక్నాలజీని రైతులకు అందించేందుకు... ఏఐను వ్యవసాయంతో ఇంటిగ్రేట్ చేస్తూ కృషి చేయడాన్ని అభినందించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో ఏఐని ఇంతలా వినియోగించడం లేదని... కానీ ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో ముందుండటం మంచి పరిణామమని చెప్పారు. విపత్తుల నిర్వహణ కోసం టెక్నాలజీతో ముందస్తు అంచనాలు వేసి... ప్రాణ నష్టం జరగ్గకుండా జాగ్రత్తలు తీసుకునే వ్యవస్థ ఏర్పాటు చేయడం బాగుందన్నారు. చంద్రబాబు తనకు గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ అని సమావేశంలో బిల్ గేట్స్ సరదాగా వ్యాఖ్యానించారు. స్వర్ణాంధ్ర-2047 నాటికి ముఖ్య లక్ష్యాలు నిర్దేశించుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 'ప్రస్తుతం 180 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఎకానమీని 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్డీపీగా తీర్చిదిద్దడం, తలసరి ఆదాయం ప్రస్తుతం 3,400 డాలర్లు ఉండగా 2047 నాటికి దీనిని 42,000 డాలర్లకు పెంచడం, ఎగుమతులు 20.7 బిలియన్ డాలర్ల నుంచి 450 బిలియన్ డాలర్లకు పెంచడం, నిరుద్యోగితను 4.1 శాతం నుంచి 2 శాతం కన్నా తగ్గించడం, మహిళా కార్మికుల సంఖ్యను 45.8 శాతం 80 శాతానికి పెంచడం, ప్రస్తుతం 72 శాతంగా ఉన్న అక్షరాస్యతను 100 శాతానికి తీసుకువెళ్లడం, 95 శాతం నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉండేలా చూడటం, సగటు ఆయుర్ధాయం 85 ఏళ్లు, ఎంఎంఆర్ ప్రతీ లక్ష జననాలకు 5, ఐఎంఆర్ ప్రతీ వెయ్యి జననాలకు 2 కన్నా తగ్గించగలగడం, గర్భిణులలో రక్తహీనత సమస్య, వైద్యంపై వ్యక్తిగత ఖర్చు 5 శాతానికి తగ్గించడమే లక్ష్యం'గా సీఎం చెప్పారు.

**సీనియర్ ఐఏఎస్ అధికారి బాబు ఏ అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా... ఏఐ**

రాకతో ఉద్యోగాలను పునర్నిర్వచించాల్సిన అవసరం ఉందని బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు. అలాగే ఈ వారం ఢిల్లీలో జరుగుతున్న

ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో కూడా ఏఐ వల్ల వచ్చే అవకాశాలు, ఎదురయ్యే సవాళ్ల గురించి ప్రపంచంలోని ఏఐ నిపుణులంతా చర్చిస్తారని గేట్స్ వివరించారు.ఖ


## భారత డిజిటల్ విప్లవంలో మోదీ, చంద్రబాబు కీలకపాత్రధారులు

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌తో పాటు తాను, ఇతర మంత్రులు కలిసి ఉన్న చిత్రాన్ని జతచేశారు. ఈ రెండు చిత్రాలను పోలుస్తూ ఆయన పైవిధంగా వ్యాఖ్యానించారు. సోమవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో బిల్ గేట్స్ సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు మంత్రి పార్థసారథి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిల్ గేట్స్ మాట్లాడుతూ, భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, విపత్తుల నిర్వహణలో టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించడంలో చంద్రబాబు చేస్తున్న కృషిని బిల్ గేట్స్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కీలక సమావేశం జరిగిన నేపథ్యంలోనే మంత్రి పార్థసారథి చేసిన పోస్ట్ రాజకీయంగా చర్చనీయాంశమైంది.

## అంబటి రాంబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వ్

-మొదటిపేజీ తరువాయి



మంజూరు చేయాలని కోర్టును కోరారు. పోలీసుల తరఫున న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ... అంబటి రాంబాబు లాటరీ పేరుతో డబ్బులు వసూలు చేసి మోసం చేశారని... పూర్తి స్థాయి విచారణ కోసం పోలీస్ కస్టడీ అవసరమని కోర్టును కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి బెయిల్, పోలీస్ కస్టడీ పిటిషన్లపై తీర్పును రిజర్వ్ చేశారు. ఈ కేసులో కోర్టు ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# బి ఆర్ ఎస్ హయాంలో ఐ టి రంగం గణనీయ మైన అభివృద్ధి

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (సమయం న్యూస్):**తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో ఐటీ రంగం గణనీయమైన అభివృద్ధి సాధించినట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 2023-24 గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు గత దశాబ్దంలో 299 శాతం పెరిగినట్లు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా సృష్టించబడిన ప్రతి మూడు ఐటీ ఉద్యోగాల్లో ఒకటి తెలంగాణ నుండే వచ్చినట్లు కూడా వెల్లడైంది. 2013-14లో అప్పటి ప్రభుత్వ కాలంలో రూ. 57,258 కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతులు, బీఆర్ఎస్ ప్రభుత్వ అమలు చేసిన వినూత్న విధానాలు, దూరదృష్టి నిర్ణయాల ఫలితంగా 2023-24 నాటికి రూ. 2,72,076 కోట్లకు పెరిగాయి.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికతతో తెలంగాణ రాష్ట్రం ఐటీ పవర్ హౌస్‌గా ఎదిగినట్లు ఈ గణాంకాలు స్పష్టంగా చూపిస్తున్నాయి.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఐటీ రంగంలో నమోదైన ముఖ్య విజయాలు:

దేశంలోని ప్రతి మూడు ఐటీ ఉద్యోగాల్లో ఒకటి తెలంగాణ నుండే
ఐటీ ఎగుమతుల్లో దేశంలోనే అత్యధికంగా 299% వృద్ధి
ఐటీ ఉద్యోగాల్లో 209% పెరుగుదల
కొత్త ఐటీ ఉద్యోగాల్లో తెలంగాణ వాటా 33%
రాష్ట్రంలో మొత్తం ఐటీ ఎగుమతులు రూ. 2,72,076 కోట్లు
2023-24 నాటికి రాష్ట్రంలో మొత్తం ఐటీ ఉద్యోగాలు 10 లక్షలు
ఒక్క ఐటీ ఉద్యోగంతో పరోక్షంగా 4 ఉద్యోగాల సృష్టి
దీని ద్వారా ఇతర రంగాల్లో సుమారు 40 లక్షల ఉద్యోగాలు సృష్టి

తెలంగాణలో ఐటీ రంగం అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలను కల్పించినట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

## ఉత్తర భాగం పనులపై కీలక అప్డేట్, త్వరలోనే..!

**హైదరాబాద్ ఫిబ్రవరి16( సమయం న్యూస్) :** హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులపై కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పటికే కేంద్రం జాతీయ నంబర్ కేటాయించగా.. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. మరో 15 రోజుల్లో పూర్తి స్థాయి అనుమతులు వస్తాయని.. వెంటనే పనులు ప్రారంభిచనున్నట్లు అధికారులు చెబుతున్నారు. మట్నత్తం 161 కి.మీ ఈ భాగం నిర్మించనున్నారు.

## మెదక్ లో చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక కొరకు ప్రారంభమైన మున్సిపల్ ప్రత్యేక సమావేశం



ఎన్నికకు స్పెషల్ ఆఫీసర్ గా వ్యవహరించిన జడ్పి సిఈఓ ఎల్లయ్య ముందుగా వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక సమయానికి హాజరైన కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆలస్యంగా హాజరైన బిఆర్ఎస్ సభ్యులు ప్రారంభమైన ప్రమాణ స్వీకారోత్సవం

## వాడ వాడ లోని దేవాల యాల్లో సోమవారం తెల్లవారు జాము నుండి భక్తుల పూజలు.

**ఖైరతాబాద్, ఫిబ్రవరి 16(సమయం న్యూస్)** ఖైరతాబాద్ యోజకవర్గం ప్రాశీతం లోని ఆలయాల్లో తెల్లవారుజామునుశీడె భక్తులు మహాశివరాత్రి రెండవ రోజున పూజలు నిర్వహించి వారి ఉపవాస దీక వదిలారు.

## రామారం లో కనువిందుగా శంభు - పార్వతుల కళ్యాణం





**రాయపోల్, ఫిబ్రవరి 16:** మండల పరిధిలోని రామారశీ గ్రామంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివపార్వతుల కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో సోమవారం ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు,అభిషేకాలు, హోమం,రుద్రపారాయణాలు నిర్వహించి,అనంతరం శివపార్వతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కళ్యాణోత్సవంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించగా,భక్తులు హర్షధ్వానాలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వామి,ఆలయ కమిటీ చైర్మన్ హన్మంతు దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కనకయ్య, నాయకులు పాల రామ గౌడ్,నాగులు,దుర్గాప్రసాద్, అఫ్జర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు,యువకులు సహకరించారు. ఈ వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పగా,భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. నేడు గ్రామంలో ప్రధాన విధుల గుండా రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు.

# కొత్తగూడెం మేయర్‌గా మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్‌గా సిరిపురపు లలితా కుమారి ఎన్నిక

**భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 16 : ( సమయం న్యూస్ )**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా మూడ్ గణేష్ , డిప్యూటీ మేయర్ గా సిరిపురపు లలిత కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఎన్నికల నియమావళి ప్రకారం జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధ్యక్షత వహించి,ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మొత్తం 60 డివిజన్లకు గాను ఎన్నికైన కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు. సీపీఐ పార్టీకి చెందిన 22 మంది, కాంగ్రెస్ పార్టీకి చెందిన 22 మంది, బీజేపీకి చెందిన 1 మంది, సీపీఎం పార్టీకి చెందిన 1 మంది, స్వతంత్రంగా గెలుపొందిన 6 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 8 మంది కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు. అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించ గా. 20వ డివిజన్‌కు చెందిన సీపీఐ కార్పొరేటర్ మూడ్ గణేష్ మేయర్‌గా, 8వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ కార్పొరేటర్ సిరిపురపు లలితా కుమారి డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎక్స్-అఫీషియో సభ్యులుగా సమావేశానికి హాజరైన స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం





రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ, కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో సమాన అభివృద్ధి సాధించేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. పట్టణంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పారదర్శక, బాధ్యతాయుత పాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎక్స్-అఫీషియో సభ్యులు నూతనంగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్,కార్పొరేటర్లందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, కార్పొరేషన్ అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అమోయ్ కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన ఐడీఓసి కార్యాలయం నుండి వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, సంబంధిత శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతోనే మానవ జన్మకు సార్ధకత

● **వైరా తహసిల్దార్ సురేష్ బాబు**

**ఖమ్మం, ఫిబ్రవరి 16 : ( సమయం న్యూస్ ) :** ఆధ్యాత్మిక చింతనతోనే మానవ జన్మకు సార్ధకత లభిస్తుందని వైరా తహసిల్దార్ సురేష్ బాబు అన్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా వైరా మండలంలోని విప్పలమడక గ్రామంలో ఉన్న సోమలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్ఆర్ఐ కొండబట్ల దీనాబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని తహసిల్దార్ సురేష్ బాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. శివరాత్రి సందర్భంగా విప్పలమడకలో శివ కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలపై శివానుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. వైరా మండలంలోని విప్పలమడక గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తుందని కొనియాడారు. ప్రస్తుత పాలకవర్గం ఆధ్వర్యంలో విప్పల మడక గ్రామం ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. అనంతరం దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో తహసిల్దార్ సురేష్ బాబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేడా హేమిమా చక్రపాణి, మాజీ సర్పంచులు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్ పాపయ్య, కొల్లికొండ వీరభద్రరావు, మాజీ ఎంపీటీసీ ఆకుల ప్రసాద్, న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు, ప్రవాసాంధ్రుడు కొండబట్ల దీనబాబు, కొండబట్ల పెంటయ్య, మాజీ ఉప సర్పంచ్ వీరపనేని చెన్నకేశవరావు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు కొల్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.









## ఆత్మవిశ్వాసంతో ఆడి.. జిల్లా పేరు నిలబెట్టాలి

● **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**అదిలాబాద్ ఫిబ్రవరి16( సమయం న్యూస్). :** ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో క్రీడల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జిల్లా కీర్తిని పెంచాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకాంక్షించారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు బయలుదేరిన విద్యార్థుల బస్సును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శారీరక, మానసిక వైకల్యాలను అధిగమించి క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని వెలికితీసి పట్టుదలతో శ్రమిస్తే ఉన్నత ఫలితాలు సాధ్యమని తెలిపారు. క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని జిల్లాకు పతకాలు సాధించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు రఘు రమణ, షుజాత్ ఖాన్, ఇతర అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తైన నేపథ్యంలో సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎన్నికల సాధారణ పరిశీలకుడు హనుమంత్ నాయక్ ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శాలువాతో సత్కరించి, మెమెంటోను అందజేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మా (వీజ్రూహీూ) పీడీ సీవీఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి జనగణన సమన్వయ కమిటీ సమావేశం

**హైదరాబాద్ ఫిబ్రవరి16( సమయం న్యూస్) :** సచివాలయంలో ఈ సమావేశంలో 2027 జనగణనను సజావుగా, సమయానికి నిర్వహించేందుకు అవసరమైన పరిపాలనా, లాజిస్టికల్ మరియు కార్యాచరణ ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం జనగణన--2027 నిర్వహణకు సంబంధించి విస్తృత స్థాయి సన్నాహక కార్యక్రమాలను అధికారికంగా ప్రారంభించింది. ఇది రాష్ట్రంలో పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడనున్న తొలి జనగణన కావడం విశేషం. జిల్లా స్థాయి సిద్ధతలో భాగంగా త్వరలో జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహించి, సమయపట్టిక, బాధ్యతలు, కార్యాచరణ ప్రణాళికపై అవగాహన కల్పించనున్నారు.

సమగ్ర ప్రణాళిక ఎంతో కీలకమని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. విభాగాల మధ్య సమన్వయం, సమయానికి నిర్ణయాలు తీసుకోవడం విజయవంతమైన నిర్వహణకు అవసరమని తెలిపారు. అన్ని శాఖలు పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అవసరమైన సిబ్బంది సంఖ్యపై తాత్కాలిక అంచనాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డిజిటల్ విధానంలో నిర్వహించనున్నందున ఎలాంటి స్లమ్, నివాస ప్రాంతం లేదా దూర ప్రాంతం కూడా మిస్ కాకుండా ఖచ్చితంగా నమోదు జరగాలని సూచించారు. అలాగే సిబ్బందికి నాణ్యమైన శిక్షణ ఇవ్వడం అత్యంత అవసరమని ంచారు.

జనగణన డైరెక్టర్ భారతి హోలికేరి మాట్లాడుతూ, 2027 జనగణన ఒక రూపాంతరాత్మక దశ అని పేర్కొన్నారు. మొత్తం ప్రక్రియ డిజిటల్‌గా నిర్వహించబడనుందని తెలిపారు. మొదటి దశలో సుమారు 90 వేల ప్రభుత్వ ఉద్యోగులు---ముఖ్యంగా ఉపాధ్యాయులు మరియు ఇతర సిబ్బంది---ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లుగా నియమించబడనున్నారని వెల్లడించారు.

ఈ సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఫారెస్ట్ ప్రిన్సిపల్ సెక్రటరీ నదీమ్ అహ్మద్, పీఆర్‌డీఆర్డీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్, హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జోంగ్తు, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్, జీఏడీ సెక్రటరీ ఈ. శ్రీధర్, ఎంఏయూడీ సెక్రటరీ టీ.కే. శ్రీదేవి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్ ఏకగ్రీవ ఎన్నిక

● మేయర్‌గా మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్‌గా సిరిపురపు లలితా కుమారి ఎన్నిక



**కొత్తగూడెం ఫిబ్రవరి16( సమయం న్యూస్) :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించబడింది. మున్సిపల్ సాధారణ ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం మరియు మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల కార్యక్రమం నియమావళి ప్రకారం నిర్వహించబడింది. సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధ్యక్షత వహించి,ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.మొత్తం 60 డివిజన్లకు గాను ఎన్నికైన కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు. సీపీఐ పార్టీకి చెందిన 22 మంది, కాంగ్రెస్ పార్టీకి చెందిన 22 మంది, బీజేపీకి చెందిన 1 మంది, సీపీఎం పార్టీకి చెందిన 1 మంది, స్వతంత్రంగా గెలుపొందిన 6 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 8 మంది కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు.అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించబడింది. 20వ డివిజన్‌కు చెందిన సీపీఐ కార్పొరేటర్ మూడ్ గణేష్ మేయర్‌గా, 8వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ కార్పొరేటర్ సిరిపురపు లలితా కుమారి డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎక్స్–అఫీషియో సభ్యులుగా సమావేశానికి హాజరైన స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ, కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో సమాన అభివృద్ధి సాధించేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. పట్టణంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పారదర్శక, బాధ్యతాయుత పాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఎక్స్–అఫీషియో సభ్యులు నూతనంగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్,కార్పొరేటర్లందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, కార్పొరేషన్ అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అమోయ్ కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన ఐడీఓసి కార్యాలయం నుండి వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, సంబంధిత శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి.

● మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ కార్యక్రమం చేపట్టారు



**చేవెళ్ల ,ఫిబ్రవరి ;16: (సమయం న్యూస్) :** షాబాద్ మండలంలోని అన్ని తండాల వాసులు కలసి సంత్ సేవాలాల్ మహారాజ్ గారి 287వ జయంతి ఘనంగా నిర్వహించారు. షాబాద్ మండలంలోని అన్ని తండాలలో మండల కేంద్రంలో భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు.సేవాలాల్ గొప్పతనం బంజారాల ఆరాధ్య దైవం హిందూ ధర్మం గొప్పతనం బంజారాలకు తెలియజేయడానికి జన్మించిన మహానుభావుడు సేవా చైతన్య అభిలాషి బంజారాలను విద్యా వైపు ప్రోత్సహించి బంజారాల ఆత్మగౌరాన్ని బట్టి ఆత్మరక్షణకు మించిన ధర్మం లేదంటూ ప్రత్యర్థులపై విజయం సాధించేలా ధైర్యాన్ని నూరిపోసిన దీక్షలి బంజారా జాతిలో ఉదయించిన కాంతిపుంజం సద్గురు సేవాలాల్ మహారాజ్. అలాంటి మా దైవానికి ప్రతి తండాలో గుడి కట్టాలని, అలాగే భవాని మాత గుడి కట్టాలని, బంజారా పెద్దలు అందరూ కలిసి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని తండా ప్రజలు , బంజారా పెద్దలైనటువంటి పోతుగల్ మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్, గోపాల్ నాయక్, చందర్ నాయక్, డాక్టర్ శంకర్ నాయక్, రత్నం నాయక్ లను కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని తండాల ప్రజలు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

# కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు**




**హైదరాబాద్ ఫిబ్రవరి16( సమయం న్యూస్) :** సోమవారం డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో వివిధ విభాగాల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది.ఈ సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, నిధులు మార్చి నెలాఖరులోగా సమీకరించుకునేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎస్ఎన్ఏ నిధులు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్స్, ఇతర పథకాల క్రింద రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ప్రత్యేక దృష్టి సారించి, దీనిపై ఢిల్లీలో ఒక ప్రత్యేక అధికారిని నియమించుకొని సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్యారోగ్య,గిరిజన సంక్షేమ శాఖల వారీగా కేంద్రం నుంచి సుమారు 15 వేల కోట్ల రూపాయిలు రావాల్సి ఉందని, వీటిని సమీకరించుకొని రాష్ట్రంలోని పెండింగ్ పనులకు ఖర్చు చేయాలని సూచించారు.

**100 వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక :** గౌరవ ముఖ్యమంత్రిగారి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 2, 3 తేదీల నుండి జూన్2వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై వివిధ డిపార్టుమెంట్ల వారీగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్ విభాగాలలో ఈ ప్రణాకను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇటీవల గ్రామపంచాయతీ, మున్సి పల్ లోకల్ బాడీస్ ఎన్నికలు ముగిసినందున ఎన్నికైన వారు మెంబర్లు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సలర్స్, కార్పొరేటర్స్ తదితర ప్రజాప్రతినిధులకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు బాధ్యతతో కూడిన విధులు నిర్వర్తించేందుకు ఈ వందరోజుల కార్యాచరణ ప్రణాళిక(100 డేస్ యాక్షన్ ప్లాన్) ఉపకరిస్తుందని సిఎస్ తెలిపారు. గ్రామాల్లో,పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్ల మరమ్మతులు, రానున్న వేసవి కాలా న్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండాకు తగు చర్యలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు.కేబినెట్ సంబంధించిన ప్రతిపాదనలను రేపటిలోగా సమర్పించాలని సిఎస్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యద ర్శులు వికా స్ రాజ్, సి.వి.ఆనంద్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తాని యా, అహ్మద్ నదీమ్, ఎన్. శ్రీధర్, యోగితారాణా, కార్యద ర్శులు క్రిస్టినా చొంగ్తు, టికె శ్రీదేవి, స్టీఫెన్ రవీంద్ర, అధికారులు పాల్గొన్నారు.

# వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికై, పదవీ బాధ్యతలు స్వీకరించిన 17 వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్



**వికారాబాద్ ఫిబ్రవరి16( సమయం న్యూస్). :** వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారి కుమార్తె గడ్డం అనన్య.మున్సిపల్ చైర్మన్ స్థానానికి గడ్డం అనన్య గారి ఏకైక నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించిన అధికారులు. అనంతరం వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గా గడ్డం అనన్య గారితో ప్రమాణ స్వీకారం చేయించిన ఎన్నికల అధికారి సుదీర్. అనంతరం వైస్ చైర్మన్ గా 10 వ వార్డు కౌన్సిలర్ అర్ధ సుధాకర్ రెడ్డి గారిని ఎన్నుకున్న కౌన్సిలర్లు.ఎక్స్ అఫీషియో మెంబర్ హోదాలో సమావేశానికి హాజరైన వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ గడ్డం అనన్య గారికి, వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి గారికి మరియు వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ డివిజన్ జి.హెచ్.ఎం.సి ప్లే గ్రౌండ్ (శాఖ గ్రౌండ్) ఖైరతాబాద్ లో తేదీ15/02/2026 సాయంత్రం 6:00 గంటల నుండి 16/02/2026 ఉదయం 6 గంటల వరకు పి.జె.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం జరిగింది ,ఇందులో 6 టీములు పాల్గొనగా విన్నర్ గా ఫ్యాషన్ జోన్ టీం నిలువగా వారికి పి.జె.ఆర్ ఫౌండేషన్ తరపున 20 వేల రూపాయల నగదు తో పాటు ట్రోఫీ మరియు రన్నరప్ గా పి జె ఆర్ టైగర్స్ టీం నిలవగా వారికి పదివేల రూపాయల నగదు తో పాటు ట్రోఫీని అందజేసిన పి.జే.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి పి విజయ రెడ్డి గారు ( కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఖైరతాబాద్ నియోజకవర్గం మరియు కార్పొరేటర్ ఖైరతాబాద్ డివిజన్) గారు వారితో పాటు వివిధ విభాగాలలో ఇతర క్రీడాకారులకు బహుమతులను అందజేయడం జరిగింది

# నిర్మల్ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు ఏకగ్రీవం



**నిర్మల్ ఫిబ్రవరి16( సమయం న్యూస్):** నిర్మల్ మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తైంది. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నియమించిన అధికారిగా పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం జరిగింది.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన 42 మంది కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. సమావేశానికి జనరల్ అబ్జర్వర్ వీరారెడ్డి హాజరయ్యారు. కోరం పూర్తి కావడంతో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలను ఏకగ్రీవంగా నిర్వహించారు.చైర్‌పర్సన్‌గా అప్పాల కావ్య ఎన్నికయ్యారు. ప్రతిపాదకుడిగా కత్తి నరేందర్, బలపరిచిన వారిగా ఎం.డి. ఇమాన్ ఉల్లా ఉన్నారు.వైస్ చైర్‌పర్సన్‌గా అప్పాల గణేష్ చక్రవర్తి ఎన్నికయ్యారు. ప్రతిపాదకుడిగా తాజ్ అద్దీన్, బలపరిచిన వారిగా గొల్లా గోపినాథ్ ఉన్నారు.ప్రత్యేక అధికారి ఎన్నిక ఫలితాలను అధికారికంగా ప్రకటించి సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డి.ఈ. హరి భువన్, తాహసిల్దార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో మార్మోగిన కొనగట్టు ఆలయం

● కన్నుల పండుగగా శివపార్వతుల కళ్యాణం!



**చేవెళ్ల ,ఫిబ్రవరి: 16: ( సమయం న్యూస్) :** మహాశివరాత్రి పురస్కరించుకొని చేవెళ్లలోనే కొనగట్టు శివాలయంలో ఆదివారం శివపార్వతుల కళ్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ సున్నపు వసంతం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కనులారా శివపార్వతుల కల్యాణం వీక్షించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు ఆదివారం తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. ఆలయంలో రుద్రాభిషేకాలు, సామూహిక అభిషేకాలు, వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం శివనామ స్మరణతో ఆధ్యాత్మిక శోభన సంతరించుకుంది.

# శిలాఫలకం ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

● బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డిమాండ్



**ఖమ్మం, ఫిబ్రవరి 16 : ( సమయం న్యూస్ ) :** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోఖమ్మం నగరంలోని 19 వ డివిజన్ శాంతి నగర్ ప్రభుత్వ స్కూల్ సమీపంలోని అజర్ హైస్కూల్ వద్ద సిసి రోడ్లు,డ్రైనేజీ ల నిర్మాణం కొరకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శంఖుస్థాపన చేసిన శిలాఫలకం ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండలు ధ్వంసం చేయడాన్ని ఖండిస్తూ 23 వ డివిజన్ కార్పొరేటర్ ఆపార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ షేక్. మగ్బుల్ సోమవారం ఖమ్మం వన్ టౌన్ సీఐ కరుణాకర్ కు,ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,శిలాఫలకాన్నీ ధ్వంసం చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో 19వ వార్డ్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వరరావు,18వ వార్డ్ ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు

## నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా "బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి"



-బుర్రి చైతన్య పేరును సూచించిన కార్పొరేటర్ "పెరిక స్వాతి".. బలపర్చిన కార్పొరేటర్ "అల్లి సుభాష్"..

-బరిలో ఎవరూ లేకపోవడంతో.. ఏకగ్రీవంగా ప్రకటించిన ఎన్నికల ప్రత్యేక అధికారి "పాల్వాయి శ్రవణ్ కుమార్"..

## పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**అదిలాబాద్ ఫిబ్రవరి16( సమయం న్యూస్).:** రాబోయే పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరీక్షల సన్నద్ధతపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని, విద్యార్థుల ఆరోగ్యం, ఏకాగ్రతను దృష్టిలో ఉంచుకుని, వారికి ప్రోటీన్లతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు.వార్షిక పరీక్షలు ముగిసే వరకు విద్యార్థులు 100 శాతం హాజరయ్యేలా చూడాలని, ముఖ్యంగా ఉదయం వేళల్లో విద్యార్థులు సమయానికి పాఠశాలకు వచ్చేలా ఎం.ఇ.ఓలు పర్యవేక్షించాలని సూచించారు. ఫిబ్రవరి 18 నుండి జరగాల్సిన ప్రీ-ఫైనల్ పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా జరుగుతాయని, ఉపాధ్యాయులందరూ దీనికి సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు స్థానికంగా ఉన్నత స్థాయికి చేరుకున్న వ్యక్తులతో మోటివేషన్ క్లాసులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గత ఏడాది తరహాలోనే విద్యార్థులు త్వరగా నిద్రలేచి చదువుకునేలా ఉపాధ్యాయులు 'వేకప్ కాల్స్' ద్వారా వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే, ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్స్ కోసం ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులందరూ 100 శాతం దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, డి.సి.బి సెక్రటరీ గజేందర్, ఏ.ఎం.ఓ అజయ్, ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్లు, మండల విద్యాశాఖ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**అదిలాబాద్ ఫిబ్రవరి16( సమయం న్యూస్) :** జిల్లాలో ఈ నెల 25 నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు జరగనున్న పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. ఈసారి విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ పీరియడ్ కల్పిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమైనప్పటికీ, 9:05 నిమిషాల వరకు విద్యార్థులను అనుమతిస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 31 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, ప్రతి కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించామని తెలిపారు. అదనంగా 9 మంది సీఎస్‌ఓలను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల రవాణా విషయంలో అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలోని 13 పోలీస్ స్టేషన్లలో స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రత మధ్య రవాణా చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు, డిజిటల్ గడియారాలు, మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు అధికారులు, సిబ్బందికీ వర్తిస్తాయని తెలిపారు. పరీక్షల సమయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ప్రత్యేక బస్సులు నడపాలని, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స కిట్లతో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 163 అమలు చేసి, సీసీ కెమెరాల ద్వారా నిఘా కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, పరీక్షలు ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గణేష్ జాదవ్‌తో పాటు ఆర్టీసీ, వైద్య, విద్యుత్, పోలీస్, రవాణా తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లాలో ఎన్నికైన మున్సిపల్ చైర్పర్సన్/వైస్ చైర్పర్సన్ ల వివరాలు

**సిద్దిపేట ఫిబ్రవరి16( సమయం న్యూస్) :** చేర్యాల మున్సిపాలిటీ
1. చైర్పర్సన్ : అరుణ ముత్యాల (బిఆర్ఎస్)
2. వైస్ చైర్పర్సన్ : మేడిశెట్టి ఉమా (బిఆర్ఎస్)

దుబ్బాక మున్సిపాలిటీ
1. చైర్పర్సన్ : శ్రీరామ్ సంగీత (బిఆర్ఎస్)
2. వైస్ చైర్పర్సన్ : ఆశ సులోచన (బిఆర్ఎస్)

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ
1. చైర్పర్సన్: గంగిశెట్టి చందన (బిఆర్ఎస్)
2. వైస్ చైర్పర్సన్ : కళ్యాణ్ కార్ పద్మాబాయి (బిఆర్ఎస్)

హుస్నాబాద్ మున్సిపాలిటీ
1. చైర్పర్సన్: దండి లక్ష్మి (కాంగ్రెస్)
2. వైస్ చైర్పర్సన్ : పద్మ చిత్తారి (కాంగ్రెస్)

# పోషణ అభియాన్ అద్భుత పథకం

- రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి
- కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంగనవాడి అధికారులతో సమీక్ష సమావేశం




**భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 16:( సమయం న్యూస్) :** స్థానిక సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నందుగల సమావేశ మందిరంలో మహిళా, శిశు, వయోవృద్ధులు మరియు వికలాంగుల సంక్షేమ శాఖ జిల్లా సంక్షేమ అధికారిని జె. స్వర్ణలత లెనీనా ఆధ్వర్యంలో వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 9 గంటలకు ప్రతి ఒక్క అంగనవాడి కేంద్రం తెరవాలని, తెరిచిన వెంటనే టీచర్, హెల్పర్, లబ్ధిదారుల హాజరు కేంద్ర రాష్ట్ర స్థాయి అప్లికేషన్లు అయినటువంటి పోషణ ట్రాకర్ మరియు న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టంలో నమోదు చేయాలని తెలిపారు. వైద్యశాఖ సమన్వయంతో అతి తీవ్ర పోషణ లోపం, పోషణ లోపం, తక్కువ బరువుతో ఉన్న పిల్లలను ప్రత్యేకంగా పర్యవేక్షించి వైద్యుల సూచనల మేరకు న్యూట్రిషన్ రీహాబిటేషన్ సెంటర్కి పంపించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతినెల క్రమం తప్పకుండా అత్యాధునిక సాంకేతిక పరికారాలతో పిల్లల ఎత్తు, బరువులు చూసి సరైన సమయంలో సరైన పోషణ అందించాలని కోరారు. కిశోర బాలికల కోసం రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు క్రింద "ఇందిరమ్మ అమృతం" పేరుతో 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల ఆడపిల్లలకు మిల్లెట్స్ తో కూడిన చిక్కిలు నెల నెల అందజేయడం జరుగుతుందని తద్వారా రక్తహీనత లోపం లేకుండా ఆరోగ్యవంతులుగా ఉండడమే మన లక్ష్యం అన్నారు, నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి పౌష్టికాహార పంపిణీలో జాప్యం జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ఎవరైనా గుత్తేదారులు పంపిణీ విషయంలో కానీ నాణ్యత విషయంలో గానీ అలసత్వం ప్రదర్శిస్తే బ్లాక్ లిస్టులో పెడతామన్నారు. ప్రతినెల షెడ్యూల్ ప్రకారం అంగనవాడి పర్యవేక్షకురాలు (సూపర్వైజర్) తమ సెక్టార్ యొక్క అంగన్వాడీ కేంద్రాల సందర్శించి రాష్ట్ర పోర్టల్ ఎం ఎం అంగనవాడిలో వివరాలను నింపాలని, పూర్వ ప్రాథమిక విద్య, పౌష్టికాహార విలువలపై టీచర్లకు అవగాహన కల్పిస్తూ, పోషణ అభియాన్ పథకంలో భాగంగా తల్లుల కమిటీ, గ్రామస్తులు, గ్రామ ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో సామూహిక వేడుకలు అయినటువంటి అక్షరాభ్యాసం, అన్నప్రాసన, శ్రీమంతాలు నిర్వహిస్తూ వారిలో మరింత అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్రంలోని ఎక్కడ లేని విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ తనదైన శైలిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని శాశ్వతంగా అంగన్వాడీ కేంద్రాలకు ఇచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించేందుకు గాను పెరటి తోట పెంపకాలు (న్యూట్రి గార్డెన్స్) నిర్మించారని దీనిని ఆదర్శంగా తీసుకొని వివిధ జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని జే. స్వర్ణలత లెనీనా, జిల్లా సిడిపివోలు ప్రసన్న లక్ష్మి, జయలక్ష్మి, తార, అరుణ కుమారి, పద్మశ్రీ, చైతన్య, సలోమి, హేమ సత్య, జ్యోతి, జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ పొనుగోటి సంపత్, జిల్లా కార్యాలయ సిబ్బంది హసీనా, భార్గవి, డి. సి .పి .ఓ హరికుమారి, చైల్డ్ లైన్ సందీప్, జిల్లా పోషణ అభియాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన సంగారెడ్డి మున్సిపల్ ప్రత్యేక సమావేశాలు

**సంగారెడ్డి, ఫిబ్రవరి 16:-**సంగారెడ్డి జిల్లాలోని 11 మున్సిపాలిటీలకు ప్రత్యేక సమావేశాలు ప్రశాంతంగా ముగిశాయి. నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం ,చైర్ పర్సన్ , వైస్ చైర్ పర్సన్ ఎన్నిక కోసం నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య మార్గ నిర్దేశంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సంగారెడ్డి మున్సిపల్ ప్రత్యేక సమావేశం అదీకృత అధికారి జడ్పీ సీఈవో జానకి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఉదయం 11 గంటలకు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో ప్రత్యేక సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఆయా పార్టీల సభ్యులు సమావేశ మందిరాలలోకి చేరుకోగా, తెలుగు అక్షరమాలను అనుసరిస్తూ వరుస క్రమంలో నూతనంగా ఎన్నికైన సభ్యులతో అధీకృత అధికారులు ముందుగా ప్రమాణ స్వీకారం చేయించారు.ఎన్నికల ప్రక్రియ మొత్తం నిబంధనల మేరకు, పారదర్శకంగా పూర్తయ్యింది.జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, అందోల్ --జోగిపేట్, కోహిర్, నారాయణఖేడ్, ఇస్నాపూర్, గుమ్మడిదల గడ్డపోతారం, జిన్నారం మున్సిపాలిటీలలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు సజావుగా పూర్తయ్యాయి. అయితే జహీరాబాద్, ఇంద్రేశం మున్సిపాలిటీలలో సరిపడా కోరం లేనందున ఆయా మున్సిపాలిటీల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు మంగళవారానికి వాయిదా పడ్డాయి.మున్సిపల్ కమిషనర్లు, అదీకృత అధికారుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించబడింది. ఉదయం 11 గంటలకు మొదటగా వార్డు సభ్యులుగా ఎన్నికైన సభ్యులందరికీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు సరి పడు కోరం ఉందని నిర్ధారించుకున్న మీదట ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు.చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించి, చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ లను అధికారికంగా ప్రకటించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ లతో ప్రమాణ స్వీకారం చేయించారు.

మున్సిపాలిటీ వారీగా చైర్మన్, వైస్ చైర్మన్‌ల వివరాలు:

ఆందోల్- జోగిపేట్ మున్సిపల్ చైర్మన్ గా సోమ్మిరెడ్డి గారి కృష్ణారెడ్డి,వైస్ చైర్మన్ గా ఆకుల సత్యనారాయణ(శ్రీచీజ),

గడ్డపోతారం చైర్ పర్సన్ గా శ్రీమతి గద్దె సుష్మ,(దీ=హా)
వైస్ చైర్మన్ గా లక్ష్మ గోని మహేందర్ గౌడ్ (దీ=హా)

గుమ్మడిదల చైర్మన్ చిన్న పాపాని కుమార్ గౌడ్ వైస్ చైర్ పర్సన్ గా శ్రీమతి చిమ్ముల సంధ్య

ఇస్నాపూర్ చైర్ పర్సన్ గా శ్రీమతి మోతే సుమలత )
వైస్ చైర్ పర్సన్ గా శ్రీమతి పట్లోళ్ల మాధవి (

జిన్నారం చైర్మన్ గా నక్కిర్తి యాట జనార్ధన్ వైస్ చైర్మన్ గా వంగెట్టి ప్రతాప్ రెడ్డి

కోహిర్ చైర్మన్గా ఎం. అశోక్
వైస్ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ హన్నన్ జావిద్

నారాయణఖేడ్
చైర్మన్గా నగేష్ కుమార్ షట్కార్
వైస్ చైర్మన్ గా దారం శంకర్

సదాశివపేట్
మున్సిపల్ చైర్ పర్సన్ గా శ్రీమతి మునిపల్లి అంజమ్మ(×చీజ) వైస్ చైర్మన్ గా శ్రీమతి హెచ్. రేణుక

సంగారెడ్డి చైర్ పర్సన్ గా శ్రీమతి కూన వనిత (×చీజ)
వైస్ చైర్మన్ గా షేక్ షఫీ అహ్మద్ (×చీజ) ఎన్నికయ్యారు. ఇంద్రేశం, జహీరాబాద్ మున్సిపాలిటీలలో కోరం లేకపోవడంతో ఎన్నిక రేపటికి(17.02.2026) వాయిదా పడింది. చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నికను పురస్కరించుకొని అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ప్రశాంతంగా నిజామాబాద్ మున్సిపల్ ప్రత్యేక సమావేశాలు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దిశానిర్దేశం కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన ప్రిసైడింగ్ అధికారులు
- నిజామాబాద్ నగర పాలక సంస్థ మేయర్ గా కూరగాయల ఉమారాణి
- డిప్యూటీ మేయర్ గా సల్మా తహసీన్ ఎన్నిక



**నిజామాబాద్, ఫిబ్రవరి 16 :( సమయం న్యూస్)** నిజామాబాద్ జిల్లాలోని నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల ప్రత్యేక సమావేశాలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం, మేయర్/డిప్యూటీ మేయర్, చైర్ పర్సన్/వైస్ చైర్ పర్సన్ ల ఎన్నిక కోసం నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి మార్గనిర్దేశంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. నిజామాబాద్ నగరపాలక సంస్థ సమావేశానికి నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించగా, బోధన్, ఆర్మూర్ లలో సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, భీంగల్ లో జెడ్పీ సీ.ఈ.ఓ సాయగౌడ్ పీ.ఓగా బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఉదయం 11.00 గంటలకు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఆయా పార్టీల వారీగా సభ్యులు సమావేశ మందిరాలలోకి చేరుకోగా, తెలుగు అక్షరమాలను అనుసరిస్తూ వరుస క్రమంలో నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రిసైడింగ్ అధికారులు ముందుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా హోదా కలిగిన ఎం.పీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు సైతం స్పెషల్ మీటింగ్ లకు హాజరై మేయర్/డిప్యూటీ మేయర్, చైర్ పర్సన్/ వైస్ చైర్ పర్సన్ ఎన్నికలో పాల్గొన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు సీహెచ్.సత్యనారాయణ రెడ్డి ఎన్నిక ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు సరిపడా కోరం ఉందని నిర్ధారించుకున్న మీదట ఎన్నిక ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ మేయర్ పదవి కోసం కాంగ్రెస్ అభ్యర్థిగా 49వ డివిజన్ నుండి ఎన్నికైన కూరగాయల ఉమారాణి పేరును ఆ పార్టీకి చెందిన సభ్యుడు అగ్గు బోజన్న ప్రతిపాదించగా, అబుద్ బిన్ అథర్ బలపర్చారు. అలాగే, భారతీయ జనతా పార్టీ మేయర్ అభ్యర్థిగా జి.స్రవంతి రెడ్డి పేరును వీరమాచినేని ప్రమోద్ కుమార్ ప్రతిపాదించగా, ఎర్రం సుధీర్ బలపర్చారు. డిప్యూటీ మేయర్ పదవి కోసం ఎ.ఐ.ఎం.ఐ.ఎం తరఫున సల్మా తహసీన్, బీజేపి అభ్యర్థిగా బంటు రాము పోటీ పడ్డారు. దీంతో అధికారులు చేతులెత్తే విధానం ద్వారా ఎన్నిక జరిపించారు. నగర పాలక సంస్థలో మొత్తం 60 కార్పొరేటర్ లతో పాటు నిజామాబాద్ ఎం.పీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతి రెడ్డి, ధనపాల్ సూర్యనారాయణ, పి.రాకేశ్ రెడ్డిలు ఎక్స్ అఫీషియో హోదాలో ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. మొత్తం 65 మంది సభ్యులకు గాను 34 మంది సభ్యులు కాంగ్రెస్ అభ్యర్థిని కూరగాయల ఉమారాణిని మేయర్ గా, ఎఐఎంఐఎం అభ్యర్థిని సల్మా తహసీన్ ను డిప్యూటీ మేయర్ గా మద్దతు తెలిపారు. బీజేపీ అభ్యర్థులుగా పోటీ పడిన జి.స్రవంతి రెడ్డి, బంటు రాములకు 31 మంది మద్దతు లభించింది. దీంతో నిజామాబాద్ నగర మేయర్ గా ఉమారాణి, డిప్యూటీ మేయర్ గా సల్మా తహసీన్ లు ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ క్షేత్రస్థాయిలో స్వీయ పర్యవేక్షణ జరుపుతూ, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ఎన్నికల సంఘం నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ, వీడియో చిత్రీకరణ నడుమ పూర్తి పారదర్శకంగా ఈ ఎన్నికల ప్రక్రియను జరిపించారు. ఇదే తరహాలో బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ గా తూము పద్మాశరత్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ గా ఇలియాస్ అలీని, ఆర్మూర్ లో మున్సిపల్ చైర్ పర్సన్ గా లహరి స్వామి, వైస్ చైర్ పర్సన్ గా కాటిపల్లి వెంకట్ రెడ్డిని, భీంగల్ లో మున్సిపల్ చైర్ పర్సన్ గా బి.నాగమణి స్వామి, వైస్ చైర్ పర్సన్ గా లతలను ఎన్నుకున్నారు. మేయర్/డిప్యూటీ మేయర్, చైర్ పర్సన్/ వైస్ చైర్ పర్సన్ ల ఎన్నికను పురస్కరించుకుని ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా మున్సిపల్ కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద అదనపు డీ.సీ.పీ బస్వారెడ్డి, ఏ.సీ.పీ ప్రకాష్ ఇతర పోలీసు అధికారులు బందోబస్తును పర్యవేక్షించారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీ ఏర్పాటు



**కామారెడ్డి ఫిబ్రవరి16( సమయం న్యూస్).:** ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల ఫిబ్రవరి 25 వ తేదీ నుండి మార్చి 18వ తేదీ వరకు జిల్లాలో 37 కేంద్రాలు పరీక్షా సమయం ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పరీక్షా కేంద్రాలు 21 ప్రభుత్వ కళాశాలలో 6 ప్రభుత్వ సెక్టార్ లో 10 ప్రైవేట్ కళాశాల లో మొదటి సంవత్సరం విద్యార్థులు 9013 రెండవ సంవత్సరం విద్యార్థులు 8940 మొత్తం విద్యార్థులు 17953 జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్. కామారెడ్డి జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు--2026 (థియరీ) నిర్వహణ పై సోమవారం మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్ల పై సమగ్ర చర్చించి, అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

పరీక్షల వివరాలు

పరీక్షల తేదీలు: 25.02.2026 నుండి 18.03.2026 వరకుసమయం: ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 12.00 వరకు కేంద్రాల సంఖ్య: 37

విద్యార్థుల సంఖ్య:1వ సంవత్సరం (జనరల్ ఢ వృత్తి): 90132వ సంవత్సరం: 8940మొత్తం: 17,953 మంది విద్యార్థులుజిల్లా పరీక్షా కమిటీTelangana State Board of Intermediate Education కార్యదర్శి మార్గదర్శకాల ప్రకారం జిల్లా పరీక్షా కమిటీ ఏర్పాటు చేయబడింది.

సభ్యులు:శ్రీ షేక్ సలాం -- నోడల్ అధికారి (కన్వీనర్)

ఎం.డి. యాకీనుద్దీన్ -- ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, మాచారెడ్డి (సభ్యుడు)

ఇర్ఫానా ఫర్వీన్ -- జూనియర్ లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కామారెడ్డి (సభ్యురాలు)

మార్చి-2026 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మరియు మే/జూన్-2026 సప్లిమెంటరీ పరీక్షల ప్రశ్నాపత్రాల భద్రపరచుటకు ఖూ స్ట్రాంగ్ రూమ్వినియోగించుసుకోవాలనినిర్వహణ చర్యలలో భాగంగ ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటుప్రతి 25 కేంద్రాలకు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ నిష్పత్తిలో క్రింది సభ్యులతో స్క్వాడ్ ఏర్పాటు,విద్యా శాఖ నుండి ఒక జూనియర్ లెక్చరర్రెవెన్యూ శాఖ నుండి డిప్యూటీ తహశీల్దార్ స్థాయి అధికారిపోలీస్ శాఖ నుండి అధికారి, భద్రతా ఏర్పాట్లుపోలీస్ సిబ్బందిని ఫ్లయింగ్ స్క్వాడ్ విధులు, బందోబస్తును పకడ్బందీగా అమలు చేయాలని,పరీక్షా సమయంలో అన్ని కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు తో పాటు,రవాణా సౌకర్యం ఉదయం 7.00 నుండి 9.00 గంటల వరకు మరియు మధ్యాహ్నం 12.00 నుండి 2.00 గంటల వరకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని,అవసరమైతే బస్సుల ఫ్రీక్వెన్సీ పెంచాలని, ,విద్యుత్ సరఫరా పరీక్షా కాలంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని,ఇన్విజిలేషన్ విధుల సక్రమంగా నిర్వహించాలని,వైద్య సదుపాయాలుప్రతి పరీక్షా కేంద్రంలో ఒక ఖూచీవీ ను నియమించి అవసరమైన వైద్య సహాయం అందించాలని, పారిశుధ్య చర్యలుమున్సిపల్ కమిషనర్లు , ఖూూ లు అన్ని పరీక్షా కేంద్రాల లోపల , వెలుపల పరిశుభ్రత నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలి, పోస్టల్ సదుపాయంఅన్ని సంబంధిత పోస్టాఫీసుల్లో దీచీూ వ్యవస్థ ద్వారా పరీక్ష సమాధాన పత్రాల పార్శిల్‌లను స్వీకరించేందుకు చర్యలు తీసుకోవాలని పోస్టల్ అధికారులకు సూచించబడింది .జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు--2026ను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## మంచిర్యాల జిల్లాలో ఎన్నికైన మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపల్ మేయర్/చైర్మన్, డిప్యూటీ మేయర్/వైస్ చైర్మన్ స్థానాల వివరాలు

**మంచిర్యాల ఫిబ్రవరి16( సమయం న్యూస్) :**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్
1. మేయర్ : ధరణి మధుకర్ - కాంగ్రెస్
2. డిప్యూటీ మేయర్ : చల్లా రమ్య - కాంగ్రెస్

బెల్లంపల్లి మున్సిపాలిటీ
1. చైర్మన్ : దావ స్వాతి - కాంగ్రెస్
2. వైస్ చైర్మన్ : రాగం శెట్టి సత్యనారాయణ - కాంగ్రెస్

చెన్నూర్ మున్సిపాలిటీ
1. చైర్మన్ : పెద్దింటి పద్మ - కాంగ్రెస్
2. వైస్ చైర్మన్ : నాయకపు వినయ్ - కాంగ్రెస్

లక్షెట్టిపేట మున్సిపాలిటీ
1. చైర్మన్ : దొంత అంజలి - కాంగ్రెస్
2. వైస్ చైర్మన్ : మోతుకూరి రాజేశ్వరి - కాంగ్రెస్

క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నిక వాయిదా.

## ప్రశాంతంగా ముగిసిన మేయర్, చైర్మన్ల ఎంపిక ప్రక్రియ

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ఫిబ్రవరి16( సమయం న్యూస్,) :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలోజిల్లాలోని 1 నగరపాలక సంస్థ, 4 పురపాలక సంఘాలకు జరిగిన ఎన్నికలలో భాగంగా మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎంపిక ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ తో కలిసి ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు జరిగిన ఎన్నికలలో గెలుపొందిన కార్పొరేటర్లతో మంచిర్యాల పట్టణంలోని నగరపాలక సంస్థ కార్యాలయ హాల్ లో ఎన్నికల పరిశీలకులు కె. గంగాధర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం మేయర్ గా ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్ గా చల్లా రమ్య లను ఎన్నుకున్నారని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో గెలుపొందిన కౌన్సిలర్లతో బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, కమిషనర్ సంపత్ ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించి చైర్ పర్సన్ గా దావ స్వాతి, వైస్ చైర్ పర్సన్ గా రాగంశెట్టి సత్యనారాయణ లను ఎన్నుకున్నారని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులలో గెలుపొందిన కౌన్సిలర్లతో చెన్నూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం అనంతరం చైర్ పర్సన్ గా పెద్దింటి పద్మ, వైస్ చైర్ పర్సన్ గా నాయకపు వినయ్ లను ఎన్నుకున్నారని తెలిపారు. లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులలో గెలుపొందిన కౌన్సిలర్లతో లక్షెట్టిపేట మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం చైర్ పర్సన్ గా దొంత అంజలి, వైస్ చైర్ పర్సన్ గా మోతుకూరి రాజేశ్వరి లను ఎన్నుకున్నారని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 22 వార్డులకు ఎన్నికలు జరగగా సోమవారం రోజు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో కోరం లేక ప్రమాణ స్వీకారం, చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక ప్రక్రియను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను జిల్లాలో అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ మున్సిపాలిటీ..

25 సంవత్సరాలకే మున్సిపల్ చైర్మన్

తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కూతురు గడ్డం అనన్య రికార్డు.

# దళితులను రక్షించేందుకు జాతీయ ఎస్సీ కమిషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తుంది.

● కర్ల రాజేష్ హత్య కేసుపై అధికారులపై జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడువిచారణ .



**కోదాడ ఫిబ్రవరి16( సమాసం న్యూస్). :** దళితులను రక్షించేందుకు జాతీయ ఎస్సీ కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్ర రావు స్పష్టం చేశారు. సోమవారం కోదాడ పట్టణంలో ఇటీవల పోలీసు లాక్ ఆఫ్ డెత్ కు గురైన కర్ల రాజేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేష్ తల్లి లలితమ్మతో రాజేష్ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నుండి మంజూరైన పెన్షన్ పత్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అడిషనల్ డీజీ చౌహాన్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ సమక్షంలో రాజేష్ తల్లి లలితమ్మకు అందజేశారు. అనంతరం కోదాడ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమీషన్ సభ్యులు మాట్లాడుతూ, కర్ల రాజేష్ కేసు పత్రికల్లో చూసి జాతీయ ఎస్సీ కమిషన్ సుమోటో కింద కేసు నమోదు చేసిందన్నారు. కమిషన్ కేసులో ప్రవేశించిన అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, రాజేష్ మృతి పై నేటి వరకు చార్జ్ సీటు ఎందుకు వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చార్జిషీట్ కు సమయం కోరారని కాగా కమిషన్ చార్జిషీటు వెంటనే దాఖలు చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. కేసులో బాధ్యులైన సిఐపై చర్య తీసుకోవడమే కాక, ఎస్సైపై వెంటనే చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీజీ, జిల్లా ఎస్పీలని ఆదేశించారు. పది రోజుల్లో రీ పోస్టుమార్టం చేసి నివేదికను అందించాలని ఆదేశించారు. 1989 జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సెక్షన్ 4 ప్రకారం కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు జవాబు ఇవ్వకపోతే నిర్లక్ష్యపు యాక్ట్ ప్రకారం సస్పెన్షన్ తో పాటు ఆరు నెలలు జైలు ఉంటుందని హెచ్చరించారు. రాజేష్ తల్లికి పెన్షన్ మంజూరు చేయడం జరిగిందని, మూడు రోజుల్లో ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేదా ఉన్న స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, వ్యవసాయ భూమి ఇచ్చేందుకు కలెక్టర్ తగు చర్యలు తీసుకో వలసినదిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట అడిషనల్ డిజి డిఎస్ చౌహన్, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, ఆర్డీవో సూర్యనారాయణ, డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి దయానందరాణి, తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో సత్తా చూపాలి

● వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**హన్మకొండ ఫిబ్రవరి16( సమయం న్యూస్).:** నాల్గవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ పోలీసులు సత్తా చాటాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. రేపటి నుండి సైబరాబాద్ కమిషనరేట్ లో ప్రారంభమయ్యే తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్ పోటీల్లో, క్రీడా గ్రామంలో ఎగురవేసే వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రీడా పతకాన్ని పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులు, క్రీడాకారులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఈ పోటీల్లో పాల్గొనే పోలీస్ క్రీడాకారులకు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా ట్రాక్ సూట్ తో పాటు స్పోర్ట్స్ షూ, టీ షర్ట్ అందజేశారు. క్రీడాకారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ క్రీడా కారులు తమ సత్తా చూపాలని, పోలీసులు శాంతి భద్రతల్లోనే కాదు క్రీడల్లో కూడా రాణించగలరని, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి శాఖపరమైన గుర్తింపు వుంటుందని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపి నాగయ్య, ఆర్.ఐ సతీష్, ఆర్. ఎస్.ఐ శ్రవణ్ కుమార్, క్యాంపు క్లర్క్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

## జనగామ మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో నిషేధాజ్ఞలు

**హన్మకొండ ఫిబ్రవరి16( సమయం న్యూస్). :** మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపిక నేపథ్యంలో జనగామ మున్సిపల్ కార్యాలయ వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు ఖూ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మున్సిపల్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బీఎన్ఎస్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు ప్రకటించారు. రేపు ఉదయం 6 గంటల నుంచి ఎల్లుండి ఉదయం 6 గంటల వరకు ఇవి అమలులో ఉంటాయని, ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నేరమని హెచ్చరించారు.



## ప్రజావాణి దరఖాస్తుల సమస్యల పరిష్కారం పై దృష్టి సారించండి

● బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

● ప్రజల నుండి ఫిర్యాదు సంబంధ దరఖాస్తులను స్వీకరించిన కమిషనర్..

● వివిధ విభాగాలకు చెందిన 65 ఫిర్యాదుల స్వీకరణ.

**వరంగల్ ఫిబ్రవరి16( సమయం న్యూస్) :** ప్రజావాణి దరఖాస్తుల సమస్యల పరిష్కారం పై దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కమిషనర్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదులు వివరాలు విభాగాల వారిగా

1. టౌన్ ప్లానింగ్.....33
2. ఇంజనీరింగ్..... 22
3. రెవిన్యూ..........04
4. హెల్త్ ఢ శానిటేషన్....02
5. నీటి సరఫరా......04

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్ సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి డి ఎఫ్ ఓ శం కర్ లింగం, సి హెచ్ ఓ రమేష్ ,ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య ఎం హెచ్ ఓ డా.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నపత్రాల తయారీ వర్క్ షాప్ ను సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్

జిల్లా సైన్స్ మ్యూజియంను మరియు జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు లో జరుగుతున్న ప్రశ్నపత్రాల తయారీ వర్క్ షాప్ ను సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్ శ్రీమతి అశ్వినీ తానాజీ ఐఏఎస్




**కరీంనగర్ ఫిబ్రవరి16( సమయం న్యూస్). :** జిల్లా సైన్స్ మ్యూజియంలో జరుగుతున్న సైన్స్ మ్యూజియం పునరుద్ధరణ పనులను సందర్శించిన జిల్లా అదనపు పాలనాధికారి శ్రీమతి అశ్విని తానాజీ ఐఏఎస్ మాట్లాడుతూ మ్యూజియంలో విద్యార్థులకు అవసరమైన సైన్స్ మరియు ఆర్ట్ కల్చర్ కు సంబంధించిన మరిన్ని విషయాలను చేర్చాలని, మ్యూజియంలో ఉన్న ప్రతి ఎగ్జిబిట్ పూర్తి సమాచారాన్ని ఇచ్చే విధంగా ఉండాలని అంతేకాకుండా ఇచ్చిన సమాచారం సరైనదిగా ఉండాలని సూచించారు. మ్యూజియం అంటే కేవలం వస్తు ప్రదర్శనగా ఉండకుండా విద్యార్థికి జ్ఞాన కేంద్రంగా ఉండాలని మ్యూజియాన్ని సందర్శించిన విద్యార్థి కొంత నేర్చుకొని వెళ్లాలని ఆ రకంగా మ్యూజియాన్ని తీర్చిదిద్దాలని వారు సూచించారు. తదనంతరం ప్రశ్నపత్రాల తయారీ కార్యశాలను సందర్శించి ప్రశ్న పత్రాల సెట్టర్స్ తో మాట్లాడారు. ప్రశ్న పత్రాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భారాత్మకతను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని తయారు చేయాలని పేర్కొన్నారు. పాఠ్య పుస్తకంలోని అభ్యాసాల వెనుక ఉన్న ప్రశ్నలను యధాతథంగా అడగరాదని విద్యార్థులు ఆలోచించే విధంగా, అందరు విద్యార్థులు కూడా రాసే విధంగా ప్రశ్నపత్రాల నిర్మాణం జరగాలని అక్షర దోషాలకు,విషయ, భావ దోషాలకుతావివ్వకూడదని సూచించారు. వారి వెంట జిల్లా సైన్స్ అధికారి చాడ జైపాల్ రెడ్డి, ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఎస్. భగవంతయ్య ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ రవీందర్, స్టేట్ రిసోర్స్ పర్సన్ గాజుల రవీందర్, ఉమర్ అలీ తదితరులు ఉన్నారు.

సమయం
www.epaper.samayamdaily.net

# ప్రశాంతంగా సూర్యాపేట మున్సిపాలిటీ పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం

- చైర్మన్ గా మొరిశెట్టి నివేదిత
- వైస్ చైర్మన్ గా ఎండి షఫీ ఉల్లా
- ఎన్నిక ఏకగ్రీవం

**సూర్యాపేట ఫిబ్రవరి16( సమయం న్యూస్). :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సూర్యాపేట మున్సిపాలిటీ పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమం సోమవారం నాడు స్థానిక మునిసిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎన్నిక అధికారి సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవరావు, సహాయ ఎన్నిక అధికారి, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నూతనంగా కౌన్సిలర్ గా ఎంపికైన గౌరవ సభ్యులు ఉదయం 10 :45 నిమిషములకు మీటింగ్ హాలుకు హాజరయ్యారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ రిజిస్టర్ లో ఎన్నికలలో విజయం సాధించిన 48 మంది గౌరవసభ్యుల పేర్లను నమోదు చేసుకుని, సంతకాలు సేకరించారు. అనంతరం 48 మంది సభ్యుల చేత ముందుగా సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎన్నిక అధికారులు వారికి శుభాభినందనలు తెలిపారు. అనంతరం మాస్టర్ ట్రైన ర్ చే చైర్మన్ ఎన్నిక, వైస్ చైర్మన్ ఎంపికపై నూతనంగా ఎంపికైన కౌన్సిలర్లకు అవగాహన కల్పించారు. అనంతరం 12:30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించారు .చైర్మన్ గా మొరిశెట్టి నివేదిత (46 వ వార్డు) పేరును గుణగంటి హేమ (44వ వార్డు) సభ్యురాలు ప్రపోజ్ చేశారు. వీరికి 31 మంది కాంగ్రెస్ సభ్యులు. ముగ్గురు ఇండిపెండెంట్ సభ్యులు చేతులెత్తి ఆమోదం తెలిపారు. వైస్ చైర్మన్ గా మహమ్మద్ షఫీ ఉల్లా (41వ వార్డు )పేరును నాగుల శ్రీనివాస్ (33వ వార్డు) నామ అరుణ(30వ వార్డు) లు ప్రపోజ్ చేశారు, వీరికి 31 మంది కాంగ్రెస్ సభ్యులు ముగ్గురి ఇండిపెండెంట్ సభ్యులు చేతులెత్తి ఆమోదం తెలిపారు. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఎక గ్రీవమైనది. అనంతరం చైర్మన్ మొరిశెట్టి నివేదిత, వైస్ చైర్మన్ మహ్మద్ షఫీ ఉల్లా లకు, ఎన్నిక అధికారులు ఆర్డిఓ వేణుమాధవరావు సహాయ ఎన్నిక అధికారి సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి లు పుష్పగుచ్చాలను అందించి, శాలువాలతో సత్కరించి శుభాభినందనలు తెలిపారు .ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రేయిని రమేష్, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి...

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ఫిబ్రవరి16( సమయం న్యూస్) :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం స్థానిక జూనియర్ కాలేజ్ గ్రౌండ్ లో జిల్లాస్థాయి జూనియర్, సీనియర్ స్థాయిలో జరిగిన సీఎం కప్పు పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంత దోహదపడతాయని , పాఠశాల స్థాయిలో, కళాశాల స్థాయిలో విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడ రాణించాలని అలాగే ఈనెల 20 నుండి హైదరాబాదులో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడ సూర్యాపేట జిల్లా విద్యార్థులు మొదటి స్థానం సాధించి జిల్లాకు అలాగే పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ అన్నారు. వాలీబాల్ జూనియర్స్ లో బాయ్స్ అండ్ గర్ల్స్, సీనియర్ స్థాయిలో కబడ్డీ మెన్స్ అండ్ ఉమెన్స్, కోకో జూనియర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్, అథ్లెటిక్స్ లో సబ్ జూనియర్ జూనియర్ సీనియర్ , బాస్కెట్ బాల్ జూనియర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్, చెస్ సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్, క్యారమ్ సీనియర్ మెన్స్ అండ్ ఉమెన్స్, బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ మరియు బేస్ బాల్, జూడో, టైక్వాండో పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డిఓ వేణుమాధవ్, జిల్లా స్పోర్ట్స్ అండ్ యువజన సంక్షేమ అధికారి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల మున్సిపల్ పీఠం కాంగ్రెస్ దే

- చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ గా దేవర సమతా వెంకట్ రెడ్డి
- వైస్ చైర్మన్ గా కాసుల రాములు గౌడ్




**చేవెళ్ల ఫిబ్రవరి :16 (: సమయం న్యూస్) :** ఇటీవల కొత్తగా ఏర్పడిన చేవెళ్ల మున్సిపాలిటీ పీఠాన్ని పట్టణానికి చెందిన దేవర సమత వెంకట్ రెడ్డి అధిరోహించారు . సోమవారం ఆమె మున్సిపల్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేశారు. చేవెళ్ల మున్సిపాలిటీలో మొత్తం 18 వార్డులు ఉండగా అందులో కాంగ్రెస్ పార్టీకి చెందిన 11 మంది అభ్యర్థులు విజయం సాధించారు. 16వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థిగా దేవర సమతా వెంకటరెడ్డి 707 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన దేవర సమత వెంకట్ రెడ్డి చేవెళ్ల మున్సిపల్ మొట్టమొదటి చైర్పర్సన్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ సభ్యులు దేవర సమత వెంకటరెడ్డికి మద్దతు తెలిపారు. దేవర సమత వెంకట్ రెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో ముందంజలో ఉంచుతానని హామీ ఇచ్చారు మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని పేదలకు ఉపాధి హామీ అవకాశాలు కల్పిస్తానని తనకు మద్దతు తెలిపిన వార్డు సభ్యులకు నా మీద నమ్మకంతో నాకు ఓట్లేసి గెలిపించిన చేవెళ్ల ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలిపారు.

# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టండి

- నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి
- కమిషనర్ చాహాత్ బాజ్పాయి తో కలిసి వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ సందర్శన.....
- వడ్డేపల్లి జంక్షన్ విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం.....



**వరంగల్ ఫిబ్రవరి16( సమయం న్యూస్) :** రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగర ప్రజలకు తాగునీటి ఎద్ద డి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మేయర్ శ్రీమతి గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి హనుమకొండ పరిధిలోని వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ను మేయర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి శుద్ధి ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేం దుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని మేయర్ స్పష్టం చేశారు. నీటి శుద్ధి కోసం అవసరమైన రసాయనాలను సమృద్ధిగా నిల్వ ఉంచుకోవడంతో పాటు, పైప్‌లైన్లలో లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు.నగరానికి ధర్మసాగర్ నుండి నీటి సరఫరా జరుగు తున్నందున అక్కడి నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలి స్తూ, నీటి లభ్యతపై స్పష్టమైన అవగాహనతో చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అంతకుముందు వడ్డేపల్లి ప్రాంతంలోని జంక్షన్‌ను మేయర్, కమిషనర్‌లు పరిశీలించారు. రహదారి రద్దీ సమస్యలను దృష్టిలో ఉంచుకుని జంక్షన్ విస్తరణకు సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు ఇంచార్జి ఎస్ఈ శ్రీనివాస్ రావు, ఈఈలు రవికుమార్, మాధవి లత, డీఈలు రాజ్‌కుమార్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు మరియు రోడ్డు ట్రాఫిక్ భద్రతను పటిష్టపరచడానికి

# రైలు పట్టాల వద్ద అతిక్రమణపై ప్రత్యేక దృష్టి

- దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ




**సికింద్రాబాద్ ఫిబ్రవరి16( సమయం న్యూస్). :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గారిచే రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతపై సమీక్ష.

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గారు జోన్‌లో రైలు పట్టాల వద్ద జరుగుతున్న అతిక్రమణ సంఘటనలపై నొక్కి చెబుతూ, అతిక్రమణ సంఘటనలపై మరింత అప్రమత్తంగా ఉండాలని మరియు రైళ్ల సురక్షితమైన కార్యకలాపాలు మరియు రోడ్డు ట్రాఫిక్ భద్రతను పటిష్టపరచడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. జనరల్ మేనేజర్ రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రత కోసం తీసుకోవలసిన చర్యలపై సమగ్ర సమీక్షా సమావేశాన్నిఈ రోజు అనగా 16 ఫిబ్రవరి, 2026న సికింద్రాబాద్ లోని రైల్ నిలయంలో నిర్వహించారు. ఈ సమీక్షాసమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ శ్రీ సత్య ప్రకాష్ గారు, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతు లతోపాటు మొత్తం 6 డివిజన్లు అనగా సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు మరి యు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డి.ఆర్.ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ రైళ్లు సజావుగా నడవడానికి, లెవల్ క్రాసింగ్‌ల వద్ద భద్రతను పెంచడానికి జోన్ వ్యాప్తంగా చేపట్టిన వివిధ భద్రతా డ్రైవ్‌లపై ప్రధానంగా దృష్టి సారించారు. భద్రతను బలోపేతం చేయడంపై చర్చిస్తూ, నాన్ ఇంటర్ లాకింగ్ లెవల్ క్రాసింగ్‌లను ఆర్.ఓ.బిలు/ఆర్యుబిలతో భర్తీ చేయడానికి , సంబంధిత విభాగాలతో సమన్వయంతో ఖచ్చితమైన ప్రణాళికను ప్రారంభించాలని ఆయన అధికారులను ఆదేశించారు. జనరల్ మేనేజర్, సరుకు రవాణాపై చర్చిస్తూ, లోడ్ చేస్తున్నప్పుడు అవసరమైన అన్ని భద్రతా జాగ్రత్తలు/ భద్రతా మార్గదర్శకాలను పాటించేలా చూసుకోవాలని, ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా చూసుకోవాలని డివిజన్ లను ఆదేశించారు. ఈ విషయంలో, అధికారులు/పర్యవేక్షకులు భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించేలా ప్రైవేట్ సైడింగ్ అధికారులతో సంభాషించాలని ఆదేశించారు. జనరల్ మేనేజర్, కోచ్‌లు ఉ ప్లాట్‌ఫారమ్‌లలో శుభ్రత మరియు పరిశుభ్రతను నిర్ధారించడంపై సమీక్ష నిర్వహించారు. జోన్‌లో అగ్నిమాపక భద్రత, కేబుల్ నష్టాలు, సిగ్నల్ పరికరాల నిర్వహణ పనులపై కూడా ఆయన చర్చించారు. రైల్వే ఆస్తుల భద్రతను పటిష్టప రచడానికి మరియు సమయపాలనను మెరుగుపరచడానికి షెడ్యూల్ ప్రకారం భద్రతా కార్యకలాపాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# ప్రశాంతంగా వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపల్ ప్రత్యేక సమావేశాలు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దిశానిర్దేశం కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన ప్రిసైడింగ్ అధికారులు
- వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ లుగా పాలకుర్తి సారంగపాణి, పెండెం శ్రీ లక్ష్మీ
- నర్సంపేట చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ల ఏకగ్రీవ ఎన్నిక.




**వరంగల్, ఫిబ్రవరి 16( సమయం న్యూస్).:** వరంగల్ జిల్లా లోని వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపాలిటీల ప్రత్యేక సమావేశాలు సోమవారం పూర్తయ్యాయి. నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం, చైర్ పర్సన్/వైస్ చైర్ పర్సన్ ల ఎన్నిక కోసం నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద మార్గనిర్దేశంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.వర్ధన్నపేట, పురపాలక సంఘం సమావేశానికి వరంగల్ ఆర్డీఓ సుమా ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించగా, నర్సంపేట ప్రిసైడింగ్ అధికారిగా ఉమారాణి బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఉదయం 11.00 గంటలకు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఆయా పార్టీల వారీగా సభ్యులు సమావేశ మందిరాలలోకి చేరుకోగా, వరుస క్రమంలో నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రిసైడింగ్ అధికారులు ముందుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా హోదా కలిగిన ఎమ్మెల్యేలు సైతం స్పెషల్ మీటింగ్ లకు హాజరై చైర్ పర్సన్/ వైస్ చైర్ పర్సన్ ఎన్నికలో పాల్గొన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు శివకుమార్ నాయుడు ఎన్నిక ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు సరిపడా కోరం ఉందని నిర్ధారించుకున్న మీదట ఎన్నిక ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.వర్ధన్నపేట మున్సిపాలిటీ నగర చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికైన పాలకుర్తి సారంగపాణి పేరును ఆ పార్టీకి చెందిన సభ్యుడు మాలోతు దేవేందర్ ప్రతిపాదించగా, బెజ్జం పాపయ్య బలపర్చారు. అలాగే, బి ఆర్ ఎస్ పార్టీ నుండి బి ఫామ్ సకాలంలో రానందు వల్ల బి ఆర్ ఎస్ తరపున ఎన్నికల బరిలో నిలుచున్న చైర్మన్ అభ్యర్థిగా గుజ్జ వీరన్న పేరును స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తూ బానోతు జ్యోతి ప్రతిపాదించగా, చిలువేరు రమ బలపర్చారు.కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రమే విప్ జారీ చేయడం జరిగిందని, ఇతర పార్టీల నుంచి విప్ జారీ చేయబడలేదని ఈ సందర్భంగా ఆర్డీఓ సుమా పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ తరపున చైర్పర్సన్ అభ్యర్థిగా బరిలో నిలిచినపాలకుర్తి సారంగపాణి కుమద్ద తుగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికైన 5 గురు, స్వతంత్ర అభ్యర్థి గా గెలుపొందిన నేతావత్ షిబారాణి, ఎక్స్ అఫీషి యో సభ్యులుగా చేతులెత్తే విధానంలో వర్ధన్నపేట శాసన సభ్యులు కె ఆర్ నాగరాజు చెయ్యి ఎత్తు విధానం ద్వారా ఓటు వేయడంతో మొత్తం కోరంకు కావలసిన 7 గురి మద్దతు ఉండడంతో పాలకుర్తి సారంగపాణిని వర్ధన్నపేట పురపాలక సంఘం చైర్పర్సన్ గా ఎన్నికైనట్లు ఆర్డీఓ సుమా ప్రకటించారు.అలాగే బిఆర్ఎస్ నుంచి గెలుపొందిన 6 మంది సభ్యులుగుజ్జ వీరన్న కు మద్దతుగా చేతులెత్తే విధా నం ద్వారా మద్దతు ప్రకటించారు. అనంతరం వైస్ చైర్మన్ గా స్వతంత్ర అభ్యర్థి నేతావత్ షిబారాణి పేరును కాంగ్రెస్ సభ్యులు మనావత్ కామ్లి ప్రతిపాదించగా, అదే పార్టీ అభ్యర్థి వాణి తిరుపల్లి బలపరిచారు. బిఆర్ఎస్ సభ్యుల తరపున వైస్ చైర్మన్ అభ్యర్థిగా తిరుపతి సురేష్ కు అదే పార్టీ అభ్యర్థిని తుమ్మల అరుణ ప్రతిపాదించగా, బీఆర్ ఎస్ నుండి చిలువేరు కుమారస్వామి బలపరిచారు. స్వతంత్ర అభ్యర్థి షిబారాణి కు 6 గురు మంది కాంగ్రెస్ సభ్యుల తోపాటు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా చేతులెత్తే విధానంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు చేతులెత్తే విధానం ద్వారా ఓటు వేయడంతో మొత్తం కోరంకు కావలసిన 7 మంది మద్దతు ఉండడంతో నేతావత్ షిబారాణి ను వైస్ చైర్మన్ గా ఎన్నికైనట్లు ఆర్డీఓ సుమా ప్రకటించారు. అనంతరం చైర్పర్సన్ గా ఎన్నికైనసారంగపాణితో, వైస్ చైర్మన్ గా ఎన్నికైన మనావత్ షిబారాణి తో ఆర్డీఓ సుమా ప్రమాణ స్వీకారం చేయించారు.అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, క్షేత్రస్థాయిలో స్వీయ పర్యవేక్షణ జరుపుతూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటన లకు తావులేకుండా ఎన్నికల సంఘం నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ, వీడియో చిత్రీకరణ నడుమ పూర్తి పారదర్శకంగా ఈ ఎన్నికల ప్రక్రియను జరిపించారు. నర్సంపేట మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది.మున్సిపల్ ఎన్నికల ఆథరైజ్డ్ అధికారి, నర్సంపేట ఆర్డీవో పోలం ఉమారాణి ఆధ్వర్యంలో, మున్సిపల్ కమిషనర్ భాస్కర్ సుధీర్ కుమార్ గారి సమక్షంలో గెలుపొందిన వార్డు సభ్యులతో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చట్టం ప్రకారం చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి పాల్గొన్నారు.మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా పెండెం శ్రీలక్ష్మి రామానంద్ గారు, వైస్ చైర్‌పర్సన్‌గా గంధం నరేందర్ గారిని ఏకగ్రీవంగా (కాంగ్రెస్ పార్టీ) ఎన్నుకున్నట్లు ఆథరైజ్డ్ అధికారి అధికారికంగా ప్రకటించారు.మొత్తం 30 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 21, బీఆర్ఎస్ 6, బీజేపీ 1, సీపీఎం 1, ఇండిపెండెంట్ 1 స్థానాలను గెలుచుకున్నాయి. వార్డు సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థులు శ్రీలక్ష్మి రామానంద్ చైర్‌పర్సన్‌గా, గంధం నరేందర్ వైస్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్ పర్సన్/ వైస్ చైర్ పర్సన్ ల ఎన్నికను పురస్కరించుకుని ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా మున్సిపల్ కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు ఏ.సీ.పీ లు నర్సయ్య , ఇతర పోలీసు అధికారులు బందోబస్తును పర్యవేక్షించారు.

# యూఏఈపై ఆఫ్ఘనిస్తాన్ ఉత్కంఠ విజయం

### ఆల్‌రౌండర్ షోతో అదరగొట్టిన అజ్మతుల్లా ఒమర్జాయ్

### సూపర్ 8 ఆశలు సజీవంగా ఉంచుకున్న ఆఫ్ఘనిస్తాన్

టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా ఫిబ్రవరి 16న న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన గ్రూప్ డి మ్యాచ్‌లో యూఏఈపై ఆఫ్ఘనిస్తాన్ 5 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా ఫీల్డింగ్ ఎంచుకున్న ఆఫ్ఘనిస్తాన్ జట్టు యూఏఈని 160 పరుగులకే పరిమితం చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఇబ్రహీం జద్రాన్, అజ్మతుల్లా ఒమర్జాయ్ అద్భుత ప్రదర్శనతో ఆఫ్ఘనిస్తాన్ 19.2 ఓవర్లలో 5 వికెట్లు మాత్రమే కోల్పోయి 162 పరుగులు చేసి గెలుపొందింది. ఈ విజయంతో ఆఫ్ఘనిస్తాన్ టోర్నీలో తమ తొలి గెలుపును నమోదు చేసుకోవడంతో పాటు సూపర్ 8 ఆశలను సజీవంగా ఉంచుకుంది.

### ఆదుకున్న సోహైబ్ ఖాన్, చెలరేగిన ఒమర్జాయ్



తొలుత బ్యాటింగ్‌కు దిగిన యూఏఈకి ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ ఆర్యన్ష్ శర్మ డకౌట్ కాగా, కెప్టెన్ ముహమ్మద్ వసీం 10 పరుగులకే పెవిలియన్ చేరాడు. 13 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన యూఏఈని సోహైబ్ ఖాన్, అలీషాన్ షరఫు ఆదుకున్నారు. వీరిద్దరూ కలిసి 3వ వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. సోహైబ్ ఖాన్ 48 బంతుల్లో 68 పరుగులు, అలీషాన్ షరఫు 31 బంతుల్లో 40 పరుగులతో రాణించారు. అయితే ఆఫ్ఘన్ బౌలర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ 4 వికెట్లతో చెలరేగడంతో యూఏఈ వరుసగా వికెట్లు కోల్పోయి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 160 పరుగులు మాత్రమే చేయగలిగింది. ముజీబ్ ఉర్ రెహ్మాన్ 2 వికెట్లు పడగొట్టగా, కెప్టెన్ రషీద్ ఖాన్ 1 వికెట్ తీసి టీ20 క్రికెట్‌లో 700 వికెట్లు పూర్తి చేసుకున్న తొలి బౌలర్‌గా రికార్డు సృష్టించాడు.

### జద్రాన్ అర్ధశతకం, ఒమర్జాయ్ ఫినిషింగ్

161 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆఫ్ఘనిస్తాన్‌కు కూడా తొలి ఓవర్‌లోనే షాక్ తగిలింది. ఇన్‌ఫామ్ బ్యాటర్ రహ్మానుల్లా గుర్బాజ్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇబ్రహీం జద్రాన్ 41 బంతుల్లో 53 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. గుల్బదిన్ నైబ్, సెదికుల్లా అటల్ కాసేపు పోరాడి అవుట్ అయ్యారు. 10వ ఓవర్లో 70 పరుగులకు 3 వికెట్లు కోల్పోయిన దశలో దర్వీష్ రసూలీ, అజ్మతుల్లా ఒమర్జాయ్ అద్భుతమైన పోరాట పటిమను కనబరిచారు. రసూలీ 23 బంతుల్లో 33 పరుగులు చేశాడు. మరోవైపు ఒమర్జాయ్ బ్యాట్‌తో కూడా చెలరేగి కేవలం 21 బంతుల్లోనే 2 ఫోర్లు, 3 సిక్సర్లతో అజేయంగా 40 పరుగులు సాధించి జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. బౌలింగ్, బ్యాటింగ్ రెండు విభాగాల్లోనూ అదరగొట్టి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసిన అజ్మతుల్లా ఒమర్జాయ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ గెలుపుతో ఆఫ్ఘనిస్తాన్ పాయింట్ల పట్టికలో 3వ స్థానానికి చేరుకోగా, యూఏఈ టోర్నీ నుంచి దాదాపుగా నిష్క్రమించింది.





# ఆస్ట్రేలియాపై శ్రీలంక ఘన విజయం

### అద్భుత శతకంతో చెలరేగిన పాతుమ్ నిస్సంక..

### సూపర్ 8కి చేరిన శ్రీలంక, ఆస్ట్రేలియాకు నిరాశ

టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా ఫిబ్రవరి 16న పల్లెకెలె అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన గ్రూప్ బి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై శ్రీలంక 8 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా ఫీల్డింగ్ ఎంచుకున్న శ్రీలంక జట్టు ఆస్ట్రేలియాను 181 పరుగులకే పరిమితం చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో పాతుమ్ నిస్సంక సంచలన శతకంతో చెలరేగడంతో శ్రీలంక కేవలం 18 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 184 పరుగులు చేసి ఘన విజయం నమోదు చేసింది. ఈ విజయంతో శ్రీలంక అధికారికంగా సూపర్ 8 దశకు చేరుకోగా, ఆస్ట్రేలియా టోర్నీ నుంచి నిష్క్రమించే ప్రమాదంలో పడింది.

### కుప్పకూలిన ఆస్ట్రేలియా ఇన్నింగ్స్

తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు ఓపెనర్లు ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్ అద్భుతమైన శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు వీరిద్దరూ కలిసి 104 పరుగులు జోడించారు. ట్రావిస్ హెడ్ 56 పరుగులు, మిచెల్ మార్ష్ 54 పరుగులతో రాణించారు. ఆ తర్వాత శ్రీలంక స్పిన్నర్లు రంగంలోకి దిగడంతో మ్యాచ్ స్వరూపం పూర్తిగా మారిపోయింది. దుషన్ హేమంత 3 వికెట్లతో ఆస్ట్రేలియా పతనాన్ని శాసించాడు. ఇతర బౌలర్లు కూడా రాణించి కీలక వికెట్లు పడగొట్టడంతో ఆస్ట్రేలియా వరుసగా వికెట్లు కోల్పోయి 20 ఓవర్లలో 181 పరుగులకే ఆలౌట్ అయింది.

### నిస్సంక సంచలన ఇన్నింగ్స్

182 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు 2వ ఓవర్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. మార్కస్ స్టోయినిస్ బౌలింగ్‌లో ఓపెనర్ కుశాల్ పెరీరా 1 పరుగుకే పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కుశాల్ మెండిస్‌తో కలిసి పాతుమ్ నిస్సంక ఆస్ట్రేలియా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ కలిసి 2వ వికెట్‌కు 97 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కుశాల్ మెండిస్ 51 పరుగులు చేసి అవుట్ అయినప్పటికీ, నిస్సంక ఏమాత్రం తగ్గకుండా ఆడుతూ కేవలం 52 బంతుల్లోనే అజేయంగా 100 పరుగులు సాధించాడు. పవన్ రత్నాయకే 15 బంతుల్లో 28 పరుగులతో అజేయంగా నిలిచి నిస్సంకకు చక్కటి సహకారం అందించాడు. ఈ అద్భుత ప్రదర్శనతో పాతుమ్ నిస్సంకకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ ఓటమితో గ్రూప్ బి పాయింట్ల పట్టికలో 3వ స్థానానికి పడిపోయిన ఆస్ట్రేలియా, సూపర్ 8 ఆశలు సజీవంగా ఉండాలంటే తమ తదుపరి మ్యాచ్‌లో గెలవడంతో పాటు ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# ఇంగ్లాండ్ అద్భుత విజయం

### ఇటలీపై 24 పరుగుల తేడాతో గెలుపు.. సూపర్ 8కి దూసుకెళ్లిన ఇంగ్లాండ్ జట్టు

టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా ఫిబ్రవరి 16న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన గ్రూప్ సి మ్యాచ్‌లో ఇటలీపై ఇంగ్లాండ్ 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 202 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 203 పరుగుల లక్ష్య ఛేదనలో ఇటలీ జట్టు పోరాడినా ఫలితం దక్కలేదు. 20 ఓవర్లలో 178 పరుగులకు ఇటలీ ఆలౌట్ అయింది. ఈ అద్భుత విజయంతో గ్రూప్ సి నుంచి వెస్టిండీస్‌తో పాటు ఇంగ్లాండ్ కూడా సూపర్ 8 దశకు అధికారికంగా అర్హత సాధించింది.

### విల్ జాక్స్ సంచలన ఇన్నింగ్స్

తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఇంగ్లాండ్‌కు ఓపెనర్ ఫిల్ సాల్ట్ 15 బంతుల్లో 28 పరుగులతో శుభారంభం అందించాడు. కెప్టెన్ జోస్ బట్లర్ కేవలం 3 పరుగులకే పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత వచ్చిన జాకబ్ బెథెల్ 23 పరుగులు, టామ్ బాంటన్ 30 పరుగులతో రాణించారు. ఒక దశలో 105 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన ఇంగ్లాండ్‌ను విల్ జాక్స్, సామ్ కర్రన్ ఆదుకున్నారు. సామ్ కర్రన్ 19 బంతుల్లో 25 పరుగులు చేశాడు. విల్ జాక్స్ ఆకాశమే హద్దుగా చెలరేగి కేవలం 22 బంతుల్లోనే 4 సిక్సర్లు, 3 ఫోర్లతో అజేయంగా 53 పరుగులు సాధించాడు. దీనితో ఇంగ్లాండ్ 202 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఇటలీ బౌలర్లలో గ్రాంట్ స్టీవర్ట్, క్రిషన్ కలుగమగే చెరో 2 వికెట్లు తీశారు.

### పోరాడిన ఇటలీ బ్యాటర్లు

203 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇటలీకి తొలి ఓవర్‌లోనే జోఫ్రా ఆర్చర్ కోలుకోలేని దెబ్బ తీశాడు. ఆంథోనీ మోస్కా, జేజే స్మట్స్ ఇద్దరినీ డకౌట్‌గా వెనక్కి పంపాడు. 22 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన దశలో బెన్ మనేంటి సంచలన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. కేవలం 25 బంతుల్లోనే 6 సిక్సర్లు, 4 ఫోర్లతో 60 పరుగులు చేసి ఇటలీ శిబిరంలో ఆశలు రేపాడు. జస్టిన్ మోస్కా 34 బంతుల్లో 43 పరుగులతో అతనికి చక్కటి సహకారం అందించాడు. చివర్లో గ్రాంట్ స్టీవర్ట్ 23 బంతుల్లో 45 పరుగులతో పోరాడినప్పటికీ విజయానికి అది సరిపోలేదు. ఇంగ్లాండ్ బౌలర్లలో సామ్ కర్రన్ 3 వికెట్లు, జేమీ ఓవర్టన్ 3 వికెట్లు తీసి ఇటలీ పతనాన్ని శాసించారు. అద్భుతమైన అర్ధశతకంతో ఇంగ్లాండ్ విజయానికి బాటలు వేసిన విల్ జాక్స్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.



# వ్యూయర్‌షిప్‌లో జియో హాట్‌స్టార్ ఆల్‌టైమ్ రికార్డు

### భారత్, పాక్ మ్యాచ్‌తో సరికొత్త చరిత్ర.. లైవ్ వ్యూయర్‌షిప్‌లో 6 కోట్లకు చేరిన రికార్డు

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన హైఓల్టేజ్ మ్యాచ్ వ్యూయర్‌షిప్‌లో సరికొత్త రికార్డులను సృష్టించింది. ఈ మ్యాచ్ అధికారిక ప్రసారకర్త జియో హాట్‌స్టార్‌కు భారీ ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. భారత్ ఆధిపత్యం ప్రదర్శించి మ్యాచ్‌ను ఏకపక్షంగా ముగించినప్పటికీ వ్యూయర్‌షిప్‌లో మాత్రం సరికొత్త చరిత్ర నమోదైంది. ఈ మ్యాచ్‌కు మొత్తం 45.4 కోట్ల వ్యూస్ వచ్చినట్లు జియో హాట్‌స్టార్ అధికారికంగా ప్రకటించింది. క్రికెట్ చరిత్రలోనే ఇది సరికొత్త రికార్డుగా నిలిచింది. గతంలో 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ సమయంలో 5.9 కోట్ల లైవ్ కాన్‌కరెంట్ వ్యూస్ రాగా, తాజాగా జరిగిన భారత్-పాక్ మ్యాచ్‌కు ఈ సంఖ్య 6 కోట్లుగా ఉన్నట్లు సమాచారం.

కొలంబో వేదికగా ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించి 61 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న వికెట్‌పై భారత్ 176 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించగా, పాకిస్థాన్ కేవలం 114 పరుగులకే కుప్పకూలింది. ఈ విజయంతో గ్రూప్ ఏ నుంచి టీమిండియా సూపర్ 8 బెర్త్ దక్కించుకోగా, పాకిస్థాన్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. భారీ ఓటమి కారణంగా పాక్ నెట్ రన్ రేట్ కూడా దెబ్బతింది. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా ఈ మ్యాచ్‌ను బహిష్కరిస్తామని పాకిస్థాన్ తొలుత ప్రకటించినప్పటికీ, ఐసీసీ జోక్యంతో తలొగ్గి మ్యాచ్ ఆడింది. ఈ పరిణామాల వల్ల మ్యాచ్‌పై విపరీతమైన క్రేజ్ పెరిగి వ్యూయర్‌షిప్ పెరగడానికి దోహదపడింది.

ఈ మ్యాచ్‌లో మిస్టరీ స్పిన్నర్ ఉస్మాత్ తారిక్ విలక్షణమైన యాక్షన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొలంబో స్పిన్ పరిస్థితులకు తగ్గట్లు పాక్ జట్టులో 6 మంది స్పిన్నర్లు ఉన్నప్పటికీ భారత్ ధాటి ముందు వారు నిలవలేకపోయారు. ఏ దశలోనూ కనీస పోటీ ఇవ్వలేకపోయిన పాకిస్థాన్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఒకవేళ ఈ మ్యాచ్ రద్దయి ఉంటే ప్రసారకర్త జియో హాట్‌స్టార్ భారీగా నష్టపోయేది, కానీ పాక్ ఆడిన బాయ్ కట్ డ్రామా మ్యాచ్‌పై హైప్ క్రియేట్ చేసి ఆ సంస్థకు భారీగా వ్యూయర్‌షిప్ వచ్చేలా కలిసి వచ్చింది.





# ప్రగ్య జైశ్వాల్ రెడ్ హాట్ లుక్ వైరల్

ముంబై బ్యూటీ ప్రగ్య జైస్వాల్ నిరంతర సోషల్ మీడియా పోస్టులకు బోలెడంత ఫాలోయింగ్ ఉన్న సంగతి తెలిసిందే. లక్షలాదిగా ఫ్యాన్స్ తనను అనుసరిస్తున్నారు. తాజాగా ఈ బ్యూటీ పోస్ట్ చేసిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తున్నాయి. ప్రగ్య షేర్ చేసిన –సర్వింగ్ సిట్రస్– ఫోటో షూట్ హాట్ టాపిగ్గా మారింది. ప్రగ్య తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆరెంజ్ కలర్ థై స్లిట్ డ్రెస్ ధరించి సెలయేటి పక్కన దిగిన ఫోటోలను షేర్ చేసింది. ఈ ఫోటోలకు –పుల్లటి పండు అందిస్తున్నాను–- అని రాసింది. ఈ కొత్త లుక్ లో తన అందం, డ్రెస్సింగ్ స్టైల్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రగ్య మునుపటి కంటే ఈ లేటెస్ట్ లుక్ లో హాలిగా ఉందంటూ ప్రశంసలు కురుస్తున్నాయి. కెరీర్ మ్యాటర్ కి వస్తే, ప్రగ్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఈ బ్యూటీ ఇటీవల అఖండ 2తో భారీ విజయం అందుకుంది. బాలయ్య–బోయపాటి కాంబినేషన్‌లో వచ్చిన ఈ భారీ సీక్వెల్‌లో తన నటనకు చక్కని పేరొచ్చింది. తదుపరి బాలీవుడ్ లో సీనియర్ నటుడు సన్నీడియోల్ సరసనా ఓ చిత్రంలో నటిస్తోందని సమాచారం. ప్రగ్య పార్టీ లైఫ్ విషయానికి వస్తే, తనకంటూ మంచి స్నేహితుల బృందం ఉంది. ఇందులో మంచు లక్ష్మి, రకుల్ ప్రీత్ చాలా కాలంగా మంచి స్నేహితులు. ఆ ఇరు కుటుంబాలతో కలిసి ప్రగ్య సెలబ్రేట్ చేసుకున్న ఫోటోలు ఈడియోలు కూడా వైరల్ అయ్యాయి. స్నేహితులు కలిసి పార్టీలు చేసుకోవడం, జిమ్‌లో వర్కవుట్స్ చేయడం, విదేశీ పర్యటనలకు వెళ్లడం రెగ్యులర్ గా చూస్తున్నదే.మొత్తానికి ప్రగ్య తన గ్లామర్‌తో అటు సోషల్ మీడియాను, ఇటు సినిమాలతో బాక్సాఫీస్‌ను బ్యాలెన్స్ చేస్తోంది.

## ప్రమోషన్స్ పూర్తి చేసుకున్నాక టైటిల్ వివాదాలు

సినిమా ప్రమోషన్లన్నీ పూర్తి చేసుకున్నాక, సరిగ్గా సెన్సార్ సర్టిఫికేట్ వచ్చే సమయంలో టైటిల్ మార్చాల్సి రావడం నిర్మాతలకు పెద్ద తలనొప్పిగా మారింది. తాజాగా యంగ్ హీరో సుహాస్ నటించిన సినిమా కూడా ఇదే సమస్యను ఎదుర్కొంది. కేవలం సుహాస్ మాత్రమే కాదు, ఈ మధ్య కాలంలో మరికొన్ని చిన్న సినిమాలు కూడా సెన్సార్ అ÷–జబెక్షన్స్ వల్ల పేర్లు మార్చుకున్నాయి. సుహాస్, శివానీ నగరం జంటగా నటించిన చిత్రం 'హే భగవాన్'. ఈ నెల 20న విడుదలకు సిద్ధమైన ఈ సినిమాపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. దేవుడి పేరుతో ఉన్న టైటిల్ వల్ల కొన్ని వర్గాల సెంటిమెంట్స్ దెబ్బతినే అవకాశం ఉందని భావించిన బోర్డు, పేరు మార్చాలని సూచించింది. దీంతో మేకర్స్ చేసేదేమీ లేక చివరి నిమిషంలో టైటిల్‌ను 'హే బలవంత్!' గా మార్చారు. ప్రమోషన్లన్నీ పాత పేరుతోనే జరగడంతో ఈ మార్పు సినిమాపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని చిత్ర యూనిట్ ఆందోళన చెందుతోంది. ఇటీవల విడుదలైన 'వానర' చిత్రానికి కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ చిత్రంలో కుల రాజకీయాలు మరియు సున్నితమైన అంశాలు ఉండటం, టైటిల్ ఏమో హనుమంతుడిని గుర్తు చేసేలా ఉండటంతో సెన్సార్ బోర్డు నో చెప్పింది. దీంతో ఈ సినిమాను 'వనవీర' పేరుతో విడుదల చేయాల్సి వచ్చింది. ప్రమోషన్ల కోసం ఖర్చు పెట్టిన డబ్బు, టైటిల్ రీచ్ అంతా వృథా అయిందని ఆ చిత్ర దర్శకుడు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే శివ కందుకూరి నటించిన 'చాయ్ వాలా' సినిమాకు కూడా సెన్సార్ కష్టాలు తప్పలేదు. ఈ టైటిల్ వాడకూడదని బోర్డు పట్టుబట్టడంతో, చిత్ర యూనిట్ తమ వర్కింగ్ టైటిల్ అయిన 'నవాబ్ కేఫ్'ను ఖరారు చేసింది. తండ్రీ కొడుకుల మధ్య సాగే ఈ ఎమోషనల్ డ్రామా ఫిబ్రవరి 20న కొత్త పేరుతో థియేటర్లలోకి రానుంది. చిన్న సినిమాలకు టైటిల్ అనేది బ్రాండింగ్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. ఇలాంటి సమయంలో సెన్సార్ బోర్డు నిబంధనలు చిన్న నిర్మాతలకు భారంగా మారుతున్నాయి.



# ఫౌజీ షూటింగ్‌లో ప్రభాస్‌కు గాయం



ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం ఫౌజీ షూటింగ్‌లో స్వల్ప ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. గుర్రపు స్వారీ సన్నివేశం చిత్రీకరణ సమయంలో ప్రభాస్ కింద పడిపోవడంతో చేతులకు చిన్న గాయాలు అయినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. చిత్ర బృందం వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందించగా, గాయాలు తీవ్రంగా లేవని తెలిసింది. వైద్యులు ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం ప్రభాస్ సురక్షితంగానే ఉన్నారని, త్వరలోనే మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నారని యూనిట్ తెలిపింది. ఈ వార్తతో అభిమానులు తొలుత ఆందోళన చెందగా, గాయాలు చిన్నవేనని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. 'ఫౌజీ' చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో సీతారామంతో ప్రశంసలు అందుకున్న ఆయన, ఈసారి మరింత ఎమోషన్‌తో కూడిన యాక్షన్ డ్రామాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని టాక్. ఈ సినిమాలో ప్రభాస్ బ్రిటిష్ సైనికుడి పాత్రలో కనిపించ నున్నారని సమాచారం. దేశభక్తి, ప్రేమ, త్యాగం వంటి అంశాలతో కథ నడుస్తుందని తెలుస్తోంది. గుర్రపు స్వారీతో కూడిన హై వోల్టేజ్ చేజింగ్ సన్నివేశం సినిమాకే హైలైట్‌గా నిలవనుందని, భారీ సెట్స్ మరియు విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సన్నివేశాలను రూపొందిస్తున్నారని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తోంది.



# 26న ఉదయ్‌పూర్‌లో రష్మిక, విజయ్ పెళ్లి

**మార్చి 4న హైదరాబాద్‌లో రిసిప్షన్ అంటూ ప్రచారం**

టాలీవుడ్‌లో హిట్ ఫెయిర్ హీరో విజయ్ దేవరకొండ– హీరోయిన్ రష్మిక మందన్న పెళ్లి వార్తలు ఇప్పుడు మరింత జోరందుకున్నాయి. వీరు వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతోంది. ఫిబ్రవరి చివరి వారంలో వీరి పెళ్లి జరగనుందనే టాక్ ఇండస్ట్రీలో సెన్సేషన్ సృష్టిస్తోంది. రాజస్థాన్‌లోని అందమైన నగరం ఉదయ్‌పూర్ లోని ఓ రాయల్ ప్యాలెస్‌లో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య సింపుల్‌గా పెళ్లి వేడుక జరపాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 26 తేదీని ముహూర్తంగా ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో చర్చ నడుస్తోంది. ఈ వేడుకను గోప్యంగా ఉంచేందుకు ఎంత ప్రయత్నించినా సోషల్ మీడియాలో సమాచారం లీక్ అవుతూనే ఉండటం గమనార్హం. పెళ్లి వేడుక ఉదయ్‌పూర్‌లో సాదాసీదాగా జరిగినా, అసలు హంగామా మాత్రం హైదరాబాద్ లోనే ఉండబోతుందని టాక్. మార్చి 4న నగరంలోని ప్రముఖ వేదికలో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం భారీ రిసెప్షన్ నిర్వహించనున్నట్లు సమాచారం. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్ సెలబ్రిటీలు ఈ వేడుకకు హాజరవుతారని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల విజయ్ దేవరకొండ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ఆహ్వాన పత్రిక అందించారనే ప్రచారం ఈ పెళ్లి వార్తలకు మరింత బలం చేకూర్చింది. తాజాగా విజయ్ దేవరకొండ వెడ్డింగ్ కార్డ్ నెట్టింట వైరల్ అవుతుంది. ఇది చాలా సింపుల్‌గా కనిపిస్తుంది. ఈ ఇన్విటేషన్ ప్రకారం వారి వివాహం ఫిబ్రవరి 26న వివాహవం జరగనుందని అర్థమవుతుంది. రష్మిక – విజయ్‌లతో కలిసి పని చేసిన దర్శకులు, టెక్నీషియన్లు, సన్నిహితులు కూడా ఈ వేడుకలో పాల్గొనే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సెలబ్రిటీ వెడ్డింగ్ రిసెప్షన్‌కు ప్రముఖ దర్శకులు, నిర్మాతలు, స్టార్ హీరోలు హాజరవుతారనే అంచనాలు ఉన్నాయి.

# మార్చిలో రానున్న ఉస్తాద్ భగత్ సింగ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న భారీ మాస్ ఎంటర్‌టైనర్ ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో రాశి ఖన్నా, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తుండగా, మాస్ కమర్షియల్ చిత్రాలకు కేరాఫ్ గా ఉన్న ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. సంగీత బాధ్యతలను రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ చేపట్టారు. మార్చి 26న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం మరింత వేగవంతం చేసింది. ఇటీవల విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' లిరికల్ వీడియో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ పాటకు భారీ స్పందన లభించగా, అనేక మంది అభిమానులు వాట్సాప్ స్టేటస్‌లుగా కూడా పెట్టుకున్నారు. పవన్ కళ్యాణ్ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు దేవిశ్రీప్రసాద్ అందించిన ఎనర్జిటిక్ బీట్‌లు జత కావడంతో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. మొదటి పాట సూపర్ హిట్ కావడంతో సినిమా మీద హైప్ మరింత పెరిగింది. ఇప్పటికే మొదటి సాంగ్ సక్సెస్ కావడంతో రెండో పాట కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో చిత్రబృందం 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో సాంగ్‌ను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన పోస్టర్ ప్రత్యేక డిజైన్‌తో ఉండి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ లుక్, మాస్ అటిట్యూడ్ పోస్టర్‌లో హైలైట్ కావడంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత రెట్టింపైంది. గతంలో పవన్ కళ్యాణ్ ? హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన గబ్బర్ సింగ్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించి పవన్ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించింది. అదే కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా మాస్ హిట్ అవుతుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా కనిపిస్తోంది.




Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131

# ‘ప్రపంచం భారత్‌కు వస్తోంది‘

దిల్లీ వేదికగా జరగుతున్న ‘ఏఐ-ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ 2026‘ కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రతినిధులు హాజరవుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదకగా వారికి స్వాగతం పలికారు. ప్రపంచం ఇప్పుడు ఇండియాకు వస్తోందన్నారు. ఈ మెగా ఈవెంట్‌ను ప్రారంభించడానికి ముందు ఆయన ఎక్స్ లో పోస్టు చేశారు. ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ కోసం దేశ విదేశాల నుంచి ప్రతినిధులు రావడం ఎంతో గర్వకారణమన్నారు. ‘ఏఐపై చర్చకు ప్రపంచాన్ని ఒకే వేదికపై తీసుకువస్తున్నాం. దిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ కోసం ప్రపంచ నలుమూలల వచ్చిన నాయకులు, పారిశ్రామిక వేత్తలు, ఇన్నోవేటర్లు, పాలసీ మేకర్లు, టెక్ నిపుణులను స్వాగతిస్తున్నా. ఇది మా దేశానికి గర్వకారణం. అలాగే భారత యువత సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపిస్తోంది. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ అభివృద్ధికి భారత్ సహకారాన్ని అందిస్తోందనడాన్ని ఈ సమ్మి ట్ మరింత బలపరుస్తుంది‘ అని ప్రధాని మోదీ రాసుకొ చ్చారు. ఏఐ ఇప్పటికే పలు రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ‘ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పాలన, పరిశ్రమలు వంటి రంగాల్లో మార్పులు వచ్చాయి. ఏఐ వినియోగం బాధ్యతాయ-ుతంగా ఉండాలి. ప్రపంచ స్థాయిలో చర్చలకు ఈ సమ్మిట్ దోహదపడుతుంది. ఈ సమ్మిట్ ఫలితాలు ప్రగతిశీల, వినూత్నమైన, అవకాశాల ఆధారిత భవిష్యత్తును



రూపొందించడంలో సహాయపడతా యని నేను విశ్వసిస్తున్నా. 1.4 బిలియన్ భారతీయుల వల్లే దేశం ఏఐ మార్పులో ముందంజలో ఉంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్ ఎకోసిస్టమ్, ఆధునిక పరిశోధనలు ఇవన్నీ ఏఐ పట్ల భారత్‌కు ఉన్న ఆశయం, బాధ్యతను ప్రతిబింబిస్తున్నాయి‘ అని ప్రధాని మోదీ తెలిపారు.

**భారత్ మండపం వేదికగా ఏఐ ఎక్స్‌పో**

ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ దిల్లీలోని మండపంలో జరగనుంది. ఈ సమ్మిట్‌తో పాటు ‘ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో‘ కూడా జరుగుతుంది. దీనిని సోమవారం ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఇది ఏఐ పాలసీ, ఇన్నోవేషన్, అమలు ఇలా అన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చేలా రూపకల్పన చేశారు. 70,000 చదరపు మీటర్లకు పైగా విస్తీర్ణంలో ఈ ఎక్స్‌పో ఉంటుంది. గ్లోబల్ టెక్ కంపెనీలు, స్టార్టప్‌లు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాల పాల్గొనున్నాయి. ఈ ఎక్స్‌పోలో ఏఐ ఎకోసిస్టంలో అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని హైలైట్ చేస్తూ 13 దేశాల పెవిలియన్‌లను ఏర్పాటు చేశారు. పీపుల్-ప్లానెట్- ప్రోగ్రెస్ అనే మూడు ప్రధాన థీమ్‌లుగా ఈ ఎక్స్‌పోను విభజించారు. 300కి పైగా ఎగ్జిబిషన్ పెవిలియన్లు, ప్రత్యక్ష డెమో ప్రదర్శనలు ఉంటాయి. వ్యవసాయం నుంచి విద్య, ఆరోగ్యం వరకు వివిధ రంగాల్లో ఏఐ ఎలా ఉపయోగపడుతుందో ప్రత్యక్షంగా చూపించనున్నారు.

**స్టార్టప్‌లకు భారీ వేదిక**

600కి పైగా హై-పొటెన్షియల్ స్టార్టప్‌లు పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిలో చాలా వరకు వాస్తవ జీవితంలో ఉపయోగిస్తున్నూ× సొల్యూషన్లు ఉన్నాయి. 2.5 లక్షలకు పైగా సందర్శకులు రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమంలో 500కు పైగా సెషన్స్, 3,250కి పైగా స్పీకర్లు , ప్యానెలిస్టులతో 500కు పైగా సెషన్లు నిర్వహించనున్నారు. ఏఐ గవర్నెన్స్ నుంచి ఇండస్ట్రీ అప్లికేషన్ల వరకు చర్చలు జరగనున్నాయి. ఏఐ ఇండియా ఇంపాక్ట్ గ్లోబల్ సౌత్‌లో జరగుతున్న తొలి అంతర్జాతీయ సమ్మిట్‌గా గుర్తింపు పొందిం ది. ఇక ఈ సమ్మిట్‌లో ఇండియా ఏఐ మిషన్ కింద 12 స్వదేశీ ఏఐ ఫౌండేషన్ నమూనాలను ఆవిష్కరించనున్నారు. భారత డేటాసెట్‌లపై శిక్షణ పొంది, దేశంలోని 22 అధికారిక భాషలకు అనుగుణంగా అభివృద్ధి చేశారు.

# పార్లమెంట్ సజావుగా సాగడం రాహుల్‌కు ఇష్టం లేదు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మండిపడ్డారు. పార్లమెంట్ సజావుగా సాగడం లోక్‌సభలో విపక్షనేతకు ఇష్టం లేదని ఆరోపించారు. కొన్ని ఎన్జీఓలు కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని రాహుల్‌కు భోదించాయని, అందుకే ఆయన సభను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. “రాహుల్ గాంధీకి సభ సజావుగా సాగడం ఇష్టం లేదు. అందుకే ఆయన సభలో సమస్యలను సృష్టించడంపై ఆసక్తి చూపిస్తున్నారు. కాంగ్రెస్‌కు మంచి రోజులు వస్తాయని రాహుల్ గాంధీకి కొన్ని ఎన్జీఓలు బోధించాయి. కానీ వారికి ఎప్పటికీ మంచి రోజులు రావు. తదుపరి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సీట్ల సంఖ్య మరింత తగ్గుతుంది. ప్రతిపక్షాలు సభను అడ్డుకోవడంపై పాలక కూటమికి (ఎన్డీఏ) ఎటువంటి సమస్య లేదు. ఎందుకంటే సభలో పరిస్థితిని చక్కదిద్దడానికి నేను అనేక ప్రయత్నాలు చేశాను. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేసీ వేణుగోపాల్, మరికొంత మంది నేతలతో సభ సజావుగా జరగడం గురించి మాట్లాడాను.“ అని కిరణ్ రిజిజు తెలిపారు.

**విపక్ష పార్టీలన్నీ కాంగ్రెస్‌తో లేవు : కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**

ప్రతిపక్షాల పార్టీలన్నీ కాంగ్రెస్‌తో లేవని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. పార్లమెంట్‌లో చిన్న పార్టీలు మాట్లాడే సమయాన్ని కోల్పోతున్నందున సభను నిలిపివేయవద్దని కాంగ్రెస్‌పై ఒత్తిడి ఉందని తెలిపారు. “చిన్న పార్టీలు తమకు కేటాయించిన సమయాన్ని పార్లమెంట్‌లో ఉపయోగించుకోలేకపోతున్నాయి. అందుకే అవి రాహుల్ గాంధీపై అసంతృప్తిగా ఉన్నాయి. చిన్న



పార్టీల్లో కొన్ని స్పీకర్‌పై విపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై సంతకం కూడా చేయలేదు. ఇతర రాజకీయ పార్టీలకు చెందిన కొందరు ఎంపీలు సభ సజావుగా పనిచేయాలని కోరుకుంటున్నామని నాకు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా ఎన్నికల్లో ఓడిపోవడంతో నిరాశలో కూరుకుపోయింది.“ అని రిజిజు వ్యాఖ్యానించారు.

**వాడీవేడీగా బడ్జెట్ సమావేశాలు**

గత నెల (జనవరి) 28న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు మొదలయ్యాయి. సమావేశాల ప్రారంభమైన రోజే (జనవరి 28న) పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మాట్లాడారు. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. అయితే ఈ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం నుంచి వాడీవేడీగా సాగాయి. సభలో గందరగోళం నెలకొనడంతో లోక్‌సభ, రాజ్యసభ పలుమార్లు వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలో రాహుల్‌పై కిరణ్ రిజిజు మండిపడ్డారు.

**సభను కుదిపేసిన ఆర్మీ మాజీ చీఫ్ బుక్ అంశం**

ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవణె రాసిన పుస్తకాన్ని సభలోకి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీసుకొచ్చారు. అలాగే సభలో ఈ బుక్‌లోని అంశాలకు ప్రస్తావించారు. ప్రధాని మోదీకి సైతం ఈ పుస్తకాన్ని అందిస్తానని రాహుల్ తెలిపారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొంది. ప్రచురితం కాని పుస్తకంలోని అంశాలను సభలో ఎలా ప్రస్తావిస్తారని రాహుల్‌పై బీజేపీ భగ్గుమంది. లోక్‌సభలో రాహుల్ తీరుపై మండిపడింది. దీంతో సభలో గందరగోళం నెలకొంది. రాహుల్‌ను మాట్లాడనివ్వాలని వెల్‌లోకి కాంగ్రెస్ సహా ప్రతిపక్ష సభ్యులు దూసుకెళ్లారు. ఈ క్రమంలో కొందరు స్పీకర్‌పై కాగితాలు విసిరారు. దీంతో ఎనిమిది మంది విపక్ష ఎంపీలను పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

**స్పీకర్ అవిశ్వాస తీర్మానం**

సభలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, 8 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేయడం వంటి కారణాలతో విపక్షాలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చాయి. సభను నిర్వహించడంలో స్పీకర్ ఓం బిర్లా తీవ్ర పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని, రాజ్యాంగబద్ధ కార్యాలయాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించాయి. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ తదితర పార్టీలకు చెందిన 118 మంది ఎంపీలు ఈ అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేశారు.

# దేశవ్యాప్తంగా సీసీటీవీలు ఏర్పాటు

డ్రగ్స్ రవాణాను అడ్డుకునేందుకు దేశవ్యాప్తంగా పటిష్ఠమైన ‘సీసీటీవీ కెమెరాల నెట్‌వర్క్‘ను ఏర్పాటు చేయబోతున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. అంతేకాకుండా, దశాబ్దాలుగా దేశాన్ని భయపెడుతున్న నక్సలిజం సమస్యకు ఈ ఏడాది మార్చి 31 నాటికి శాశ్వతంగా చరమగీతం పాడబోతున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు భారతదేశ అంతర్గత భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దేశ యువతను పట్టిపీడిస్తున్న మాదక ద్రవ్యాల మహమ్మారిని సమూలంగా అంతం చేసేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. దిల్లీ పోలీసుల 79వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భవిష్యత్ కార్యాచరణను వివరించారు. “రాబోయే కొద్ది నెలల్లోనే కొత్త ‘జాతీయ భద్రతా నిర్మాణాన్ని‘ ఏర్పాటు చేస్తాం. దీని ప్రధాన లక్ష్యం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడమే. ఇందుకోసం దేశంలోని అన్ని రాష్ట్రాలను కలుపుతూ ఒక భారీ సీసీటీవీ నెట్‌వర్క్‌ను సృష్టిస్తాం. వీటిని పర్యవేక్షించడానికి ‘ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్స్‘ ఏర్పాటు చేస్తాం. ఈ నిఘా వ్యవస్థకు చట్టపరమైన రక్షణ కూడా కల్పిస్తాం. దీనివల్ల డ్రగ్స్ నేరాలను రియల్ టైమ్‌లో పసిగట్టడం సులభమవుతుంది“ అని షా అన్నారు.

**సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రత**

కేవలం అంతర్గత భద్రతే కాదు, సరిహద్దుల రక్షణపైనా కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందని షా తెలిపారు. “దేశంలోని ప్రతి భూ సరిహద్దులో భద్రతా ఏర్పాట్లను ఆధునీకరిస్తాం. నిఘా వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేస్తాం. ఫెన్సింగ్ (కంచె), ఇతర మౌలిక సదుపాయాలను బలపరుస్తాం. చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు భద్రతా దళాల మధ్య సమన్వయం పెంచుతాం. అక్రమ ప్రవేశాలకు ఇక ఆస్కారం ఉండదు“ అని తెలిపారు. అమిత్ షా తన ప్రసంగంలో మావోయిస్టుల ఏరివేతపై స్పష్టమైన డెడ్‌లైన్ విధించారు. “నక్సలిజం ఒకప్పుడు దేశంలోని 11 రాష్ట్రాలకు విస్తరించి పెద్ద సవాలుగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ సమస్య దాదాపుగా కొలిక్కి వచ్చింది. ప్రభావిత ప్రాంతాలను మావోయిస్టుల చెర నుంచి విడిపించడానికి మనం చాలా దగ్గరగా ఉన్నాం. మార్చి 31, 2026 నాటికి దేశం నుంచి మావోయిస్టు హింసను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం. ఇది మన



భద్రతా దళాలకు దక్కే అతిపెద్ద విజయం.“ అని అన్నారు.

**భద్రతకు స్వర్ణయుగం**

గత 12 ఏళ్ల కాలాన్ని (2014 నుంచి 2026 వరకు) భారత అంతర్గత భద్రత చరిత్రలో ‘స్వర్ణయుగం‘గా అమిత్ షా అభివర్ణించారు. “2014కు ముందు దేశాన్ని కశ్మీర్ సమస్య, ఈశాన్య రాష్ట్రాల్లో అలజడి, మావోయిస్టు హింస అనే మూడు ప్రధాన సమస్యలు వేధించేవి. ఈ మూడు సమస్యలు 3-4 దశాబ్దాలుగా దేశాన్ని పట్టిపీడించాయి. కానీ ఆర్టికల్ 370 రద్దు తర్వాత పరిస్థితులు మారాయి. కశ్మీర్, ఈశాన్య భారతం, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో హింస 80 శాతం తగ్గింది. ఈ మూడు ప్రాంతాలు పూర్తిగా హింస రహితంగా మారే రోజు ఎంతో దూరంలో లేదు“ అని వివరించారు.

**ఈశాన్యంలో శాంతి పవనాలు**

ఈశాన్య రాష్ట్రాల్లో వచ్చిన మార్పులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రస్తావించారు. “అక్కడ 10,000 మందికి పైగా యువకులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. 20కి పైగా శాంతి ఒప్పందాల ద్వారా ఆ ప్రాంతంలో ప్రశాంతత నెలకొల్పగలిగాం“ అని అన్నారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాల స్థానంలో తెచ్చిన మూడు కొత్త క్రిమినల్ చట్టాల గురించి కూడా షా మాట్లాడారు. “రాబోయే కాలంలో ఈ చట్టాలను సంపూర్ణంగా, సమర్థవంతంగా అమలు చేయడం పైనే హోం శాఖ దృష్టి సారిస్తుంది. పోలీసులకు, దర్యాప్తు సంస్థలకు దీనిపై పూర్తి స్థాయి శిక్షణ ఇస్తున్నాం. వారికి కావాల్సిన పరికరాలను సమకూరుస్తున్నాం“ అని చెప్పారు.

**దిల్లీ పోలీసులకు ప్రశంసలు**

దేశ రాజధాని రక్షణలో దిల్లీ పోలీసులు చూపుతున్న తెగువను మంత్రి అమిత్ షా కొనియాడారు. “పార్లమెంట్ దాడి కేసు అయినా, ఎర్రకోట సమీపంలో బాంబు పేలుడు అయినా, దిల్లీ పోలీసులు సమర్థవంతంగా పనిచేశారు. క్లిష్టమైన కేసులను ఛేదించడంలో వారి నైపుణ్యం అద్భుతం. 2029 నాటికి దేశం ఎదుర్కొంటున్న అన్ని భద్రతా సవాళ్లను సమన్వయంతో, నిరంతర కృషితో అధిగమిస్తాం“ అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

## మతపరమైన ప్రదేశాల్లో మహిళల వివక్ష కేసు

కేరళలోని శబరిమల ఆలయంతో సహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళల ప్రవేశంపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును విచారించేందుకు తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. ఈ విచారణను ధర్మాసనం ఏప్రిల్ 7న ప్రారంభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమల్య బాగ్చి, విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం చెప్పింది. ఇది ఏప్రిల్ 22 నాటికి ముగిసే అవకాశం ఉందని పేర్కొంది. మహిళల ప్రవేశంపై నిషేధానికి సంబంధించి మార్చి 14లోపు లిఖితపూర్వక వాదనలను సమర్పించాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, ఆలయ నిర్వాహకులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. శబరిమలతో పాటు మసీదులు, దర్గాలోకి మహిళల ప్రవేశంపై కూడా విచారించనుంది. అలాగే ఇతరులను పెళ్లి చేసుకున్న పార్సీ మహిళలకు మతపరమైన ప్రాంగణాల్లోకి ప్రవేశం లేకపోవండ వంటి అంశాలపై పరిగణనలోకి తీసుకుంది. అయితే నిర్ణయించిన షెడ్యూల్‌కు కట్టుబడి ఉండాలని అన్ని పక్షాలకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. 2019లో అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే ఏర్పాటు చేసిన 9 మంది న్యాయమూర్తుల ధర్మాసనం సమీక్ష పిటిషన్ల నిర్వహణను ఇప్పటికే నిర్ణయించిందని తెలిపారు. అయితే కొవిడ్ కారణంగా ఈ అంశంపై విచారణలను అకస్మాత్తుగా రద్దు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. దాదాపు ఐదేళ్ల తర్వాత మరో కొత్త ధర్మాసనంతో దీనిపై విచారణ జరపనున్నట్లు వెల్లడించారు.

**విచారణ పూర్తి షెడ్యూల్**

సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం, దర్మాసనం ఏప్రిల్ 7న ఉదయం 10:30 గంటలకు విచారణను ప్రారంభిస్తుంది.

ఏప్రిల్ 7 నుంచి 9 వరకు రివ్యూ పిటిషనర్ల వాదనలు

ఏప్రిల్ 14 నుంచి 16: రివ్యూ వ్యతిరేక పక్షాల వాదనలు

ఏప్రిల్ 21: రీజాయిండర్ సమర్పణలు

ఏప్రిల్ 22: అమికస్ కురియే తుది వాదనలు

నోడల్ కౌన్సిల్లు అండ్ అమికస్ నియామకాలు

2018 శబరిమల తీర్పు సమీక్షించాలనే మద్దతుదారుల తరఫున నోడల్ న్యాయవాదిగా కృష్ణ కుమార్ సింగ్‌ను, వ్యతిరేక పక్షాల తరఫున శాశ్వతి పారిని ధర్మాసనం నియమించింది. అమికస్ కురియేగా సీనియర్ అడ్వకేట్ కే పరమేశ్వర్, సహాయకుడిగా శివం సింగ్ నియమితులయ్యారు. 2018 శబరిమల తీర్పును సమీక్షించాలనే పటిషన్లకు కేంద్ర ప్రభుత్వ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మద్దతు తెలిపారు. అన్ని వయస్సుల మహిళలకు ప్రవేశం అనుమతించిన తీర్పును మళ్లీ పరిశీలించాలని సూచించారు. 2018లో శబరిమలలో 10 నుంచి 50 ఏళ్ల మధ్య మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని రద్దు చేస్తూ ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పునిచ్చింది. ఈ ఆచారం లింగ వివక్షగా పేర్కొంది. అయితే ఈ తీర్పుపై భారీ నిరసనలు జరిగాయి. తీర్పును సమీక్షించాలంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ కేసును 2019లో 9మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికి రిఫర్ చేసింది. 2020 మే 11న రివ్యూ పిటిషన్ల దశలో కూడా న్యాయపరమైన ప్రశ్నలను ప్రధాన ధర్మాసనానికి పంపించే అధికారం కోర్టుకు ఉంటుందని స్పష్టం చేసింది.

**ధర్మాసనం ముందున్న కీలక ప్రశ్నలు**

ఇక 2020లో రూపొందించిన ఏడు ప్రధాన న్యాయపరమైన ప్రశ్నల ఆధారంగానే ప్రస్తుత విచారణ సాగనుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం మత స్వేచ్ఛ హక్కు పరిధి ఎంత? ఆర్టికల్ 25 వ్యక్తిగత హక్కులు, ఆర్టికల్ 26 మత సంస్థల హక్కులు మధ్య సంబంధం ఏంటి? వంటి ప్రశ్నలను ధర్మాసనం పరిశీలించనుంది. అలాగే మత సమూహానికి చెందని వ్యక్తి పిల్ ద్వారా ఆచారాలను ప్రశ్నించవచ్చా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

## యక్షగానంలో దుమ్మురేపిన దివ్యాంగ బాలలు

ఆంధ్రప్రదేశ్‌లో కూచిపూడి, తెలంగాణలో చిందు భాగవతం లాగే కర్ణాటకలో యక్షగానం ఫేమస్. విశేషం ఏమిటంటే, యక్షగానం ప్రదర్శనలో పురుషులే భాగమవుతారు. స్టేజీపైకి వచ్చి యక్షగానం ప్రదర్శన ఇచ్చేందుకు ఒక్కో కళాకారుడు ఏళ్ల తరబడి శ్రమిస్తుంటాడు. కానీ కొందరు దివ్యాంగ బాలురు కేవలం 6 నెలల శిక్షణతో స్టేజీపై దుమ్మురేపారు. నటన, భావోద్వేగం, పాత్రలకు తగిన ముఖ కవళికలు, ఆకట్టుకునే ఆహార్యంతో భళా అనిపించారు. శిక్షణ, అవకాశం లభిస్తే ఏ కళారూపంలోనైనా తాము రాణించగలరని చాటి చెప్పారు. మంగళూరుకు చెందిన దివ్యాంగ బాలల కళా నైపుణ్యంపై కథనమిది. మంగళూరు నగరంలోని శక్తినగర్‌లో సానిధ్య స్పెషల్ చిల్డ్రన్స్ స్కూల్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఉంది. ఇందులో ఎంతోమంది దివ్యాంగ బాల, బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ విద్యాసంస్థలో విద్యార్థులకు చదువుతో పాటు డ్యాన్సింగ్, సింగింగ్, పెయింటింగ్ లాంటి కళలు, స్వయం ఉపాధి పనులనూ నేర్పిస్తుంటారు. సానిధ్య ఇన్‌స్టిట్యూట్ వార్షికోత్సవం సందర్భంగా ఏటా మంగళూరు నగరంలోని అతిపెద్ద కద్రి పార్కులో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. వీటిని చూసేందుకు యావత్ నగరం నుంచి ప్రజలు తరలి వస్తుంటారు. ఈసారి వార్షికోత్సవం కోసం కొన్ని నెలలు ముందు నుంచే పిల్లలకు వివిధ కళారూపాలలో ట్రైనింగ్ ఇచ్చారు. పిల్లలు యక్షగానం నేర్చుకోవడం చాలా టఫ్. అందుకే ఆరు నెలల ముందు నుంచే ఈవిభాగంలో 15 మంది బాలురకు ట్రైనింగ్‌ను మొదలుపెట్టారు. ఈసారి కద్రి పార్కులో నిర్వహించిన సానిధ్య ఇన్‌స్టిట్యూట్ వార్షికోత్సవంలో దివ్యాంగ బాలురు ప్రదర్శించిన యక్షగానం అందరినీ ఆకట్టుకుంది. ‘వరాహ అవతారం‘ అనే పురాణ గాథపై బాలురు ఇచ్చిన యక్షగానం ప్రదర్శన అందరి మన్ననలు అందుకుంది. భూదేవిని రక్షించేందుకు విష్ణుమూర్తి ధరించే వరాహ అవతారమే ఈ పురాణ గాథలోని ముఖ్యాంశం. శ్రీమహావిష్ణువు ధరించిన పది ప్రధాన అవతారాలలో వరాహ అవతారం మూడోది. దీనిపై యక్షగానం ప్రదర్శన కోసం ముందుగానే సానిధ్య ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు డైలాగ్‌లను కళాకారులతో చెప్పించి, ప్రత్యేక స్టూడియోలో వాటిని రికార్డు చేయించారు. ఆ రికార్డెడ్ డైలాగ్‌లను కద్రి పార్కులో ఏర్పాటు చేసిన స్టేజీపై ప్రదర్శించారు. ఈ డైలాగ్‌లకు అనుగుణంగా దివ్యాంగ బాలలు అద్భుతంగా జీవకళ ఉట్టిపడేలా భావ వ్యక్తీకరణ చేశారు. వారి ముఖ కవళికలు, కాళ్ల కదలికలు, ఆహార్యం, భావోద్వేగాలను వ్యక్తం చేసిన తీరు వీక్షకుల మనసులను హత్తుకుంది. యక్షగానంలో తమకు కేటాయించిన పాత్రల్లో ఆ బాలలు జీవించిపోయారు. రికార్డెడ్ సౌండ్‌లను వింటూ ఆ పిల్లలు నటిస్తున్నారు అంటే వీక్షకులు ఎవరూ నమ్మలేకపోయారు. అంతగా పాత్రల్లో దివ్యాంగ బాలలు ఇమిడిపోయారు. ఈ యక్షగాన కళారూపం ప్రదర్శనకు కద్రి ఏరియాకు చెందిన కళాకారుడు శరత్ కుమార్ కద్రి దర్శకత్వం వహించారు. సహాయ దర్శకుడిగా సుజీత్ కుమార్ వ్యవహరించారు.

**ఇదే తొలిసారేం కాదు**

సానిధ్య ఇన్‌స్టిట్యూట్ దివ్యాంగ బాలలు యక్షగాన ప్రదర్శన ఇవ్వడం ఇదే తొలిసారేం కాదు. గత 12 ఏళ్లుగా వాళ్లు ఈ క్లిష్టమైన నృత్య కళా విభాగంలో ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇంతకుముందు గురుదక్షిణ, దేవీ మహత్యం, భక్త ప్రహ్లాద, జాంబవతీ కళ్యాణం, భస్మాసుర మోహిని, లంకా దహనం, శ్రీకృష్ణ జన్మ - కంస వధ, శ్వేతకుమార చరిత్ర, జటాయు మోక్షం, మహిషి మోక్షం, నాగాస్త్ర కుంభకర్ణ కలగ వంటి పురాణ గాథలపై ఈ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన బాలలు ప్రదర్శనలిచ్చారు. సానిధ్య ఇన్‌స్టిట్యూట్ దివ్యాంగ బాలల యక్షగాన ప్రదర్శనలు కద్రి పార్కుకే పరిమితం కాలేదు. వారు రాష్ట్ర రాజధాని బెంగళూరులోని విధాన సౌధ, సుత్తూరు మఠంలలోనూ ప్రదర్శనలిచ్చి ప్రశంసలను అందుకున్నారు. కేవలం 3 నుంచి ఆరు నెలల్లోనే ఏ అంశంపై అయినా యక్షగానాన్ని ప్రదర్శించేలా సిద్ధం కావడం ఈ ఇన్‌స్టిట్యూట్ దివ్యాంగ బాలల ప్రతిభ, అంకితభావాలకు నిదర్శనం.

**‘డైలాగ్స్‌ను వింటూ అద్భుతంగా ప్రదర్శన‘**

‘మేం చాలా ఏళ్లుగా కద్రి పార్క్‌లో సానిధ్య ఇన్‌స్టిట్యూట్ వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నాం. మా కల్చరల్ కార్యక్రమాల్లో యక్షగానం అనేది ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంటుంది. ఈ సంవత్సరం మా ఇన్‌స్టిట్యూట్ పిల్లలు ‘వరాహావతారం‘ అనే అంశంపై యక్షగానాన్ని ప్రదర్శించారు. కళాకారులతో రికార్డ్ చేయించిన డైలాగ్స్‌ను వింటూ, బాలలు స్టేజీపై ప్రదర్శన ఇచ్చారు. ఆ డైలాగ్స్‌ను మా పిల్లలే స్టేజీపై లైవ్‌గా చెప్పారని చాలామంది అనుకున్నారు. అంత అద్భుతంగా మా వాళ్లు నటించారు. ఆరు నెలల శిక్షణ వల్లే పిల్లలు ఇంత అద్భుతంగా ప్రదర్శన ఇవ్వగలిగారు‘




## జాతరలో బీఆర్ఎస్ అన్నప్రసాదం

**సమయం న్యూస్, కాగజ్‌నగర్:** ఈస్గాం శివ మల్లన్న స్వామి జాతరను పురస్కరించుకుని భక్తులకు బీఆర్ఎస్ నేతల ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతర ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడుతున్న నేపథ్యంలో భక్తుల సేవనే పరమోద్దేశ్యంగా పార్టీ నాయకులు ముందుకు వచ్చి అన్నదానం చేపట్టారు. భక్తులకు అల్పాహారం, భోజనం, నీటి ప్యాకెట్లు, అవసరమైన ఏర్పాట్లు సమృద్ధిగా అందించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొని భక్తులకు భోజనం వడ్డిస్తూ సేవా స్ఫూర్తిని చాటిచెప్పారు. అన్నప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేస్తూ నిర్వాహకులను అభినందించారు. ప్రతియేటా ఈస్గాం జాతరలో ప్రజలకు సేవ చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు పార్టీ సీనియర్ నాయకులు తెలిపారు. సామాజిక సేవే తమ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.

## శివ మల్లన్న జాతరలో జనసంద్రం

### ఆధ్యాత్మిక ఉత్సాహంతో మార్మోగిన ప్రాంతం



**సమయం న్యూస్, కాగజ్‌నగర్:** ఈస్గాం శివమల్లన్న స్వామి జాతర భక్తులతో కిటకిటలాడింది. ప్రతి ఏడాది వచ్చే భక్తుల కంటే ఈసారి ఎన్నో రెట్లు జనసంద్రం పెరిగి జాతర ప్రాంతం ఉత్సవ వాతావరణంతో మార్మోగింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర సహా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చిన్నా పెద్దా, మహిళలు, వృద్ధులు, యువత అనే తేడా లేకుండా భక్తులు స్వామివారి దర్శనార్థం చేరుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తుల నినాదాలతో మార్మోగాయి. నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తాగునీరు, వైద్య శిబిరాలపై దృష్టి పెట్టారు.

## నాందేడ్‌లో సుకుమార్‌కు సన్మానం



**సమయం న్యూస్, ఆదిలాబాద్:** విశ్వగురు సంత్ రవిదాస్ జయంతిని పురస్కరించుకొని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సాహిత్య సమ్మేళన కార్యక్రమంలో జిల్లాకు చెందిన సాహితీవేత్త, అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే ను ఘనంగా సత్కరించారు. ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు అఖిల భారతీయ గురు రవిదాస్ సమతా ప్రతిష్టాన్, నాందేడ్ వారి తరపున తెలంగాణలో బహుజన మహనీయుల సాహిత్యం, విగ్రహాల ఏర్పాటుకు, సామాజిక మార్పుకు విశేషంగా కృషి చేస్తున్న సుకుమార్ పెట్కులే సేవలను గుర్తించిన వ్యవస్థాపక అధ్యక్షులు ఇంజనీర్ చంద్రప్రకాష్ దేగ్లూర్కర్ సుకుమార్ పేట్కూలే ను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుకుమార్ పెట్కులే మాట్లాడుతూ మహనీయుల అడుగుజాడల్లో నడవడం అంటే ముళ్ల బాటను ఎన్నుకోవడమేనని, ఆటంకాలను అధిగమించి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడే మహనీయుల ఆశయ సాధన కోసం కృషి చేయగలుగుతామని అన్నారు. కవి సమ్మేళనం లో బహుజన ఆలోచన విధానంపై సుకుమార్ పెట్కులే హిందీలో కవితను ఆలపించారు. కాగా ఆదిలాబాద్ కు చెందిన మధు బావల్కర్ తన ప్రసంగం తో పాటు కవితను మరాఠీలో ఆలపించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం జాతీయ అధ్యక్షులు శివదాస్ మహాజన్, పూణే పుండలీక్ భామోదే డాక్టర్ నిర్మలా బామోదే, నాగనాథ్ డోలారే, ఆనంద్ భాలే రావు, ప్రముఖ సాహితీవేత్త బహుభాషా కవి మధుబావల్కర్, నిర్వాహకులు చంద్ర ప్రకాష్, దేగళూర్కర్ తదితరులు పాల్గొన్నారు.

## చైర్‌పర్సన్‌గా బండారి అనూష



**సమయం న్యూస్, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్‌గా స్వతంత్ర అభ్యర్థిని అనూష బండారి ఎన్నికయ్యారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎంఐఎం, స్వతంత్రులు మొత్తం 27 కౌన్సిల్ మెంబర్లు సోమవారం ఓటు హక్కు వినియోగించి 45వ వార్డు కౌన్సిలర్ అనూషను మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎన్నుకున్నారు. దీంతో ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ ఉత్కంఠకు తెర వీడింది. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ 21, కాంగ్రెస్ 11 వార్డులలో విజయం సాధించగా, అధికార కాంగ్రెస్ పార్టీ గెలిచిన వార్డు సభ్యులు 11 మందితో కలిసి ఎంఐఎం ఆరుగురు, స్వతంత్ర అభ్యర్థులు నలుగురు, బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఆరుగురు వార్డు సభ్యులు స్వతంత్ర అభ్యర్థి అయిన బండారి అనూషకు మద్దతు ఇవ్వడంతో ఆమె మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్ గా ఏఐఎంఐఎం పార్టీ నుంచి గెలిచిన కౌన్సిలర్ మొహమ్మద్ రోహిత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ఒకరినొకరు మీఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా మేయర్, చైర్మన్ల ఎంపిక ప్రక్రియ

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**సమయం న్యూస్, మంచిర్యాల:** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఒక నగరపాలక సంస్థ, 4 పురపాలక సంఘాలకు జరిగిన ఎన్నికల్లో భాగంగా మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపిక ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్‌తో కలిసి ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన కార్పొరేటర్లతో మంచిర్యాల పట్టణంలోని నగరపాలక సంస్థ కార్యాలయ హాల్‌లో ఎన్నికల పరిశీలకులు గంగాధర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించినట్లు పేర్కొన్నారు. అనంతరం మేయర్ గా ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్ గా చల్లా రమ్యలను ఎన్నుకున్నారని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డుల్లో గెలుపొందిన కౌన్సిలర్లతో బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, కమిషనర్ సంపత్‌ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించి చైర్‌పర్సన్‌గా దావ స్వాతి, వైస్ చైర్‌పర్సన్‌గా రాగంశెట్టి సత్యనారాయణలను ఎన్నుకున్నారని చెప్పారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డుల్లో గెలుపొందిన కౌన్సిలర్లతో చెన్నూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం అనంతరం చైర్ పర్సన్‌గా పెద్దింటి పద్మ, వైస్ చైర్‌పర్సన్‌గా నాయకపు వినయ్‌లను ఎన్నుకున్నారని వివరించారు. అలాగే లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డుల్లో గెలుపొందిన కౌన్సిలర్లతో లక్షెట్టిపేట మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం చైర్‌పర్సన్‌గా దొంత అంజలి, వైస్ చైర్ పర్సన్ గా మోతుకూరి రాజేశ్వరిలను ఎన్నుకున్నారని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 22 వార్డులకు ఎన్నికలు జరగగా, సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో కోరం లేక ప్రమాణ స్వీకారం, చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక ప్రక్రియను ఈనెల 17వ తేదీకి వాయిదా వేయడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను జిల్లాలో అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు విద్యుత్ సర్ఫరాలో అంతరాయం

**సమయం న్యూస్, నేరడిగొండ:** మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో చేపడుతున్న విద్యుత్ మరమ్మత్తు పనుల కారణంగా మంగళవారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సర్ఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు

## ఐదుగురు వేటగాళ్ల రిమాండ్



**సమయం న్యూస్, బెజ్జూర్:** మండలంలోని మోగవెల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు వన్యప్రాణులను వేటాడినట్లు ఎఫ్ఆర్ఓ ముసవీర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మూగవెల్లి గ్రామానికి చెందిన కే సంజీవ్, టి శ్రీధర్, కే శ్రీహరి, ఏ శ్రీశైలం, ఏ శివరాం అనే ఐదుగురు వ్యక్తులు వన్య ప్రాణులను వేటాడినట్లు తెలిపారు. వీరిని పట్టుకొని విచారించగా నేరం అంగీకరించడం జరిగిందన్నారు. దీంతో వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేసి సోమవారం సిర్పూర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా, రిమాండ్ విధించడం జరిగిందని పేర్కొన్నారు. వన్యప్రాణుల వేట చట్టరీత్యా నేరమని, వన్యప్రాణులను వేటాడేందుకు ఉచ్చులు అమర్చినా, కరెంటు తీగలను ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అడవులు, వన్యప్రాణులు సంరక్షణ అందరి బాధ్యత అని, భావితరాలకు వాటిని అందించేందుకు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. అడవులను ధ్వంసం చేసినా, వన్యప్రాణులను వేటాడినా అటవీ చట్టాల ప్రకారం కఠిన శిక్షలు తప్పవన్నారు. ఆయన వెంట అటవీ శాఖ అధికారులు ఉన్నారు.

# చెరువుల అభివృద్ధిలో హైడ్రా భేష్

### ఉప్పల్ నల్లచెరువును పరిశీలించిన మంత్రి శ్రీధర్‌బాబు

పర్యావరణ హితమైన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి హైడ్రా చేస్తున్న కృషి అభినందనీయమని ఐటీ శాఖ మంత్రి శ్రీ శ్రీధర్ బాబు గారు అన్నారు. చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల పరిరక్షణలో హైడ్రా చొరవను కొనియాడారు. మరీ ముఖ్యంగా నగరంలో చెరువుల అభివృద్ధికి హైడ్రా ఎంతో కృషి చేస్తోందన్నారు. చెరువుతో పాటు.. ఆ పరిసర ప్రాంతాల రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. వరద నివారణతో పాటు.. పర్యావరణ పరిరక్షణకు, జీవవైవిధ్యానికి, భూగర్భ జలాల పరిరక్షణకు చెరువుల ప్రాధాన్యతను గుర్తించే వాటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ఉప్పల్‌లోని ఎస్ ఎన్ డీ పీ ప్రాజెక్టు పనులు ప్రారంభోత్సవానికి మంగళవారం వచ్చిన మంత్రి శ్రీధర్ బాబు గారు ఉప్పల్ నల్ల చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీ లక్ష్మారెడ్డితో పాటు.. ఎమ్మెల్సీ శ్రీ పి. మహేందర్ రెడ్డితో కలిసి ఐటీ మంత్రి ఉప్పల్ నల్లచెరువును సందర్శించారు. ఈ సందర్భంగా చెరువును ఎలా అభివృద్ధి చేస్తున్నారు.. ఏలా తీర్చిదిద్దుతున్నారు అనే విషయాలను అక్కడ చెరువు పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాట్స్ సంస్థ యజమాని మహమ్మద్ యూనస్‌ను అడిగి తెలుసుకున్నారు. చెరువు అభివృద్ధి పనులకు సంబంధించిన 3డీ నమూనాలను మంత్రి పరిశీలించారు.

#### ఫ్రంట్ ఎలివేషన్ బాగుండాలి..

ఉప్పల్ నల్లచెరువు ఫ్రంట్ ఎలివేషన్ బాగుండాలని మంత్రి శ్రీ శ్రీధర్‌బాబుగారు సూచించారు. వరంగల్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఈ చెరువుంది.. దాదాపు కిలోమీటరు పొడవునా చెరువు విస్తరించి ఉంది. రోడ్డు పొడవునా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. చెరువు చుట్టూ 2 కిలోమీటర్లకు పైగా వాకింగ్ ట్రాక్ వస్తుందని.., చిన్న పిల్లలు ఆడుకునే ప్లే ఏరియా, చెరువు చుట్టూ సీటింగ్ సౌకర్యం, పచ్చిక బైళ్లు, పార్కులు, అన్ని వయసులవారికి వ్యాయాయ పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయని అక్కడ పనులు చేపడుతున్న వారు మంత్రికి తెలిపారు. మురుగు నీరు కలవకుండా డైవర్ట్ కాలువలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఆక్రమణలతో 55 ఎకరాలకు కుంచించుకుపోయిన చెరువును 69 ఎకరాలకు విస్తరించామని.. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు ఇప్పటికే పలుమార్లు ఇక్కడికి వచ్చి పనులను పర్యవేక్షించారన్నారు. ఆక్రమణల తొలగింపు విషయంలో హైడ్రా అధికారుల చొరవ చెరువు విస్తరణకు దోహద పడిందని తెలిపారు. చెరువులో 3 మీటర్ల మేర పూడికను తొలగించామని . ప్రధాన ద్వారం చెరువుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు.

టీ వేణు గోపాల్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్



